
# జాతీయ స్ఫూర్తి
పక్షపత్రిక

2020, జనవరి 1-31

వెల : రూ.30/-


## భారత రాజ్యాంగం - ప్రస్తుత సవాళ్లు

ప్రత్యేక సంచిక

7-8

జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక
వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు
2020 జనవరి 1-31 సంపుటి : 28 సంచిక : 7,8
డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్
వెల : 30/- రూపాయలు

## ఈ సంచికలో...

3 రాజ్యాంగం గురించి డా॥ బి.ఆర్.అంబేద్కర్
6 భారత రాజ్యాంగం సంగ్రహ చిత్రం
15 భారత రాజ్యాంగం హక్కులు-విధులు
18 భారత రాజ్యాంగంలో షెడ్యూల్స్
20 రాజ్యాంగ రచన - రాజ్యాంగ సభ
22 జాతీయ పతాక రూపకల్పనలో ప్రతిఫలించిన భారతీయ బహుళత్వం - కొప్పర్తి
25 కాలపరీక్షకు నిలచిన రాజ్యాంగం - ఆర్వీ రామారావు
27 రాజ్యాంగ వ్యవస్థలపై మోదీ ప్రభుత్వ నీలి నీడలు - డా॥ రమేష్‌చంద్రబాబు
29 రాజ్యాంగ లక్ష్యాలపై దాడి - కె.ఎస్. లక్ష్మణరావు
31 రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న ఆర్ ఎస్ ఎస్ - డా॥ కత్తి పద్మారావు
33 ఆర్‌టిఐ సవరణ ప్రజల భాగస్వామ్యానికి భంగం
34 ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు
35 సైనిక రాజకీయం ప్రమాదకరం - విజయ్ ఒబెరాయ్
37 నేను ఈ దేశపు పౌరుడినేనా? - మాడభూషి శ్రీధర్
38 చలికాలపు 'వడ'గాలులు - మందలపర్తి కిషోర్
40 నెరవేరని దళిత రాజకీయ ఆకాంక్షలు - ప్రొ॥చల్లపల్లి స్వరూపరాణి
43 పని చేసేందుకు నాకొక రాజకీయ పార్టీ కావాలి - రేకా కృష్ణార్జునరావు
46 ఆంధ్రప్రదేశ్ 44వ చరిత్ర మహాసభలు - కొప్పర్తి

### సంపాదకీయం

# ప్రమాదంలో ప్రజల సార్వభౌమాధికారం

రాజ్యాంగం మన సర్వోన్నత చట్టం. దాని పరిధిలోనే న్యాయవ్యవస్థతో సహా అన్ని చట్ట సభలు, ప్రభుత్వాలు వ్యవహరిస్తాయి. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు వున్నా దాని మౌలిక చట్రాన్ని మార్చే అవకాశం మాత్రం లేదు. రాజ్యాంగం పౌరులను సార్వభౌములను చేసింది. భారత పౌరులమైన మేము... అని ప్రారంభించి తిరిగి దానిని వారికే సమర్పించింది. ఇదీ రిపబ్లిక్ సూత్రం. అదే మన రాజ్యాంగ లక్ష్యం.

మన రాజకీయ వ్యవస్థ దీనిని తల్లకిందులు చేసింది. ప్రజలకు బదులు పాలకులే ప్రభువులుగా అధికారం చెలాయిస్తున్నారు. ఎన్నికలు డబ్బు సంచుల చుట్టూ తాయిలాల చుట్టూ తిరుగుతున్నాయి. ప్రభుత్వాలు కార్పొరేట్ల చుట్టూ తిరుగుతున్నాయి. అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగం కూడా కార్పొరేట్ల పరం అయ్యింది. సామాన్య ప్రజలు ఇప్పుడు సార్వభౌములు కాదు, కేవలం ఓటర్లు మాత్రమే. పాలితులు మాత్రమే. రాజ్యాంగం యధాతథంగా కనిపిస్తున్నా మన ఎన్నికల వ్యవస్థ, మన రాజకీయ వ్యవస్థ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నడుస్తున్నాయి.

ఇప్పుడు అధికారంలో వున్న మోదీ ప్రభుత్వానికి అవసరానికి మించిన మెజారిటీ వుంది. దానికి మతోన్మాద హిందుత్వ సిద్ధాంతం వుంది. వారి మూల విరాట్టు అయిన ఆర్ ఎస్ ఎస్ ఆదిలోనే భారత రాజ్యాంగాన్ని తిరస్కరించింది. హిందూ మనుధర్మాన్ని మించిన రాజ్యాంగం మరొకటి లేదని ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత రాజ్యాంగాన్ని డొల్ల చేయడానికి పూనుకుంది. ముందుగా దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. చాలా వాటిని కీలుబొమ్మలుగా చేసుకుంది. సిబిఐ ని వినియోగిస్తున్న తీరు, సమాచార చట్టానికి తెచ్చిన సవరణలు, సైన్యాధికారుల రాజకీయ ప్రకటనలు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల నియామకాలు దీనికి అద్దం పడుతున్నాయి. ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు పత్రికలకు ఎక్కాల్సిన పరిస్థితి వగైరాలన్నీ రాజ్యాంగ వ్యవస్థల మీద సాగుతున్న దాడిని స్పష్టం చేస్తున్నాయి.

మరో పక్క ఈ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల దేశంలో ఆర్థికరంగం విషమ పరిస్థితిని ఎదుర్కొంటున్నది. దానిని పక్కనపెట్టి ఓట్లు దండుకునే సాధనంగా దేశాన్ని మతపరంగా చీల్చే పౌరసత్వసవరణ చట్టంతో పాటు దేశవ్యాపితంగా ఎన్.ఆర్.సి. ని ఎన్.పి.ఆర్.ని అమలుకు పూనుకుంది. భారత రాజ్యాంగంలో పౌరసత్వానికి మతం ప్రాతిపదికగా లేదు. ఇప్పుడు దానిని రాజ్యాంగవిరుద్ధంగా దొడ్డి దారిలో ప్రవేశ పెట్టారు. ఇలా రాజ్యాంగానికి వరుసగా తూట్లు పడుతున్నాయి. రాజ్యాంగానికి పాలకులు రక్షకులు కారని, భక్షకులుగా మారడాన్ని అందరూ గుర్తించాలి. ప్రజలే రాజ్యాంగాన్ని, తమ సార్వభౌమాధికారాన్ని రక్షించుకోవాలి. ❑

# రాజ్యాంగం గురించి డా॥ బి.ఆర్. అంబేద్కర్

**రాజ్యాంగ నిర్ణయసభ చివరి సమావేశంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 1949 నవంబర్ 25న చేసిన ముగింపు ఉపన్యాసం**

(లాంఛనప్రాయమైన కృతజ్ఞతలు, స్థూల అంశాలు, ఉపోద్ఘాతం ముగిసిన తర్వాత)

జనవరి 26, 1950న భారతదేశం స్వతంత్ర దేశంగా మారుతుంది. ఆ స్వాతంత్ర్యానికి ఏమవుతుంది? భారతదేశం తన స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోగలుగుతుందా, లేదా మరొకసారి కోల్పోతుందా? నా మదిలో మెదులుతున్న మొదటి ఆలోచన ఇది. భారతదేశం గతంలో స్వాతంత్ర్యం అనుభవించిన దేశమే. కాని అది తన స్వాతంత్ర్యాన్ని ఒకసారి కోల్పోయింది. అది తన స్వాతంత్ర్యాన్ని రెండోసారి కోల్పోతుందా? ఈ ఆలోచనే భవిష్యత్తు పట్ల నన్ను ఆందోళనలో ముంచెత్తుతున్నది.



భారతదేశం తన స్వాతంత్ర్యాన్ని ఒకసారి కోల్పోయిందనే విషయం మాత్రమే కాదు, ఆ ఓటమి తన సొంత ప్రజల అవిధేయత వల్లా, విద్రోహం వల్ల జరిగిందనే విషయం నన్ను తీవ్రంగా కలచివేస్తున్నది.

సింధ్‌ను మహమ్మద్ బిన్ కాసిం దురాక్రమిస్తున్నప్పుడు రాజు దహర్ దగ్గర పనిచేస్తుండిన సైనికాధికారులు మహమ్మద్ బిన్ కాసిం తైనాతీల నుంచి లంచాలు తిన్నారు. తమ సొంత రాజు కోసం యుద్ధం చేయడం మానుకున్నారు. మహమ్మద్ ఘోరీ భారతదేశం మీద దండెత్తుతున్నప్పుడు ఆహ్వానించినవాడూ, పృథ్వీరాజు మీద యుద్ధం చేయమనీ, తానూ, సోలంకి రాజులూ సహకరిస్తామని చెప్పినవాడూ జైచంద్. శివాజీ హిందువుల విముక్తి కోసం పోరాడుతున్నప్పుడు ఇతర మరాఠా ప్రభువులూ రాజపుత్ర రాజులూ మొఘల్ చక్రవర్తుల పక్షం వహించారు. సిక్కు పాలకులను మట్టి కరిపించడానికి బ్రిటిష్ వారు ప్రయత్నిస్తున్నప్పుడు సిక్కుల ప్రధాన సైనికాధికారి గులాబ్ సింగ్ మౌనంగా కూచుని, సిక్కు రాజ్యాన్ని కాపాడకుండా ఉండిపోయాడు. 1857లో భారతదేశంలో అత్యధికభాగం బ్రిటిష్ వారి మీద స్వాతంత్ర్య యుద్ధం ప్రకటించినప్పుడు, సిక్కులు ఆ పరిణామాలకు మౌనసాక్షులుగా నిలిచిపోయారు.

ఆ చరిత్ర పునరావృతమవుతుందా? ఆ ఆలోచనే నాలో ఆందోళన నింపుతున్నది. కులాలు, మతాల రూపంలోని మన పాత శత్రువులతో పాటు, ఇక ముందు మనకు విభిన్నమైన, పరస్పర వ్యతిరేకమైన రాజకీయ అభిమతాల రాజకీయ పార్టీలెన్నో ఉండబోతున్నాయనే వాస్తవం గుర్తిస్తే నా ఆందోళన మరింత పెరుగుతున్నది. భారతీయులు తమ దేశాన్ని తమ మతం కన్న ముందు పెడతారా, లేక మతాన్నే దేశం కన్న ముందు పెడతారా? నాకు తెలియదు. కాని నిశ్చితంగా చెప్పగలదేమంటే రాజకీయ పార్టీలు గనుక దేశం కన్న మతాన్నే పైన పెట్టేట్టయితే, మన స్వాతంత్ర్యం రెండోసారి కూడ ప్రమాదంలో పడుతుంది. బహుశా ఎప్పటికీ కోల్పోయే స్థితి వస్తుంది. ఈ దుష్పరిణామం రాకుండా మనందరమూ నిర్ణయాత్మకంగా పనిచేయవలసి ఉంది. మన చివరి రక్తపు బొట్టు వెచ్చించి అయినా సరే మన స్వాతంత్ర్యాన్ని కాపాడడానికి మనం దృఢదీక్ష తీసుకోవలసి ఉంది.

1950 జనవరి 26న భారతదేశం ఒక ప్రజాస్వామిక దేశంగా మారనున్నది. అంటే ఆ రోజు నుంచి భారతదేశం ప్రజల యొక్క ప్రజల చేత, ప్రజల కొరకు ఉండే ప్రభుత్వాన్ని చూడబోతున్నది. ఇక్కడ కూడ నాలో అదే ఆలోచన తలెత్తుతున్నది. భారత ప్రజాస్వామిక రాజ్యాంగానికి ఏమవుతుంది? భారతదేశం ఆ రాజ్యాంగాన్ని నిర్వహించుకోగలుగుతుందా లేక దాన్ని కూడ కోల్పోతుందా? నా మదిలో మెదులుతున్న రెండో ఆలోచన ఇది. మొదటి ఆలోచనలాగనే ఇది కూడ నన్ను ఆందోళన పరుస్తున్నది.

భారతదేశానికి ప్రజాస్వామ్యం అంటే తెలియదని కాదు. ఒకానొక కాలంలో భారతదేశం నిండా గణతంత్ర రాజ్యాలుండేవి. రాచరికాలు ఉన్నప్పుడు కూడ అవి ఎన్నికల ద్వారానో, పరిమిత అధికారాలతోనో ఉండేవి. ఎప్పుడూ సంపూర్ణ నిరంకుశాధికారాలు లేవు. భారతదేశానికి ప్రజా ప్రాతినిధ్య సభలూ పార్లమెంటరీ పద్ధతులూ కూడ తెలియనివేమీ కావు.

బౌద్ధుల భిక్కు సంఘాలను అధ్యయనం చేస్తే, ఆ సంఘాలు పార్లమెంట్లుగా వ్యవహరించాయని మాత్రమే కాదు, ఆధునిక కాలానికి తెలిసిన పార్లమెంటరీ పద్ధతుల సూత్రాలన్నీ ఆ సంఘాలకు కూడ తెలుసుననీ, అవి వాటిని పాటించాయనీ కూడ అర్థమవుతుంది. ఎవరు ఎక్కడ కూచోవాలో సూత్రాలున్నాయి. ప్రతిపాదనలు ఎలా పెట్టాలో, తీర్మానాలు ఎలా ప్రవేశపెట్టాలో, కనీసం ఎంత మంది ఉంటే నిర్ణయాలు తీసుకోవాలో చెప్పే సూత్రాలు, ఒక వైఖరి తప్పనిసరిగా తీసుకోవాలని నియంత్రించే

సూత్రాలు (విప్), వోట్ల లెక్కింపు, రహస్య వోటింగ్, అభిశంసించే తీర్మానాలు, క్రమబద్ధీకరణ, నిర్ణయం జరిగిపోయిన అంశం మీద చర్చను నియంత్రించే సూత్రాలు వగైరా ఎన్నో ఉన్నాయి. స్వయంగా బుద్ధుడే సంఘ సమావేశాలలో ఈ పార్లమెంటరీ పద్ధతుల సూత్రాలను వర్తింపజేసినప్పటికీ, ఆయన తన కాలంలో దేశంలో ఉనికిలో ఉండిన రాజకీయ ప్రాతినిధ్య సభల సూత్రాలనే గ్రహించి ఉంటాడు.

ఆ ప్రజాస్వామిక వ్యవస్థను భారతదేశం కోల్పోయింది. మరి రెండోసారి కూడ దాన్ని కోల్పోతుందా? నాకు తెలియదు. కాని సుదీర్ఘకాలంగా వినియోగంలో లేని, ఏదో కొత్తగా వచ్చినదిగా గుర్తించబడుతున్న ప్రజాస్వామ్యాన్ని పాటిస్తున్న భారతదేశంలో ప్రజాస్వామ్యం స్థానంలో నియంతృత్వం తలెత్తే ప్రమాదం ఎంతగానో ఉంది. ఇప్పుడు కొత్తగా జన్మిస్తున్న ప్రజాస్వామ్యం కేవలం రూపంలో మాత్రమే మిగిలిపోయి, వాస్తవంలో నియంతృత్వం తలెత్తడానికి చాల అవకాశం ఉంది. ఏదో ఉత్పాతం జరిగితే, ఈ రెండో ప్రమాదం వాస్తవంగా మారే అవకాశం మరింతగా ఉంటుంది.

మనం ప్రజాస్వామ్యాన్ని కేవలం రూపంలో మాత్రమే కాక, వాస్తవంగా నిలుపుకోవాలంటే ఏం చేయవలసి ఉంది?

నా అంచనాలో మనం చేయవలసిన మొట్టమొదటి పని మన సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో రాజ్యాంగబద్ధ పద్ధతులకు కట్టుబడి ఉండాలి. దాని అర్థమేమంటే మనం విప్లవపు రక్తపాత పద్ధతులను వదిలివేయాలి. దాని అర్థమేమంటే మనం పౌర శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి పద్ధతులను వదిలివేయాలి. ఆర్థిక, సామాజిక లక్ష్యాలను సాధించడానికి రాజ్యాంగబద్ధ పద్ధతులకు అవకాశం లేనప్పుడు, రాజ్యాంగేతర పద్ధతులు ఉపయోగించడానికి చాల సమర్థనీయమే. కాని రాజ్యాంగబద్ధమైన పద్ధతులకు అవకాశం ఉన్నప్పుడు, రాజ్యాంగేతర పద్ధతులు ఉపయోగించడానికి సమర్థన లేదు. ఆ పద్ధతులు కేవలం అరాచక పద్ధతులు మాత్రమే అవుతాయి. వాటిని మనం ఎంత తొందరగా వదులుకుంటే అంత మంచిది.

రెండో విషయం, ప్రజాస్వామ్య నిర్వహణ మీద ఆసక్తి ఉన్న వాళ్లందరికీ జాన్ స్టువార్ట్ మిల్ చేసిన హెచ్చరికను పాటించడమే మనం చేయవలసిన పని. అదేమంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఎంత గొప్ప వారి పాదాల దగ్గరైనా పెట్టకపోవడం, ఎంత గొప్పవారినైనా నమ్మి ప్రజాస్వామిక వ్యవస్థలను తిరగదోయగల అధికారాన్ని వారి చేతుల్లో పెట్టకపోవడం. దేశానికి తమ యావజ్జీవిత సేవలు అందించిన మహానుభావుల పట్ల కృతజ్ఞత చూపడం తప్పేమీ కాదు. కాని కృతజ్ఞతకు కూడ పరిమితులున్నాయి. ఐరిష్ దేశభక్తుడు డానియెల్ ఓకానెల్ సరిగ్గా చెప్పినట్టుగా, ఏ పురుషుడూ తన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేంత, ఏ మహిళా తన శీలాన్ని పోగొట్టుకునేంత, ఏ దేశమూ తన స్వేచ్ఛను త్యాగం చేసేంత కృతజ్ఞత ఉండగూడదు. భారతదేశం విషయంలో ఏ దేశం కన్నా మరింత ఎక్కువగా ఈ హెచ్చరిక అవసరం. ఎందుకంటే, భారతదేశపు రాజకీయాల్లో భక్తి లేదా ఆరాధనా మార్గం, లేదా వీరపూజ ప్రపంచంలోని మరే దేశ రాజకీయాల్లో కన్న ఎక్కువ పాత్ర వహిస్తాయి. మతంలోనైతే భక్తి అనేది ఆత్మ విమోచనకు మార్గం కావచ్చు. కాని రాజకీయాల్లో భక్తి లేదా వీరపూజ పతనానికి కచ్చితమైన మార్గం. అంతిమంగా అది నియంతృత్వానికే దారి తీస్తుంది.

మనం చేయవలసిన మూడో విషయం , కేవలం రాజకీయ ప్రజాస్వామ్యంతో సంతృప్తి చెందకుండా ఉండడం. మనం మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా తయారు చేయవలసి ఉంది. పునాదిలో సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనజాలదు.

సామాజిక ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? అంటే స్వేచ్ఛను, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని జీవనసూత్రాలుగా గుర్తించే జీవన విధానం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఈ సూత్రాలను వేరువేరుగా ఉండే త్రిమూర్తులుగా భావించగూడదు. అది మూడు మూర్తులు కలిసిన ఒకే ఐక్యసూత్రం. వాటిలో ఒకదాని నుంచి మరొకదాన్ని వేరు చేస్తే అసలు ప్రజాస్వామ్య ప్రయోజనమే దెబ్బ తింటుంది.

స్వేచ్ఛను సమానత్వం నుంచి వేరు చేయడానికి వీలులేదు. సమానత్వాన్ని స్వేచ్ఛ నుంచి వేరు చేయడానికి వీలు లేదు. స్వేచ్ఛనూ, సమానత్వాన్ని సౌభ్రాతృత్వంతో వేరు చేయలేము. సమానత్వం లేకుండా స్వేచ్ఛ మాత్రమే ఉంటే అది అనేకుల మీద కొందరి ఆధిపత్యాన్ని సృష్టిస్తుంది. స్వేచ్ఛ లేకుండా సమానత్వం మాత్రమే ఉంటే అది వ్యక్తిగతచొరవను చంపివేస్తుంది. సౌభ్రాతృత్వం లేకుండా స్వేచ్ఛా సమానత్వాలు సహజంగా వికసించలేవు. వాటిని అమలు చేయడానికి సౌభ్రాతృత్వం రక్షక భటుడుగా ఉండాలి.

భారత సమాజంలో ఈ మూడింటిలో రెండు ఎంతమాత్రం లేవనే గుర్తింపుతో మనం ప్రారంభిద్దాం. ఆ రెంటిలో ఒకటి సమానత్వం. సామాజిక తలంలో భారత సమాజం తారతమ్య అసమానత సూత్రం పునాదిగా ఉంది. ఈ సమాజంలో కొందరికి అపార సంపద, అసంఖ్యాకులు దుర్భర దారిద్ర్యంలో జీవించే స్థితి ఉంది.

జనవరి 26, 1950న మనం ఒక వైరుధ్యమయమైన జీవితంలో ప్రవేశించబోతున్నాం. రాజకీయాలలోనేమో మనకు సమానత్వం ఉంటుంది. సామాజిక ఆర్థిక జీవనంలో మాత్రం

మనకు అసమానత్వం ఉంటుంది. రాజకీయాలలో మనం ఒక మనిషికి ఒక ఓటు ఒక విలువ అనే సూత్రాన్ని గుర్తిస్తాం. కాని మన సామాజిక, ఆర్థిక జీవనంలో మన సామాజిక ఆర్థిక వ్యవస్థ కారణంగా ఒక మనిషికి ఒక విలువ అనే సూత్రాన్ని నిరాకరించడం కొనసాగిస్తాం. ఈ వైరుధ్యమయమైన జీవితాన్ని ఎంత కాలం కొనసాగించగలం? మన సామాజిక, ఆర్థికజీవనంలో సమానత్వాన్ని నిరాకరిస్తూ ఎంత కాలం కొనసాగగలం? ఆ నిరాకరణను మనం ఎంత ఎక్కువ కాలం కొనసాగనిస్తే, అంత ఎక్కువ కాలం మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో ఉంచుతూనే ఉంటాం. వీలైనంత త్వరగా మనం ఈ వైరుధ్యాన్ని రద్దు చేయవలసి ఉంది. అలా జరగకపోతే, అసమానత వల్ల బాధలు అనుభవిస్తున్నవారు ఈ రాజ్యాంగ నిర్ణయ సభ సుదీర్ఘ కాలం కష్టపడి నిర్మించిన మన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని పేల్చివేస్తారు.

మనలో కొరతగా ఉన్న రెండో అంశం సౌభ్రాతృత్వ భావనను గుర్తించకపోవడం. సౌభ్రాతృత్వం అంటే ఏమిటి? సౌభ్రాతృత్వం అంటే భారతీయులందరి మధ్య ఒక ఉమ్మడి సోదర భావన. భారతీయులందరమూ ఒకటే అనే భావన. మన సామాజిక జీవనానికి ఐక్యతను, సంఘీభావాన్ని ఇచ్చే సూత్రం అది. కష్ట సాధ్యమైన సూత్రం అది. ఈ సౌభ్రాతృత్వాన్ని సాధించడం ఎంత కష్టమో అమెరికా సంయుక్త రాష్ట్రాల విషయంలో అమెరికన్ కామన్వెల్త్ గురించి జేమ్స్ బ్రెస్ రాసిన సంపుటంలో తెలుస్తుంది.

ఆ కథను బ్రెస్ రాసిన మాటల్లోనే వివరిస్తాను. "కొన్ని సంవత్సరాల కింద అమెరికన్ ప్రొటెస్టెంట్ ఎపిస్కోపల్ చర్చ్ తన త్రిశతజయంతి సమావేశంలో తన ప్రార్థనా గ్రంథానికి సవరణలు చేయాలని తలపెట్టింది. దాని చిన్న వాక్యాల ప్రార్థనలలో యావత్ ప్రజా సమూహానికీ వర్తించే మాటలు చేర్చాలని అనుకున్నారు. ఒక ప్రముఖ మతాచార్యుడు 'భగవంతుడా, మా దేశాన్ని దీవించు' అనాలని ప్రతిపాదించాడు. ఆ మధ్యాహ్నం తక్షణమే ఆ మాటను అందరూ ఆమోదించారు. మర్నాడు ఆ వాక్యం పునఃపరిశీలనకు వచ్చింది. ఎందరెందరో ఎన్నో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 'దేశాన్ని' అనే మాట వాడితే జాతీయ ఐక్యత గురించి ఒక నిశ్చిత గుర్తింపు ధ్వనిస్తున్నదని, అది కుదరదని అభ్యంతరాలు వచ్చాయి. ఆ మాటను వదిలేశారు. చివరికి అందరికీ ఆమోదయోగ్యమైన 'భగవంతుడా, సంయుక్త రాష్ట్రాలను దీవించు' అనే వాక్యాన్ని అంగీకరించారు.

ఈ ఘటన జరిగినప్పుడు అమెరికా సంయుక్త రాష్ట్రాల మధ్య సంఘీభావం అంత తక్కువగా ఉండింది. అమెరికా ప్రజలు తమను తాము ఒక దేశంగా కూడ గుర్తించుకోలేదు. అమెరికా ప్రజలే అలా తమది ఒక దేశం అని గుర్తించలేకపోయినప్పుడు, భారతీయులు తమను తాము ఒక దేశం అని గుర్తించడం ఎంత కష్టం?

రాజకీయ అభిప్రాయాలున్న భారతీయులు భారతదేశ ప్రజలు' అనే మాటను అంగీకరించని రోజులు ఉండేవని నాకింకా గుర్తుంది. ఆ మాట బదులు వాళ్లు 'భారత జాతి' అనాలని భావించేవారు. కాని మనం ఒక జాతి అని అనుకోవడంలో మనం ఒక పెద్ద భ్రమలో బతుకుతున్నామని నాకనిపిస్తుంది. వేలాది కులాలుగా విభజింపబడిన ప్రజలు ఒక జాతిగా ఎలా ఉండగలరు? జాతి అంటే ఉండే సామాజిక, మనస్తత్వపరమైన అర్థంలో మనం ఇంకా ఒక జాతి కామని మనం ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచిది. అలా గుర్తించినప్పుడు మాత్రమే మనం ఒక జాతిగా రూపొందవలసిన అవసరాన్ని గ్రహించగలం. ఆ గమ్యాన్ని చేరడానికి ఉన్న మార్గాలూ సాధనాలు ఏమిటో తీవ్రంగా ఆలోచించగలం. ఆ లక్ష్యాన్ని సాకారం చేసుకోవడం నిజంగా చాల కష్టతరమైనది. అది అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కన్న ఎక్కువ కష్టతరమైనది. అమెరికాలో కుల సమస్య లేదు. భారత దేశంలో కులాలు ఉన్నాయి. కులాలు దేశద్రోహకరమైనవి. అవి ఎందుకు దేశద్రోహకరమైనవంటే, మొట్టమొదట అవి సామాజిక జీవనంలో వేర్పాటును తీసుకువస్తున్నాయి. అలాగే అవి ఎందుకు దేశద్రోహకరమైనవంటే అవి కులానికీ కులానికీ మధ్య ఈర్ష్యాసూయలనూ, వైమనస్యాన్నీ సృష్టిస్తాయి. కాని వాస్తవంగా మనం ఒక దేశంగా, జాతిగా మారాలని కోరుకుంటే ఈ అవరోధాలన్నిటినీ అధిగమించవలసి ఉంది. ఎందుకంటే ఒక్క దేశం, ఒక్క జాతి ఉన్నప్పుడు మాత్రమే సౌభ్రాతృత్వం అనేది సాధ్యమవుతుంది. సౌభ్రాతృత్వం లేకుండా సమానత్వమూ స్వేచ్ఛా అనేవి పైన వేసిన రంగుల కన్న ఎక్కువ లోతుకు పోజాలవు.

మన ముందు ఉన్న కర్తవ్యాల గురించి ఇవీ నా ఆలోచనలు. ఇవి కొందరికి అంత సంతోషకరంగా ఉండకపోవచ్చు. కాని ఒక మాట చెప్పక తప్పదు. ఈ దేశంలో రాజకీయాధికారం అనేది సుదీర్ఘ కాలంగా అతి కొద్ది మంది గుత్తాధిపత్యంగా ఉండిపోయింది. అశేష ప్రజానీకం కేవలం గొడ్డుచాకిరీకి మాత్రమే కాదు, వేటాడబడే జంతువులుగా కూడ ఉండిపోయారు. కొందరికి ఉన్న గుత్తాధిపత్యం వల్ల అశేష ప్రజానీకానికి తన జీవన పరిస్థితులు మెరుగుపరచుకునే అవకాశాలు నిరాకరించబడడం మాత్రమే కాదు, వారి జీవన ప్రాధాన్యత అనేదే వారి నుంచి కొల్లగొట్టబడింది. ఈ అణగారిన వర్గాలు ఇంకెంతమాత్రమూ పాలించబడడానికి సిద్ధంగా లేవు. తమను తాము పాలించుకోవాలనే అసహనం వారిలో ముప్పిరిగొంటున్నది. ఈ అణగారిన వర్గాలలో స్వీయ ఆకాంక్షల సాకారం కోసం తపన వర్గపోరాటం

☞ మిగతా 14వ పేజీలో

# భారత రాజ్యాంగం సంగ్రహ చిత్రం

### 1 వ భాగం : సమన్వయ భారతం:

దేశనామము, సమన్వయ భారత పరిధి 2 వ అధికరణ: నూతన రాష్ట్రాల స్థాపించుట, చేర్చుకొనుట 2 ఎ వ అధికరణ: ఉపసంహరింపబడింది. 3వ అధికరణ: నూతన రాష్ట్రాల ఏర్పాటు, ఇప్పుడున్న రాష్ట్రా పరిధులు, విస్తీర్ణముల మార్పూ 4వ అధికరణ: 2,3 లకు ఉపయుక్తమైనవి, ఆవశ్యకమైనవి, అనుసంభవమైన మార్పులు; ఒకటి, నాలుగు షెడ్యూలులో మార్పులు.

### 2 వ భాగం : పౌరసత్వం

5 వ అధికరణ: ఈ సంవిధానం ప్రారంభంనాటి పౌరసత్వం 6 వ అధికరణ: పాకిస్తాన్ నుంచి వలస వచ్చిన వారి పౌరసత్వ హక్కులు. 7 వ అధికరణ: పాకిస్తాన్ నుంచి వలసపోయిన వారి పౌరసత్వ హక్కు. 8వ అధికరణ: వేరే ఇతర దేశములలో నివసిస్తున్న జన్మత భారతీయులైన వారి పౌరసత్వ హక్కు 9 వ అధికరణ : తమంతట తాము ఇతర దేశములందు పౌరసత్వ హక్కును సంపాదించుకొన్నవారు భారత పౌరులు కారు. 10 వ అధికరణ: పౌరసత్వ హక్కు, దాని కొనసాగింపు 11 వ అధికరణ: పౌరసత్వ హక్కును నియంత్రణ చేయు అధికారం

### 3 వ భాగం : ప్రాథమిక హక్కులు - సాధారణ వివరణ

12 వ అధికరణ: నిర్వచనము 13 వ అధికరణ: ప్రాథమిక హక్కులతో సరిపడనివి, అపవాదమైనవి అయిన చట్టములు

సమానత్వం: 14 వ అధికరణ: చట్టం ముందు అందరూ సమానులే 15 వ అధికరణ: మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా చూపే వివక్షత నిషేధం... 16 వ అధికరణ: ప్రభుత్వోద్యోగ వసతులతో సమానవకాశాలు 17 వ అధికరణ: అస్పృశ్యత నిషేధించడమైనది. 18 వ అధికరణ:కితాబుల రద్దు.

వ్యక్తి స్వేచ్ఛ: 19 వ అధికరణ: వాక్స్వాతంత్ర్యము మొదలైన హక్కుల పరిరక్షణ 20 వ అధికరణ: నేరారోపణ పరంపరంలో నేరస్తుడి హక్కులు 21వ అధికరణ : వ్యక్తి స్వాతంత్ర్యం, వ్యక్తి జీవనానుభవముల రక్షణ 21వ ఎ) అధికరణ: విద్యను అభ్యసించు హక్కు 22 వ అధికరణ: విచారణలేని నిర్బంధం గురించిన రక్షణలు 23 వ అధికరణ: మానవుల క్రయ విక్రయాల నిషేధం, నిర్బంధకూలీ నిషేధం 24 వ అధికరణ: కర్మాగారాలలో పసివారి నియామకం, నిషేధం

### మత స్వేచ్ఛ :

25వ అధికరణ: మనసారా అత్మసాక్షిగా నమ్మే విశ్వాసములకు, మతప్రచారములకు సంపూర్ణ స్వాతంత్ర్యం. 26వ అధికరణ: మతపరమైన వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు 27 వ అధికరణ: మత ప్రచార ప్రోత్సాహం కొరకు విధింపబడే పన్నులు ఇతరులను బాధింపరాదు 28 వ అధికరణ: విద్యాసంస్థలలో మతపరమైన బోధనలు, పూజలందు నిర్బంధం ఉండరాదు, సాంఘిక సాంస్కృతిక విద్యాపరమైన హక్కులు. 29 వ అధికరణ: అల్పసంఖ్యాకుల సంక్షేమ రక్షణ 30 వ అధికరణ: విద్యాసంస్థలను స్థాపించుట కొరకు అల్పసంఖ్యాకులకు కల్పించిన రక్షణలు. 31వ అధికరణ: ఉపసంహరింపబడినది

### కాపాడబడిన చట్టములు :

31 ఎ) వ అధికరణ: ఎస్టేట్స్ సేకరణ చట్టాలకు కల్పించిన రక్షణ 31 బి) వ అధికరణ: కొన్ని చట్టాల పునరుద్ధరణ 31 సి) వ అధికరణ: ఆదేశిక సూత్రాలను అనుసరించి చేసిన చట్టాలకు రక్షణ 31 డి) వ అధికరణ: ఉపసంహరింపబడినది 32 వ అధికరణ : ప్రాథమిక హక్కుల రక్షణ పరిష్కారము 32 ఎ) వ అధికరణ: ఉపసంహరింపబడినది 33వ అధికరణ : రక్షణదళాలు, ప్రాథమిక హక్కులను వర్తింపజేయుటలో పార్లమెంట్ అధికారము 34 వ అధికరణ :మార్షల్ లా అమలులో ఉన్నప్పటి చర్యలకు రక్షణ 35వ అధికరణ : ఈ భాగంలోని అంశాలపై చట్టాలు చేసే అధికారం.

### 4 వ భాగం: ఆదేశిక సూత్రములు

36 వ అధికరణ: ఆదేశిక సూత్రములు నిర్వచనము 37వ అధికరణ: ఈ భాగంలో వివరించిన సూత్రములను అమలు పరుచు బాధ్యత 38 వ అధికరణ: ప్రజా సంక్షేమం, శ్రేయస్సుల నిమిత్తం సాంఘిక సంస్థలను స్థాపించుట. 39 వ అధికరణ: పరిపాలనా విధానంలో రాజ్యం అనుసరించవలసిన సూత్రములు 39 ఎ) వ అధికరణ: సమాన న్యాయం, న్యాయ సహాయం 40 వ అధికరణ: గ్రామ పంచాయితీల ఏర్పాటు 41 వ అధికరణ: పనిని కలిగి ఉండే హక్కు, చదువుకునే హక్కు, నిస్సహాయులకు ఆర్థిక సహాయం 42 వ అధికరణ: మానవతా దృష్టితో పనివారికి పని కాలంలో ఏర్పరచవలసిన పరిశుద్ధ వాతావరణం, ప్రసూతి సహాయం. 43 వ అధికరణ: పనివారికి జీవనభృతి తప్పనిసరి. 43 ఎ) వ అధికరణ: పనివారికి వారు పనిచేసే సంస్థలలో నిర్వహణధికార ప్రాప్తి 43 బి) వ అధికరణ: సహకార సంస్థలకు

ప్రోత్సాహం 44 వ అధికరణ: సార్వత్రిక పౌరస్మృతి 45 వ అధికరణ: పసివారికి ఉచిత నిర్బంధ చదువు 46 వ అధికరణ: షెడ్యూల్డ్ తెగలకు, షెడ్యూల్డ్ కులాల వారికి ఇతర వెనకబడిన తరగతుల వారికి విద్యా ఆర్థికాభివృద్ధికి కృషి 47 వ అధికరణ: పౌష్టిక ఆహారం, ప్రజారోగ్య స్థాయి పెంపు 48 వ అధికరణ: వ్యవసాయం పశు సంవర్ధన 48 ఎ) వ అధికరణ: పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకం వన్యప్రాణుల సంరక్షణ 49 వ అధికరణ: పురావస్తు పరిరక్షణ 50 వ అధికరణ: న్యాయశాఖను పరిపాలనా శాఖ నుంచి వేరుచేయుట 51 వ అధికరణ: అంతర్జాతీయ శాంతి

**4 ఎ భాగం: 51 ఎ. వ అధికరణ:** ప్రాథమిక విధులు

## 5 వ భాగం: కేంద్ర ప్రభుత్వము (లేదా) యూనియన్ కార్యనిర్వహణ శాఖ

52 ఎ వ అధికరణ: భారతి రాష్ట్రపతి 53 వ అధికరణ: యూనియన్ కార్యనిర్వహణాధికారం 54 వ అధికరణ: రాష్ట్రపతి ఎన్నిక 55 వ అధికరణ: రాష్ట్రపతి ఎన్నిక విధానం 56 వ అధికరణ:రాష్ట్రపతి హోదా, కాలపరిమితి 57 వ అధికరణ: రాష్ట్రపతి తిరిగి ఎన్నిక 58 వ అధికరణ: రాష్ట్రపతిగా ఎన్నికయ్యేందుకు అర్హతలు 59 వ అధికరణ: రాష్ట్రపతి హోదా షరతులు 60 వ అధికరణ: రాష్ట్రపతి చేయవలసిన ప్రమాణం 61 వ అధికరణ: అభిశంసన విధానము 62 వ అధికరణ: రాష్ట్రపతి స్థానం ఖాళీ అయితే తిరిగి ఎన్నిక, ఎన్నికైన వారి హోదా, కాలపరిమితి 63 వ అధికరణ: ఉపరాష్ట్రపతి 64 వ అధికరణ: ఉపరాష్ట్రపతి రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరించుట 65 వ అధికరణ: ఉపరాష్ట్రపతి రాష్ట్రపతిగా వ్యవహరించుట 66 వ అధికరణ: ఉపరాష్ట్రపతి ఎన్నిక 67 వ అధికరణ: ఉప రాష్ట్రపతి హోదా కాలపరిమితి 68 వ అధికరణ: ఉపరాష్ట్రపతి స్థానం ఖాళీ అయితే తిరిగి ఎన్నిక, ఎన్నికైన వారి హోదా, కాల పరిమితి 69 వ అధికరణ: ఉపరాష్ట్రపతి చేయవలసిన ప్రమాణం 70 వ అధికరణ: అవసరమైన ఇతర పరిస్థితులలో రాష్ట్రపతి పనులను ఉపరాష్ట్రపతి నిర్వహించుట 71 వ అధికరణ: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించిన విషయములు 72 వ అధికరణ: క్షమాభిక్ష, శిక్షను నిలుపుచేయుట, తగ్గించుట, పరివర్తనం చేయుట 73 వ అధికరణ: యూనియన్‌కు కల కార్యనిర్వహణధికార విస్తరణ

### మంత్రివర్గం :

74 వ అధికరణ: కార్యనిర్వహణలో రాష్ట్రపతికి మంత్రివర్గం సహకారం 75 వ అధికరణ: మంత్రుల గురించిన వివరములు

### అటార్నీ జనరల్ :

76 వ అధికరణ: అటార్నీ జనరల్

### ప్రభుత్వ నిర్వహణ

77 వ అధికరణ: భారత ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణ 78 వ అధికరణ: రాష్ట్రపతికి అందిచవలసిన సమాచార విషయములలో ప్రధానమంత్రి బాధ్యతలు

### పార్లమెంట్ సాధారణ వివరణ

79 వ అధికరణ: లోక్‌సభసేర్పాటు 80 వ అధికరణ: రాజ్యసభ కూర్పు 81 వ అధికరణ: లోక్‌సభ కూర్పు 82 వ అధికరణ: ప్రతి జనాభా లెఖ్ఖల అనంతరం లోక్‌సభ సభ్యుల సంఖ్యలో సర్దుబాటు 83 వ అధికరణ: లోక్‌సభ, రాజ్యసభ కాల వ్యవధి 84 వ అధికరణ: పార్లమెంట్ సభ్యుల అర్హతలు 85 వ అధికరణ: పార్లమెంట్ సమావేశముల ముగింపు, రద్దు 86 వ అధికరణ: లోక్‌సభ, రాజ్యసభ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించే రాష్ట్రపతికి గల హక్కు, ఉభయ సభలకు సందేశాలను పంపించే హక్కు 87 వ అధికరణ: రాష్ట్రపతి విశేష ప్రసంగం 88 వ అధికరణ : ఉభయ సభలలో మంత్రులకు మరియు అటార్నీ జనరల్‌కూ ప్రసంగించే హక్కు,

### పార్లమెంట్ అధికారులు

89 వ అధికరణ: రాజ్యసభ ఛైర్మన్ మరియు డిప్యూటి ఛైర్మన్ 90 వ అధికరణ: రాజ్యసభ డిప్యూటి ఛైర్మన్, రాజీనామా, తొలగింపు, ఇతరత్రా ఆ హోదాలో ఖాళీ 91 వ అధికరణ: డిప్యూటీ ఛైర్మన్, ఛైర్మన్‌గా వ్యవహరించుట 92 వ అధికరణ: ఛైర్మన్, డిప్యూటి ఛైర్మన్, వారి తొలగింపును ఉద్దేశించిన తీర్మానం చర్చాంశనీయంమైనపుడు వారు రాజ్యసభా సమావేశానికి అధ్యక్షత వహించరాదు. 93 వ అధికరణ: స్పీకర్, డిప్యూటి స్పీకర్ :లోక్‌సభ 94 వ అధికరణ: స్పీకర్, డిప్యూటి స్పీకర్ రాజీనామా తొలగింపు ఇతరత్రా ఆ హోదాలో ఖాళీ, 95 వ అధికరణ: డిప్యూటీ స్పీకర్ స్పీకర్‌గా వ్యవహరించు హక్కు 96 వ అధికరణ: డిప్యూటి స్పీకర్ స్పీకర్ వారి తొలగింపును ఉద్దేశించిన తీర్మానం చర్చాంశనీయం ఐనపుడు వారు లోక్‌సభ సమావేశానికి అధ్యక్షత వహించరాదు. 97 వ అధికరణ: ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్, స్పీకర్, డిప్యూటి స్పీకర్‌ల జీతభత్యములు 98వ అధికరణ: పార్లమెంట్ కార్యాలయం

### కార్యకలాపాల నిర్వహణ

99 వ అధికరణ: సభ్యులు చేయవలసిన ప్రమాణం 100వ అధికరణ : సభ్యులు ఓటు చేయు విధానం, కనీస సంఖ్యలో సభ్యులు హాజరు లేకపోయినా వ్యవహరించు హక్కు

### సభ్యుల అనర్హతలు

101వ అధికరణ: సభ్యులు సభ్యత్వాన్నించి విరమించ వలసిన పరిస్థితులు 102 వ అధికరణ: సభ్యుల అర్హతలు 103 వ అధికరణ: అనర్హతల వివాదాలపై తీర్పు 104 వ అధికరణ:

అర్హతను కోల్పోయిన సభ్యుడూ, అనర్హతకు లోబడిన సభ్యుడూ పెనాల్టీలకు గురి అగుట 105 వ అధికరణ: సభ్యుల సభాహక్కులు మినహాయింపులు మొదలైనవి 106 వ అధికరణ: సభ్యుల జీత భత్యములు 107 వ అధికరణ: బిల్లులను సమర్పించు విధానం 108 వ అధికరణ: ఉబయసభల ఉమ్మడి సమావేశము 109 వ అధికరణ: ద్రవ్య బిల్లు : ప్రత్యేక విధానం 110 వ అధికరణ: ద్రవ్య బిల్లు నిర్వచనం 111 వ అధికరణ: బిల్లుల పరిమితి

## ఆర్థిక వ్యవహారాలను గురించిన విధానము

112 వ అధికరణ: వార్షిక ఆర్థిక పరిస్థితిపై నివేదిక 113 వ అధికరణ: ఆర్థిక అంచనాలు పార్లమెంట్ చర్చావిధానము 114 వ అధికరణ: ద్రవ్య వినియోగబిల్లులు 115 వ అధికరణ: అనుబంధ అదనపు, మితిమీరిన ఖర్చుల సహాయ నిధులు 116 వ అధికరణ: తాత్కాలిక పద్ధతులపై ఓటింగ్, అత్యవసర ఖర్చులపై ఓటింగ్ 117 వ అధికరణ : ద్రవ్య బిల్లుపై చర్చ– ప్రత్యేల విధానము

## పార్లమెంట్ లో జరుగు కార్యకలాపాలను గురించిన సాధారణ విధానము

118 వ అధికరణ : నియామవళి 119 వ అధికరణ: పార్లమెంట్‌లో ద్రవ్యవ్యవహారాల చర్చ విధానం 120 వ అధికరణ: పార్లమెంట్‌లో ఉపయోగించవలసిన భాష, రాజభాష ప్రస్తావన 121 వ అధికరణ: పార్లమెంట్‌లో జరిగే చర్చలను గురించిన ఆంక్షలు 122 వ అధికరణ: పార్లమెంట్‌లో జరుగు వ్యవహారాలపై ఏ విధమైన విచారణ జరిపే అధికారం కోర్టులకు లేదు.

## రాష్ట్రపతి శాసనాధికారము

123వ అధికరణ: పార్లమెంట్ అభినివేశనమందు లేనప్పుడు రాష్ట్రపతి అధ్యాదేశములను ప్రకటన ద్వారా జారీ చేయు అధికారము

## యూనియన్ న్యాయవ్యవస్థ

124 వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థానము; స్థాపించుట, కూర్పు 125వ అధికరణ: న్యాయమూర్తుల జీతభత్యములు 126 వ అధికరణ: తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నియామకం 127 వ అధికరణ: అవసరసిద్ధి కొరకు నియమింపబడె న్యాయమూర్తి 128 వ అధికరణ: పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల సహాయం 129 వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థానము కోర్టు ఆఫ్ రికార్డ్ 130 వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థాన సమావేశ స్థలము 131 వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థానము ప్రారంభిక విచారణాధికార పరిధి 131 ఎ వ అధికరణ: ఉపసంహరింప బడినది 132 వ అధికరణ: హైకోర్టు తీర్పులపై సర్వోన్నత న్యాయస్థానానికి వున్న అప్పీలు పరిధులు, కేసుల స్వభావం 133 వ అధికరణ: హైకోర్టు తీర్పులపై సర్వోన్నత న్యాయస్థానానికి వున్న అప్పీలు పరిధులు, కేసుల స్వభావం 134 వ అధికరణ: క్రిమినల్ కేసులో సర్వోన్నత న్యాయస్థానానికి వున్న అప్పీలు పరిధులు 134 ఎ) వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థానమునకు పోవు అప్పీలును గురించిన హైకోర్టులు ఇచ్చే సర్టిఫికెట్ 135 వ అధికరణ: ఫెడరల్ కోర్టు అధికారాల బదిలీ 136 వ అధికరణ: అప్పీలు అర్హతలపై సర్వోన్నత న్యాయస్థానం మంజూరు చేసే ప్రత్యేకాధికారం 137 వ అధికరణ: పునర్విచారణాధికారం 138 వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థానము; పరిధుల విస్తరణ 139 వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థానమునకు గల రిట్టులను మంజూరు చేయు అధికార విస్తరణ 139 ఎ) వ అధికరణ: కేసులను బదిలిచేయు అధికారము 140వఅధికరణ: అనుబంధిత అధికారులు 141 వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థానము తేల్చిన న్యాయమును అన్ని కోర్టులు విధిగా పాటించుట 142 వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థానం తీర్పులోని అదేశముల అమలు 143 వ అధికరణ: రాష్ట్రపతి సర్వోన్నత న్యాయస్థానమును సలహా అడగవచ్చు 144 వ అధికరణ: సివిల్ మరియు జుడిషియల్ అధికారులు అందరూ సర్వోన్నత న్యాయస్థానంతో సహకరించ వలెను 144 ఎ) వ అధికరణ: ఉపసహరించబడినది 145 వ అధికరణ: కోర్టు నియమావళి 146 వ అధికరణ: కోర్టు ఉద్యోగులు మరియు సిబ్బంది; సర్వోన్నత న్యాయస్థాన కార్యాలయ ఖర్చులు 147 వ అధికరణ: వివరణ

## కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్

148 వ అధికరణ: భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ 149 వ అధికరణ: విధులు–అధికారములు 150 వ అధికరణ: యూనియన్ మరియు రాష్ట్ర ప్రభుత్వ లెఖ్ఖల నమూనా 151 వ అధికరణ: తనిఖీ లెఖ్ఖల నివేదిక

## 6 వ భాగం: రాష్ట్రములు

152 వ అధికరణ: నిర్వచనములు

కార్యనిర్వహణ

గవర్నర్

153 వ అధికరణ: రాష్ట్ర గవర్నర్ 154 వ అధికరణ: రాష్ట్ర కార్యనిర్వహణాధికారం 155 వ అధికరణ: గవర్నర్ నియామకం 156 వ అధికరణ: గవర్నర్ హోదా కాలపరిమితి 157 వ అధికరణ: గవర్నర్ నియామకమునకు అవసరమైన అర్హతలు 158 వ అధికరణ: గవర్నర్ పదవీ షరతులు 159వ అధికరణ: ప్రమాణ స్వీకారము 160వ అధికరణ: కొన్ని పరిస్థితులలో గవర్నర్ చేయు పనులను వేరొకరు నిర్వహించుట

161 వ అధికరణ: క్షమాభిక్ష, శిక్షలను నిలుపు చేయుట, తగ్గించుట, పరివర్తనం చేయు అధికారాలు 162 వ అధికరణ: రాష్ట్ర కార్యనిర్వహణాధికార విస్తరణ

### మంత్రివర్గం

163 వ అధికరణ: కార్యనిర్వహణలో గవర్నర్‌కు మంత్రివర్గ సహకారం 164 వ అధికరణ: మంత్రుల గురించిన వివరములు

### రాష్ట్ర అడ్వకేట్ జనరల్

165 వ అధికరణ : రాష్ట్ర అడ్వకేట్ జనరల్

### రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార నిర్వహణ

166 వ అధికరణ: రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార నిర్వహణ 167 వ అధికరణ: గవర్నర్‌కు అందించవలసిన సమాచారం విషయంలో ముఖ్యమంత్రి బాధ్యతలు

### సాధారణ వివరణ

168 వ అధికరణ : శాసనసభ, శాసనమండలి స్థాపన 169 వ అధికరణ : శాసనమండలి ఏర్పాటు, రద్దు 170 వ అధికరణ: శాసనసభ కూర్పు 171 వ అధికరణ: శాసనమండలి కూర్పు 172 వ అధికరణ: శాసనసభ, శాసనమండలి కాలపరిమితి 173 వ అధికరణ: శాసనసభ, శాసనమండలి సభ్యుల అర్హతలు 174 వ అధికరణ: శాసనసభ, శాసనమండలి సమావేశముల ముగింపు, రద్దు 175 వ అధికరణ: శాసనసభ, శాసనమండలి సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించే హక్కు ఉభయసభలకు సందేశాలను పంపే హక్కు 176 వ అధికరణ: గవర్నర్ విశేష ప్రసంగం 177 వ అధికరణ: మంత్రులకు–అడ్వకేట్ జనరల్‌కు శాసనసభలో ప్రసంగించే హక్కు

### ఉభయసభల అధికారులు

178 వ అధికరణ: శాసనసభ స్పీకర్, డిప్యూటి స్పీకర్ 179 వ అధికరణ: రాజీనామా తొలగింపు: ఇతరత్రా స్పీకర్, డిప్యూటీ స్పీకర్ హోదాలో ఖాళీలు 180 వ అధికరణ: డిప్యూటి స్పీకర్‌గా వ్యవహరించుట 181 వ అధికరణ: స్పీకర్ – డిప్యూటి స్పీకర్‌లు వారిని తొలగించుట కొరకై ఉద్దేశించిన తీర్మానం చర్చనీయాంశంమైనపుడు వారు సభా సమావేశాలపై అధ్యక్షత వహించరాదు 182 వ అధికరణ: ఛైర్మన్, డిప్యూటి ఛైర్మన్ 183 వ అధికరణ: రాజీనామా, తొలగింపు, ఇతరత్రా ఛైర్మన్, డిప్యూటి ఛైర్మన్ హోదాలో ఖాళీలు 184 వ అధికరణ: డిప్యూటి ఛైర్మన్, ఛైర్మన్‌గా వ్యవహరించుట 185 వ అధికరణ: డిప్యూటి ఛైర్మన్, ఛైర్మన్ వారిని తొలగించుట కొరకై ఉద్దేశించిన తీర్మానం చర్చనీయాంశంమైనపుడు వారు శాసనమండలి సమావేశాలపై అధ్యక్షత వహించరాదు 186 వ అధికరణ: ఛైర్మన్ డిప్యూటి ఛైర్మన్, స్పీకర్ – డిప్యూటి స్పీకర్‌ల జీతభత్యములు 187 వ అధికరణ: ఉభయసభల కార్యాలయం 188 వ అధికరణ: కార్యకలాపాల నిర్వహణ, సభ్యులు చేయవలసిన ప్రమాణం 189 వ అధికరణ: సభ్యులు ఓటుచేయు విధానం, కనీస సభ్యులు హాజరులో లేకపోయిన వ్యవహరించు హక్కు

### సభ్యుల అనర్హతలు

190 వ అధికరణ: సభ్యులు సభ్యత్వం నుంచి విరమించ వలసిన పరిస్థితులు 191 వ అధికరణ: సభ్యుల అనర్హతలు 192 వ అధికరణ: అనర్హతల వివాదంపై తీర్పు 193 వ అధికరణ: అనర్హతను కోల్పోయిన సభ్యుడు, అనర్హతలకు లోనయిన సభ్యుడు, ప్రమాణ స్వీకారం చేయని సభ్యుడు సభల సమావేశాలకు హాజరు అయినచో పెనాల్టీకి గురి అవుదురు 194 వ అధికరణ: సభ్యుల సభాహక్కుల, మినహాయింపు మొదలయినవి 195 వ అధికరణ: సభ్యుల జీతభత్యములు

### ఉభయసభల వ్యవహార విధానము

196 వ అధికరణ: బిల్లులను శాసనసభకు సమర్పించు విధానము 197 వ అధికరణ: ద్రవ్య బిల్లు మినహా ఇతర బిల్లుల గురించి శాసనమండలిపై ఆంక్షలు 198 వ అధికరణ: ద్రవ్య బిల్లు గురించి ప్రత్యేక విధానము 199 వ అధికరణ: ద్రవ్య బిల్లు–నిర్వచనము 200 వ అధికరణ: బిల్లుల అనుమతి 201 వ అధికరణ: రాష్ట్రపతి ఆమోదం కొరకు బిల్లును నిలుపుచేయుట

### ఆర్థిక వ్యవహారములను గురించిన విధానము

202 వ అధికరణ: వార్షిక, ఆర్థిక పరిస్థితిపై నివేదిక 203 వ అధికరణ: ఆర్థిక అంచనాలు శాసనసభ చర్చావిధానము 204 వ అధికరణ: ద్రవ్య వినియోగ బిల్లులు 205 వ అధికరణ: అనుబంధ అదనపు మితిమీరిన ఖర్చుల సహాయ నిధులు 206 వ అధికరణ: తాత్కాలిక పద్దులపై ఓటింగ్ అత్యవసర ఖర్చులపై ఓటింగ్ 207 వ అధికరణ: ద్రవ్య బిల్లుపై చర్చ ప్రత్యేక విధానము

### నియామావళి

208 వ అధికరణ : శాసనసభలో జరుగు కార్యక్రమాల గురించిన సాధారణ విధానము 209వ అధికరణ : ఆర్థిక వ్యవహారాల గురించిన రెగ్యులేషన్ 210వ అధికరణ : శాసన సభలలో ఉపయోగించవలసిన భాషలు 211 వ అధికరణ: శాసనసభలలో చర్చలపై ఆంక్షలు 212 వ అధికరణ : శాసనసభ లలో జరుగు వ్యవహారాలపై ఏ విధమైన విచారణ జరిపే అధికారం కోర్టులకు లేదు

### గవర్నర్ శాసనాధికారము

213 వ అధికరణ : శాసనసభలు అభినివేశమందు లేనపుడు గవర్నర్‌కు అధ్యాదేశమును జారీచేయు అధికారము

### రాష్ట్ర హైకోర్టులు

214 వ అధికరణ : రాష్ట్ర హైకోర్టులు 215 వ అధికరణ: హైకోర్టును కోర్ట్ అఫ్ రికార్డుగా భావించుదురు 216 వ అధికరణ: హైకోర్టు స్థాపన 217 వ అధికరణ : హైకోర్టు న్యాయమూర్తుల నియామకం షరతులు 218 వ అధికరణ : సర్వోన్నత న్యాయస్థానమునకు వర్తించు కొన్ని విషయములు, హైకోర్టులకు కూడా వర్తింపజేయుట 219 వ అధికరణ: హైకోర్టు న్యాయమూర్తులచే ప్రమాణ స్వీకారం 220 వ అధికరణ: న్యాయమూర్తి నియామకంలో ఖాయపడిన వ్యక్తి తదుపరి వృత్తిపై ఆంక్ష 221 వ అధికరణ : హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యములు 212 వ అధికరణ: హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలు 223 వ అధికరణ: తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నియామకం 224 వ అధికరణ: అదనపు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నియామకం 224.ఎ) వ అధికరణ: పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల సహాయం 225 వ అధికరణ: హైకోర్టుల అధికార పరిధి 226 వ అధికరణ: హైకోర్టులకు రిట్టులను మంజూరుచేయు అధికారము 227 వ అధికరణ: దిగువ కోర్టుల పై హైకోర్టు అజమాయిషి 228 వ అధికరణ: హైకోర్టు దిగువ కోర్టు కేసులను బదిలీ చేసుకొనుట 228 ఎ) అధికరణ: ఉపసంహరింపబడినది 229 వ అధికరణ: కోర్టు ఉద్యోగులు మరియు సిబ్బంది; హైకోర్టు కార్యాలయ ఖర్చులు 230 వ అధికరణ: యూనియన్ టెరిటరీకి హైకోర్టు అధికార విస్తరణ 231 వ అధికరణ: రెండు అంతకు మించిన రాష్ట్రములకు ఒకే హైకోర్టును స్థాపించుట 232 వ అధికరణ: ఉపసంహరింప బడినది.

### దిగువ న్యాయస్థానములు

233 వ అధికరణ: జిల్లా న్యాయమూర్తుల నియామకం 233 ఎ వ అధికరణ: కొందరు జిల్లా జడ్జిల నియామకములను వారు అందించిన తీర్పులకు మాన్యతను చేకూర్చుట 234 వ అధికరణ: జుడిషయల్ సర్వీసు నియామకాలు 235 వ అధికరణ: క్రింది కోర్టులపై జిల్లా కోర్టు పర్యవేక్షణ 236 వ అధికరణ: వివరణలు 237 వ అధికరణ: ఈ ఛాప్టర్‌లోని అంశములను మేజిస్ట్రేట్లకు వర్తింపచేయుట

### 7 వ భాగం: పార్ట్ బి రాష్ట్రాలు-మొదటి షెడ్యూలు

238 వ అధికరణ: ఉపసంహరింపబడినది

### 8 వ భాగం : యూనియన్ టెరిటరీస్

239 వ అధికరణ: యూనియన్ టెరిటరీస్ పరిపాలన. 239 ఎ) వ అధికరణ: కొన్ని యూనియన్ టెరిటరీలకు స్థానిక శాసనసభలను మంత్రివర్గములను ఏర్పర్చుట 239 ఎఎ) వ అధికరణ : ఢిల్లీ విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు 239 ఎబి) వ అధికరణ : సంవిధాన పరిపాలన విఫలమైనచో ఇతర ఏర్పాట్లు 239బి) వ అధికరణ: శాసనసభ విరామ సమయంలో శాసనానికి బదులు ఆద్యాదేశములను జారీ చేయు అధికారము 240 వ అధికరణ : రాష్ట్రపతికి యూనియన్ టెరిటరీస్ గురించి వినమయములను చేయు అధికారము 241 వ అధికరణ: యూనియన్ టెరిటరీలకు హైకోర్టులు 242 వ అధికరణ: ఉపసంహరింపబడినది.

### 9 వ భాగం: పంచాయతీలు

243 వ అధికరణ : నిర్వచనములు 243 ఎ) వ అధికరణ: గ్రామసభ 243 బి) వ అధికరణ : పంచాయితీల వ్యవస్థాపన 243 సి) వ అధికరణ : పంచాయితీల నిర్మాణము 243 డి) వ అధికరణ : స్థానముల కేటాయింపు 243 ఇ) వ అధికరణ: పంచాయితీల కాలపరిమితి 243 ఎఫ్) వ అధికరణ : పంచాయితీ సభ్యత్వ అనర్హతలు 243 జి) వ అధికరణ : పంచాయితీల సామర్థ్యతలు అధికారాలు బాధ్యతలు 243 హెచ్) వ అధికరణ: పన్నులు విధించు అధికారములు, నిధులు 243 ఐ) వ అధికరణ: పంచాయతీల ఆర్థిక పరిస్థితి సమీక్ష కొరకు ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు 243 జె) వ అధికరణ: పంచాయితీ లెక్కల తనిఖీ 243 కె) వ అధికరణ: పంచాయితీ ఎన్నికలు 243 ఎల్) వ అధికరణ: యూనియన్ టెరిటరీలకు వర్తింపు చేయుట 243 ఎమ్) వ అధికరణ: గ్రామ పంచాయితీ విధానము షెడ్యూల్డ్ ఏరియాస్‌కి వర్తింపు చేయుట 243 ఎన్) వ అధికరణ: అమలులో ఉన్న పంచాయితీ చట్టముల చలామణి 243 ఒ) వ అధికరణ: ఎన్నికల వివాదాలతో కోర్టులకు సంబంధం ఉండదు

**9 ఎ వ భాగం:** మున్సిపాలిటీలు 243 పి) వ అధికరణ: నిర్వచనములు 243 క్యు) వ అధికరణ:మున్సిపాలిటీల వ్యవస్థాపన 243 అర్) వ అధికరణ: మున్సిపాలిటీల నిర్మాణము. 243 ఎస్) వ అధికరణ: వార్డు కమీటిల నిర్మాణము వగైరా 243 టి) వ అధికరణ: సభ్యత్వములలో ప్రత్యేక కేటాయింపు 243 యు) వ అధికరణ : మున్సిపాలిటీల కాలపరిమితి 243 వి) వ అధికరణ : మున్సిపాలిటీల సభ్యత్వ అనర్హతలు 243 డబ్ల్యు) వ అధికరణ : మున్సిపాలిటీల సామర్థ్యతలు, అధికారాలు, బాధ్యతలు 243 ఎక్స్) వ అధికరణ : పన్నులను విధించుట, విధులను ఏర్పర్చుట 243 వై) వ అధికరణ : ఫైనాన్స్ కమిషన్ 243 జడ్) వ అధికరణ : మున్సిపాలిటీ లెఖ్ఖల తనీఖీ 243 జడ్ ఎ) వ అధికరణ : మున్సిపాలిటీల ఎన్నికలు 243 జడ్ బి) వ అధికరణ : యూనియన్ టెరిటరీలకు వర్తింపచేయుట 243 జడ్ సి) వ అధికరణ: వర్తింపులేని ప్రదేశములు 243 జడ్ డి) వ అధికరణ: జిల్లా ప్రణాళికా సంఘముల ఏర్పాటు 243 జడ్

ఇ) వ అధికరణ: మెట్రోపాలిటన్ ప్రణాళికా సంఘం 243 జడ్ ఎఫ్) వ అధికరణ: అమలులో ఉన్న మున్సిపల్ చట్టముల చలామణి 243 జడ్ జి) వ అధికరణ: ఎన్నికల వివాదాలతో కోర్టులకు సంబంధం ఉండరాదు

**9 బి వ భాగం:**

243 జడ్ హెచ్ వ అధికరణ: నిర్వచనాలు 243 జడ్ ఐ వ అధికరణ: సహకార సంస్థల ఏర్పాటు 243 జడ్ జె వ అధికరణ: మండలి, కార్యాలయ సభ్యుల సంఖ్య, కాలపరిమితి 243 జడ్ కె వ అధికరణ: మండలికి సభ్యుల ఎంపిక 243 జడ్ ఎల్ వ అధికరణ: మండల, మధ్యంతర యాజమాన్య విలంబన, అతిలంబన 243 జడ్ ఎం వ అధికరణ: సహకార సంస్థల ఖాతాల ఆడిట్ 243 జడ్ ఎన్ వ అధికరణ: సాధారణ మండలి సమావేశాల నిర్వహణ 243 జడ్ ఓ వ అధికరణ: సభ్యులకు సమాచార హక్కు 243 జడ్.పి వ అధికరణ: రిటర్నులు 243 జడ్ క్యూ వ అధికరణ: నేరాలు, దండనలు 243 జడ్ ఆర్ వ అధికరణ: బహు రాష్ట్ర సహకార సంస్థలకు అనువర్తన 243 జడ్ ఎస్ వ అధికరణ: కేంద్రపాలిత ప్రాంతాలకు అనువర్తన 243 జడ్ టివ అధికరణ: ప్రస్తుత చట్టాల కొనసాగింపు

## 10 వ భాగం: షెడ్యూల్డ్ మరియు ట్రైబల్ ప్రాంతములు

244 వ అధికరణ: షెడ్యూల్డ్ మరియు ట్రైబల్ ప్రాంతము పరిపాలన 244 ఎ) వ అధికరణ: స్వయంపాలిత రాష్ట్ర స్థాపన

## 11 వ భాగం: యూనియన్, రాష్ట్రల మధ్య సంబంధాలు

### చట్టాలను చేసే అధికారాలను గురించి

245 వ అధికరణ: శాసనాలను చేయుటలో పార్లమెంట్ కు, రాష్ట్ర శాసనసభలకు ఉన్న అధికారపరిధి 246 వ అధికరణ: పార్లమెంట్‌కు, శాసనసభలకు కేటాయించిన అంశాలు - జాబితాలు 247 వ అధికరణ: అదనపు కోర్టులను స్థాపించు అధికారము 248 వ అధికరణ: మిగిలిన అంశాలపై శాసనాలను చేసే అధికారము 249 వ అధికరణ: రాష్ట్ర శాసనసభలకు కేటాయించిన అంశాలపై జాతి శ్రేయస్సు దృష్ట్యా పార్లమెంట్ చట్టాలను చేయవచ్చు 250 వ అధికరణ: అత్యవసర పరిస్థితి అమలులో ఉన్న కాలములో రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ శాసనాలను చేయవచ్చు 251 వ అధికరణ: పార్లమెంట్ చేయు చట్టములకు రాష్ట్ర శాసనసభలు చేయు చట్టములకు మధ్య వైరుధ్యం ఉంటే 252 వ అధికరణ: రెండు అంతకంటే మించిన రాష్ట్రములు తమ కొరకు ఏదేని శాసనాన్ని చేయమని కోరితే పార్లమెంట్ వాటన్నిటికి అనువర్తించు శాసనాన్ని చేయవచ్చు 253వ అధికరణ: అంతర్జాతీయ ఒప్పందాల అమలు కొరకు చేయు చట్టాలను పార్లమెంట్ మాత్రమే చేయగలదు 254 వ అధికరణ: పార్లమెంట్ చేసిన చట్టము శాసనసభ చేసిన చట్టాల మధ్య వైరుధ్యం 255 వ అధికరణ: ముందుగా సిఫార్సులను పొందవలెనని ఎక్కడైనా వుంటే అది విధానానికి సంబంధించిన షరతు అని గుర్తించాలి.

యూనియన్ మరియు రాష్ట్రముల మధ్య పరిపాలన సంబంధాలు సాధారణ విషయములు 256 వ అధికరణ: యూనియన్ మరియు రాష్ట్రముల బాధ్యతలు 257 వ అధికరణ: రాష్ట్రములపై యూనియన్‌కు ఉన్న అదుపు 257 ఎ వ అధికరణ: ఉపసంహరించబడినది 258 వ అధికరణ: రాష్ట్రాలకు, యూనియన్‌కు కల అధికారము కొన్ని పరిస్థితులలో దత్తాధికార మివ్వవచ్చు 258 ఎ వ అధికరణ: రాష్ట్రాలు కూడా తమ కార్యకలాపాలను యూనియన్‌కు దత్తపరచవచ్చు 259 వ అధికరణ: ఉపసంహరించబడినది 260 వ అధికరణ: భారతదేశానికి ఆవల ఉన్న ప్రదేశాల పరిపాలన యూనియన్ చేపట్టవచ్చు 261 వ అధికరణ: యూనియన్ మరియు రాష్ట్రములు చేసే అన్ని చర్యలకు వారి రికార్డులకు సర్వత్రా గుర్తింపు: న్యాయస్థానాల తీర్పులకు సర్వత్రా గుర్తింపు

### నదీజలాలపై వివాదములు

262 వ అధికరణ: అంతరాష్ట్ర నీటి వనరులు, నదులపై పరిష్కారం

### రాష్ట్రముల మధ్య సహాయసహకారములు

263 వ అధికరణ: ఇంటర్ స్టేట్ కౌన్సిల్

## 12 వ భాగం :

ద్రవ్యం, ఆస్తి ఒప్పందాలు మరియు దావాలు ద్రవ్య సాదరణ విషయములు 264 వ అధికరణ: వివరణ 265 వ అధికరణ: చట్టం లేనిచో పన్ను ఉండదు 266 వ అధికరణ: యూనియన్ మరియు రాష్ట్రములకు చెందిన సంచితనిధి పబ్లిక్ అక్కౌంట్స్ 267 వ అధికరణ: అకస్మిక నిధి యూనియన్ మరియు రాష్ట్రాల మధ్య ఆదాయాల పంపిణీ 268 వ అధికరణ: యూనియన్ విధించు డ్యూటీలు- రాష్ట్రములు వసూలు చేయుట, వినియోగించుట 268 వ అధికరణ: సేవలపై పన్ను-యూనియన్ ప్రభుత్వంచే విధింపు- యూనియన్ మరియు రాష్ట్ర ప్రభుత్వములచే వసూలు-యూనియన్ రాష్ట్ర ప్రభుత్వముల కొరకు వినియోగము 269 వ అధికరణ: యూనియన్ విధించి వసూలు చేయు పన్నులు - రాష్ట్రములకు పంచుట 270 వ అధికరణ: యూనియన్ విధించి వసూలు చేయు పన్నులు - యూనియన్ రాష్ట్రములకు పంచుట 271 వ అధికరణ: యూనియన్ ప్రయోజనాల కొరకు విధించే

సర్ ఛార్జి 272 వ అధికరణ: ఉపసంహరించబడినది 273 వ అధికరణ: ఎక్స్‌పోర్టు డ్యూటి బదులు గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ – జ్యూట్ మరియు జ్యూట్ ప్రోడక్ట్స్ 274 వ అధికరణ: రాష్ట్రములకు ఆసక్తి ఉన్న పన్నుల గురించి రాష్ట్రపతి సిఫార్సు ఆవశ్యకత 275 వ అధికరణ:యూనియన్ నుంచి కొన్ని రాష్ట్రములకు అందించే గ్రాంట్స్ 276 వ అధికరణ: వృత్తి, వ్యాపారం, ఆరోగ్యం మరియు ఇతర సర్వీసులపైన విధించు పన్ను 277వ అధికరణ: మినహాయింపులు 278 వ అధికరణ: ఉపసంహరించబడినది 279 వ అధికరణ: నెట్ ప్రోసిడ్స్‌ను లెఖ్ఖించు విధానము 280 వ అధికరణ: ఫైనాన్స్ కమిషన్ 281 వ అధికరణ: ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులు

### ఇతర ద్రవ్య విషయములు

282వ అధికరణ: యూనియన్ మరియు రాష్ట్ర ప్రభుత్వములు వారి ఆదాయం నుంచి చేయు ఖర్చులు 283 వ అధికరణ: సంచిత నిధి, కంటింజెన్స్ ఫండ్ మరియు పబ్లిక్ అక్కౌంట్స్ ఆధీనము సంరక్షణ 284 వ అధికరణ: కోర్టులలోను పబ్లిక్ ఆఫీసర్ వద్ద జమపడే డిపాజిట్లు స్వాధీనము 285 వ అధికరణ : రాష్ట్రాలు విధించే పన్నుల నుంచి యూనియన్ విధించే పన్ను ఉండరాదు 286వ అధికరణ: వస్తువుల అమ్మకం, కొనుగోళ్ళ విలువలపై పన్ను విధింపు గురించిన ఆంక్షలు 287 వ అధికరణ: విద్యుత్‌పై పన్నుల మినహాయింపు 288 వ అధికరణ: నీరు, విద్యుత్‌లపై రాష్ట్రాలు విధించే పన్నులపై మినహాయింపులు 289 వ అధికరణ: రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులపై యూనియన్ విధించే పన్ను ఉండరాదు 290 వ అధికరణ: యూనియన్ మరియు రాష్ట్రముల మధ్య కొన్ని లెఖ్ఖల సర్దుబాటు 29 ఎ) వ అధికరణ: దేవస్వం నిధులు 291 వ అధికరణ: ఉపసంహరించబడినది

**రుణ సేకరణ:** 292 వ అధికరణ: యూనియన్ ప్రభుత్వ రుణ సేకరణ 293 వ అధికరణ: రాష్ట్ర ప్రభుత్వ రుణ సేకరణ

ఆస్తులు, ఒప్పందాలు, హక్కులు, బాధ్యతలు, కర్తవ్యాలు, దావాలు

294 వ అధికరణ : దేశ విభజన మూలంగా సంక్రమించిన ఆస్తులు బాధ్యతలు 295 వ అధికరణ: ఇతరత్రా పార్టు బి రాష్ట్రాల ద్వారా సంక్రమించిన ఆస్తులు, బాధ్యతలు 296 వ అధికరణ: వారసులు లేని వారి ఆస్తి 297 వ అధికరణ: టెరిటోరియల్ వాటర్స్, కాంటినెంటల్ షెల్ఫ్‌లోని విలువైన ఆస్తులు అన్నీ యూనియన్‌కు చెందును 298వ అధికరణ: ప్రభుత్వాలకు వ్యాపారం చేసే హక్కు 299 వ అధికరణ: ప్రభుత్వము చేసుకొనే ఒప్పందములు 300 వ అధికరణ: వ్యాజ్యములు

## 13 వ భాగం: దేశవ్యాప్తంగా వ్యాపార వాణిజ్యసంసర్గముల యందు స్వేచ్ఛ

301 వ అధికరణ: వ్యాపార వాణిజ్య మరియు సంసర్గముల యందు స్వేచ్ఛ 302 వ అధికరణ: వ్యాపార, వాణిజ్యాలపై ఆంక్షలను విధించే అధికారము పార్లమెంట్‌కు ఉన్నది 303 వ అధికరణ : వ్యాపార, వాణిజ్యాల నియంత్రణపై రాష్ట్రాలకు, యూనియన్‌కు ఉన్న అధికారాల పరిమితి 304 వ అధికరణ: రాష్ట్రముల మధ్య జరిగే వ్యాపార, వాణిజ్యాలను గురించిన ఆంక్షలు 305 వ అధికరణ: ఇప్పటికే అమలులో ఉన్న చట్టాల మినహాయింపు, ప్రభుత్వ గుత్తాధికార సంస్థలు 306 వ అధికరణ: ఉపసంహరించబడినది 307 వ అధికరణ: ఆధికరణ 301 నుండి ఆధికరణ 304 లోని అంశాల అమలు కొరకు స్థాపించు ప్రాధికార సంస్థ

## 14 వ భాగం: యూనియన్ మరియు రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు ఉద్యోగులు

308 వ అధికరణ: వివరణ 309 వ అధికరణ: యూనియన్ మరియు రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల నియామకం, షరతులు 310 వ అధికరణ: ఉద్యోగుల పదవీ కాలము 311 వ అధికరణ: ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు 312 వ అధికరణ: ఆలిండియా సర్వీసెస్ 312 ఎ అధికరణ: ఉద్యోగుల షరతులను నిర్ణయించు, మార్పు చేయు, ఉపసంహరించు అధికారం 313 వ అధికరణ: సంధికాలపు సమస్యల పరిష్కారము 314 వ అధికరణ: ఉపసంహరించబడినది

### పబ్లిక్ సర్వీస్ కమిషన్

315 వ అధికరణ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు 316 వ అధికరణ: సభ్యుల నియామకం, షరతులు 317 వ అధికరణ: పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల తొలగింపు, తాత్కాలిక నిలుపుదల 318 వ అధికరణ: పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల మరియు సిబ్బంది సేవాషరతులపై రెగ్యులేషన్స్ 319 వ అధికరణ: పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు పదవి నుంచి వైదొలగిన అనంతరం ఇతర ప్రభుత్వ హోదాలకు అర్హులు కారు 320 వ అధికరణ: పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ల కర్తవ్యములు 321 వ అధికరణ: పబ్లిక్ సర్వీస్ కమిషన్ విధుల విస్తరణ 322 వ అధికరణ: పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లకు అగు ఖర్చులు 323 వ అధికరణ: పబ్లిక్ సర్వీస్ కమిషన్ నివేదికలు

**14ఎ భాగం:** ట్రిబ్యునల్స్ 323ఎ వ అధికరణ: ప్రభుత్వోద్యోగులకు పరిమితమైన ఎడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ 323 బి వ అధికరణ: వేరే అన్ని ఇతర వ్యవహారాలను గురించిన ట్రిబ్యునల్స్

## 15 వ భాగం : ఎన్నికలు

324 వ అధికరణ: ఎన్నికల కమిషన్ అధికారములు 325 వ అధికరణ: ఓటర్ల జాబితాలో చేర్చబడుటకు మత, జాతి, కుల, లింగ భేదములు అడ్డు రాకూడదు 326 వ అధికరణ: వయోజన ఓటు హక్కు 327 వ అధికరణ: రాష్ట్ర శాసనసభల ఎన్నిక గురించి చట్టాలను చేయు అధికారం పార్లమెంట్‌కు కలదు 328 వ అధికరణ: ఆధికరణ 327 క్రింద పార్లమెంట్ శాసనసభల గురించి చట్టాలను చేయనిచో శాసనసభల గురించి చట్టాలను చేయనిచో శాసనసభలు తత్సంబంధిత చట్టాలను చేయవచ్చును. 329 వ అధికరణ : ఎన్నికలు తత్సంబంధిత విషయములపై కోర్టులు జోక్యం చేసుకొనరాదు 329 ఎ వ అధికరణ : ఉపసంహరింప బడినది.

## 16 వ భాగం : కొన్ని తరగతుల రక్షణకై ప్రత్యేకాంశాలు

330 వ అధికరణ : లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాల వారికి, షెడ్యూల్డ్ తెగల వారికీ స్థానాల కేటాయింపు 331 వ అధికరణ: లోక్‌సభలో ఆంగ్లో ఇండియన్‌లకు ప్రాతినిధ్యం 332 వ అధికరణ: శాసనసభలలో షెడ్యూల్డ్ కులాల వారికి, షెడ్యూల్డ్ తెగల వారికీ స్థానాల కేటాయింపు 333 వ అధికరణ: శాసనసభలలో ఆంగ్లో ఇండియన్‌లకు ప్రాతినిధ్యం 334 వ అధికరణ: పై కేటాయింపులు 50 సంవత్సరముల అనంతరం కొనసాగరాదు 335 వ అధికరణ: షెడ్యూల్డ్ కులాల వారికి, షెడ్యూల్డ్ తెగల వారికీ ప్రభుత్వోద్యోగాలలో హక్కుల గుర్తింపు 336 వ అధికరణ: ఆంగ్లో ఇండియన్‌లకు కొన్ని శాఖలలో ఉద్యోగావకాశాలు 337 వ అధికరణ : ఆంగ్లో ఇండియన్‌ల విద్యాభివృద్ధికి ప్రత్యేక గ్రాంట్స్ 338 వ అధికరణ : నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ 338 ఎ వ అధికరణ : నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ ట్రైబ్స్ 339 వ అధికరణ: షెడ్యూల్డ్ ఎరియాస్ పై యూనియన్ పరిపాలన 340 వ అధికరణ : వెనుకబడిన తరగతుల స్థితిగతులను విచారించే నిమిత్తం కమిషన్ నియామకం 341వ అధికరణ : షెడ్యూల్డ్ తరగతులు 342 వ అధికరణ: షెడ్యూల్డ్ తెగలు

**17 వ భాగం :** రాజభాషలు యూనియన్ రాజభాష 343 వ అధికరణ: యూనియన్ రాజభాష 344 వ అధికరణ: రాజభాషపై పార్లమెంట్ నియమించు కమిషన్ మరియు కమీటీలు ప్రాంతీయ భాషలు 345 వ అధికరణ: రాష్ట్రములలోని రాజభాషలు 346 వ అధికరణ: రాష్ట్రముల మధ్య, రాష్ట్రములూ మరియు యూనియన్ మధ్య ఉపయోగించవలసిన రాజభాష 347 వ అధికరణ: రాష్ట్రములలో ప్రాంతీయ భాషలు

సర్వోన్నత న్యాయస్థానము, హైకోర్టులు ఉపయోగించు భాష

348 వ అధికరణ: సర్వోన్నత న్యాయస్థానము, హైకోర్టులు మరియు చట్టాలలోనూ ఉపయోగించవలసిన భాష 349 వ అధికరణ: భాషా సమస్యలపై చట్టములు

### ప్రత్యేక ఆదేశాలు

350 వ అధికరణ : ఇబ్బందుల నివారణకై సమర్పించు అర్జీల భాషలు 350 ఎ వ అధికరణ: మాతృభాషల ప్రోత్సాహకర వసతులు 350 బి వ అధికరణ : స్పెషల్ ఆఫీసర్ ఫర్ లింగ్విస్టిక్ మైనారిటీస్ 351 వ అధికరణ : హిందీ భాషాభివృద్ధి

## 18 వ భాగం: అత్యవసర పరిస్థితి

352 వ అధికరణ: అత్యవసర పరిస్థితి ప్రకటన 353 వ అధికరణ : అత్యవసర పరిస్థితి ప్రకటన ప్రభావం 354 వ అధికరణ : అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు యూనియన్ మరియు రాష్ట్రముల మధ్య రెవెన్యూ పంపిణీ 355 వ అధికరణ: రాష్ట్రములలో శాంతిభద్రతల పరిరక్షణ, విదేశీ దండయాత్ర నివారణ, యూనియన్ బాధ్యత 356 వ అధికరణ: రాష్ట్రములలో సంవిధానానుసర పరిపాలన భంగపడితే గవర్నర్ పాలన 357 వ అధికరణ: పై అధికరణలను అనుసరించి ప్రకటన చేసినచో రాష్ట్ర శాసనసభల శాసనాధికారం యూనియన్‌కు చెందును 358 వ అధికరణ: అత్యవసర పరిస్థితులలో అధికరణ–19 నిలుపు చేయబడును 359 వ అధికరణ: అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నపుడు 3వ భాగంలోని హక్కుల నిలుపుదల 39 ఎ వ అధికరణ : ఉపసంహరించబడినది 360 వ అధికరణ : ఆర్థిక అత్యవసర పరిస్థితి

## 19 వ భాగం: ఇతరములు

361 వ అధికరణ: రాష్ట్రపతి, గవర్నర్, రాజ ప్రముఖులు – రక్షణలు 361 ఎ వ అధికరణ: పార్లమెంట్ మరియు శాసనసభ సమావేశాలలో జరుగు కార్యకలాపాల ప్రచురణ 362 వ అధికరణ : ఉపసంహరించబడినది 363 వ అధికరణ: సంస్థానాధీశులతో చేసుకున్న ఒప్పందాలపై కోర్టులకు ప్రమేయం ఉండరాదు 363 ఎ వ అధికరణ: రాజ్యాభరణముల రద్దు 364 వ అధికరణ : నౌకాశ్రయముల, విమానాశ్రయములు 365 వ అధికరణ: యూనియన్ ఆదేశాలను రాష్ట్రాలు అమలు చేయకపోతే 366 వ అధికరణ: నిర్వచనములు 367 వ అధికరణ: వివరణ

## 20 వ భాగం : సంవిధానములో మార్పులు

368 వ అధికరణ : సంవిధానములో మార్పు చేయు అధికారము అందుకొరకై అనుసరించిన విధానము

## 21 వ భాగం:

తాత్కాలిక సంధికాలపు మరియు ప్రత్యేకమైన అంశములు 369 వ అధికరణ: రాష్ట్రజాబితాలోని అంశాలను ఉమ్మడి జాబితా లోకి చేర్చినట్లు భావించి చట్టాలను పార్లమెంట్ తాత్కాలికముగా

చేయుట 370 వ అధికరణ: జమ్ము, కాశ్మీర్ రాష్ట్రానికి సంబంధించిన తాత్కాలిక అంశములు 371 వ అధికరణ: మహారాష్ట్ర మరియు గుజరాత్ రాష్ట్రాలకు సంబంధించిన ప్రత్యేక అంశములు 371ఎ వ అధికరణ: నాగాలాండ్ రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేకాంశములు 371 బి వ అధికరణ: అస్సాం రాష్ట్రమునకు చెందిన ప్రత్యేక అంశములు 371 సి వ అధికరణ: మణిపూర్ రాష్ట్రమునకు సంబంధించిన ప్రతేక అంశములు 371 డి వ అధికరణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమునకు చెందిన ప్రత్యేక అంశములు 371 ఇ వ అధికరణ: ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ యూనివర్సిటీని స్థాపించుట 371 ఎఫ్ వ అధికరణ: సిక్కిం రాష్ట్రానికి చెందిన ప్రత్యేక అంశములు 371 జి వ అధికరణ: మిజోరాం రాష్ట్రానికి చెందిన ప్రత్యేక అంశములు 371 హెచ్ వ అధికరణ: అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రత్యేక అంశములు 371 ఐ వ అధికరణ: గోవా రాష్ట్రానికి చెందిన ప్రత్యేక అంశములు 371 జె వ అధికరణ : కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రత్యేక అంశములు 372 వ అధికరణ: రాజ్యాంగ శాసనం అమలులోకి వచ్చిన తరువాత అంతకు ముందు ఉన్న చట్టాలను కొనసాగింపు 372 ఎ వ అధికరణ : చట్టాలను అనుసరింపచేయు రాష్ట్రపతి అధికారం 373 వ అధికరణ: ముందు జాగ్రత్త నిర్బంధం కేసులలో రాష్ట్రపతి అధికారాలు 374 వ అధికరణ: ఫెడరల్ కోర్టు మరియు ప్రీవికౌన్సిల్ న్యాయమూర్తుల గురించి మరియు ఆ కోర్టులలో విచారణ కొరకై ఉన్న కేసులను గురించి 375 వ అధికరణ : ఈ సంవిధానం అమలుకు ముందు ఉన్న కోర్టులు. అందలి అధికారులు తమ హోదాలలో కొనసాగుదురు 376 వ అధికరణ: హైకోర్టు న్యాయమూర్తుల గురించి 377 వ అధికరణ: కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా గురించి 378 వ అధికరణ: పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురించి 378 ఎ వ అధికరణ: ఆంధ్రప్రదేశ్ శాసనసభ కాలపరిమితి గురించి 379–391 వ అధికరణలు : ఉపసంహరించబడినవి 392 వ అధికరణ : చిక్కులను పరిష్కరించుట కొరకు రాష్ట్రపతికి గల అధికారములు

**22 వ భాగం :**

సంక్షిప్త నామము, ప్రారంభమగు తేదీ, శాసనం యొక్క హిందీ పాఠం మరియు ఉపసంహరణలు 393 వ అధికరణ: సంక్షిప్త నామము 394 వ అధికరణ: ప్రారంభమగు తేదీ 394 ఎ వ అధికరణ: హిందీ పాఠము 395 వ అధికరణ: ఉపసంహరణలు ❑

---

## రాజ్యాంగం గురించి డా॥ బి.ఆర్. అంబేద్కర్

**(5వ పేజీ తరువాయి)**

గానో, వర్గ యుద్ధంగానో మారడానికి మనం అనుమతించ గూడదు. అదే జరిగితే మన గృహం, ఈ రాజ్యాంగ నిర్ణయసభ ముక్కలైపోతుంది. అది నిజంగా విధ్వంస దినంగా మిగిలి పోతుంది. ఎందుకంటే, అబ్రహాం లింకన్ సరిగ్గా చెప్పినట్టు, తనలో తాను ముక్కలైన గృహం ఎక్కువ కాలం నిలబడి ఉండజాలదు. అందువల్ల, వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి ఎంత తొందరగా అవకాశాలు కల్పిస్తే, కొద్ది మందిగా ఉన్నవారికి అంత మేలు. దేశానికి అంత మేలు. దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడడానికి అంత మేలు. దేశ ప్రజాస్వామిక నిర్మాణాలను నిర్వహించడానికి అంత మేలు. అది సాధించాలంటే సమస్త జీవన రంగాలలో సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని స్థాపించడం ఒక్కటే మార్గం. అందువల్లనే నేను ఆ అంశాల మీద అంతగా నొక్కి చెపుతున్నాను.

ఈ సభా సమయాన్ని నేనింకా ఎక్కువగా తీసుకోదలచలేదు. నిస్సందేహంగా స్వాతంత్ర్యం అనేది సంతోష సందర్భమే. కాని ఈ స్వాతంత్ర్యం మన ముందుకు అనేక బాధ్యతలు తెస్తున్నదని మనం మరచిపోగూడదు. ఇంతకాలంగా ప్రతి తప్పుకూ బ్రిటిష్ వాళ్లను కారణంగా చూపే అవకాశాన్ని ఈ స్వాతంత్ర్యం ద్వారా మనం కోల్పోతాం. ఇకనుంచి ఏదైనా తప్పు జరిగితే మనం నిందించడానికి ఎవరూ లేరు. మనను మనం నిందించు కోవలసిందే. పైగా తప్పులు జరగడానికి మరింత ఎక్కువ అవకాశం ఉంది కూడ. కాలం వేగంగా మారుతున్నది. మన ప్రజలతో సహా ప్రజలందరూ కొత్త భావజాలాలతో ప్రేరణ పొందుతున్నారు. ప్రజల చేత ఏర్పడిన ప్రభుత్వం అనేదానితో వారు విసిగి పోతున్నారు. ప్రజల కొరకు ఏర్పడిన ప్రభుత్వాలు కావాలని వారు అనుకుంటున్నారు. అవి ప్రజల చేత, ప్రజల వల్ల ఏర్పడిన ప్రభుత్వాలు కాకపోయినా సరే అనుకుంటున్నారు. ప్రజల చేత, ప్రజల వల్ల, ప్రజల కొరకు ప్రభుత్వం అనే సూత్రం ఆధారంగా మనం రూపొందించిన ఈ రాజ్యాంగాన్ని మనం సంరక్షించుకోవాలంటే, మన మార్గంలో అడ్డుగా ఉన్న చెడులను గుర్తించడంలో ఏమరపాటు లేకుండా ఉందామని ప్రతిజ్ఞ చేసుకుందాం. ఆ చెడులు మన ప్రజలను ప్రజల చేత ప్రభుత్వం నుంచి మళ్లించి ప్రజల కొరకు ప్రభుత్వం వైపుగా ఆకర్షిస్తాయని గుర్తిద్దాం. ఆ చెడులను తొలగించడంలో మన కర్తవ్యదీక్షలో బలహీనంగా ఉండబోమని ప్రతిజ్ఞ చేద్దాం. దేశానికి సేవ చేయడానికి అది ఒక్కటే మార్గం. అంతకంటే మెరుగైన మార్గం నాకు తెలియదు.

రాజ్యాంగ నిర్ణయ సభ చర్చలు, పదకొండో సంపుటం నుంచి (http://164.100.47.194/Loksabha/Debates/ cadebate files/C25111949.htm) ❑

# భారత రాజ్యాంగం
# ప్రాథమిక హక్కులు - విధులు

## భారతదేశంలో ప్రాథమిక విధులు
**(ఆంగ్లం : Fundamental Duties)**

1976 భారత రాజ్యాంగ 42వ సవరణ ప్రకారం భారతదేశపు పౌరులకు ప్రాథమిక విధులు ఇవ్వబడినవి. అధికరణ 51-ఏ, ప్రకారం పది ప్రాథమిక విధులు ఇవ్వబడినవి. పౌరులకు ఇవ్వబడిన ఈ పది విధులు, వ్యక్తగత, పరిసరాల పట్ల, సమాజం పట్ల మరియు దేశం పట్ల తమ విద్యుక్త ధర్మాన్ని తెలియజేస్తాయి.[1] 2002 భారత రాజ్యాంగ 86వ సవరణ ప్రకారం 11వ విధి ఇవ్వబడింది. ఈ విధి, “తండ్రి గాని, సంరక్షకుడు గాని, తమ బిడ్డలకు 6-14 వయస్సు వరకు విద్యా బోధన చేపట్టాలి”, అని బోధిస్తుంది.

పౌరులందరూ తమకు ఇవ్వబడిన విధులను గౌరవించి, దేశం పట్ల, సమాజం పట్ల, పరిసరాల పట్ల తమ వ్యక్తిగత బాధ్యతను గుర్తించి మసలుకోవలెను.

## అధికరణ 51-ఏ ప్రకారం ప్రాథమిక విధులు

**భారతదేశంలో ప్రతి పౌరునికి గల ప్రాథమిక విధులు :**

1. భారత రాజ్యాంగాన్ని గౌరవించవలెను. రాజ్యాంగపు ఆదర్శాలను, సభలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించవలెను.
2. భారత స్వతంత్ర సంగ్రామంలో, ప్రోత్సహింపబడ్డ ఆదర్శాలను గౌరవించాలి.
3. భారతదేశపు సార్వభౌమత్వాన్ని, అఖండత్వాన్ని, ఏకత్వాన్ని గౌరవించి, పెంపొందింపవలెను.
4. అవసరం లేదా అవకాశం గలిగితే భారతదేశానికి సేవ చేయుటకు ఎల్లవేళలా సిద్ధంగా వుండవలెను.
5. భారతదేశంలో, కుల, మత, వర్గ, లింగ, వర్ణ విభేదాలు లేకుండా ప్రజలందరినీ గౌరవించవలెను. సోదరభావాన్ని, సౌభ్రాతృత్వాన్నీ పెంపొందించవలెను. స్త్రీల యొక్క గౌరవ మర్యాదలను భంగపరిచే అమర్యాదకరమైన ఆచారాలను పద్ధతులను విడనాడాలి.
6. మన భారతదేశంలో గల మిశ్రమ సంస్కృతినీ, మిశ్రమ మరియు అద్భుత వారసత్వాన్ని కాపాడుకొనవలెను.
7. ప్రకృతీ పరిసరాలైన అడవులను, సరస్సులను, నదులను మరియు వన్యప్రాణులను మరియు ఇతర జీవులను సంరక్షించుకొనవలెను.
8. శాస్త్రీయ దృక్పథాన్ని, వైజ్ఞానిక విషయాలను పెంపొందించి జ్ఞానాభివృద్ధి కొరకు ఎల్లవేళలా పాటుపడవలెను.
9. ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను కాపాడవలెను. హింసను విడనాడవలెను.
10. భారతదేశం అభివృద్ధి చెందునట్లు, వ్యక్తిగతంగాను, సామాజికంగాను లేదా మిశ్రమంగానూ పాటుపడుతూ, దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ, దానిని సాధించుటకు కృషి చేయవలెను.

## భారత రాజ్యాంగం - ప్రాథమిక హక్కులు

**ప్రాముఖ్యత మరియు లక్షణాలు**

ప్రాథమిక హక్కులు, పౌరులకు తమ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి పరచుకొనుటకు, మరియు బాధ్యతగలిగిన పౌరులుగా హుందాగా జీవించుటకు, ప్రభుత్వపరంగా, చట్టరీత్యా ఇవ్వబడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. ఇక్కడ ప్రభుత్వమనగా, భారతదేశంలో అధికారం గల అన్ని అంగాలు. వీటిలో భారత ప్రభుత్వము, పార్లమెంటు, భారతదేశంలోని రాష్ట్రాలూ, రాష్ట్రాలలో గల, జిల్లాపరిషత్తులూ, కార్పొరేషన్లు, నగరపాలికలు, పంచాయతీలు, గ్రామపంచాయతీలు వగైరా.

**సమానత్వపు హక్కు**

సమానత్వపు హక్కు, రాజ్యాంగం అధికరణలు 14, 15, 16, 17 మరియు 18ల ప్రకారం ప్రసాదించబడింది. ఈ హక్కు చాలా ప్రధానమైనది, స్వేచ్ఛా సమానత్వాలు ప్రసాదించే ఈ హక్కు, క్రింది విషయాల గ్యారంటీనిస్తుంది.

**చట్టం ముందు సమానత్వం :** రాజ్యాంగ అధికరణ (ఆర్టికల్) 14 ప్రకారం, భారత భూభాగంలో ఉన్న వ్యక్తులందరూ సమానంగా, భారతచట్టాల ప్రకారం కాపాడబడవలెను. అనగా ప్రభుత్వం వ్యక్తుల పట్ల కుల, మత, వర్గ, వర్ణ, లింగ మరియు పుట్టిన ప్రదేశాల ఆధారంగా ఏలాంటి వివక్ష చూపరాదు.

**పౌరప్రదేశాలలో సామాజిక సమానత్వం మరియు సమాన ప్రవేశాలు :** అధికరణ 15 ప్రకారం, పౌరులు పౌర (పబ్లిక్) ప్రదేశాలయిన, పార్కులు, మ్యూజియంలు, బావులు, స్నానఘాట్లు మరియు దేవాలయాలు మొదలగు చోట్ల ప్రవేశించుటకు సమాన హక్కులు కలిగి ఉన్నారు. ప్రభుత్వాలు పౌరుల పట్ల ఎలాంటి వివక్ష చూపరాదు. కానీ కొన్ని సందర్భాలలో ప్రభుత్వం, స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేక వసతులు కల్పించవచ్చు. అలాగే సామాజికంగా

వెనుకబడిన వారికి ప్రత్యేక సదుపాయాలు, ప్రభుత్వాలు కలుగజేయవచ్చు.

**పౌర ఉద్యోగాల విషయాలలో సమానత్వం :** అధికరణ 16 ప్రకారం, ఉద్యోగాలు పొందేందుకు, ప్రభుత్వాలు పౌరులందరికీ సమాన అవకాశాలు మరియు హక్కులు కల్పించవలెను. ప్రభుత్వాలు, పౌరులకు ఎలాంటి వివక్షలూ చూపరాదు. 2003 'పౌర (సవరణ) బిల్లు' ప్రకారం, ఈ హక్కు ఇతర దేశాల పౌరసత్వాలు పొందిన భారతీయులకు వర్తించదు.

**అంటరానితనం నిషేధాలు :** అధికరణ 17 ప్రకారం, అంటరానితనాన్ని ఎవరైనా అవలంబిస్తూ వుంటే చట్టం ప్రకారం శిక్షార్హులు. అంటరానితనం నేర చట్టం (1955), 1976లో పౌర హక్కుల పరిరక్షణా చట్టం పేరు మార్పు పొందింది.

**బిరుదుల నిషేధాలు :** అధికరణ 18 ప్రకారం, భారత పౌరులు, ఏలాంటి బిరుదులూ పొందరాదు. ఇతరదేశాలనుండి కూడా ఏలాంటి బిరుదులు పొందరాదు. ఉదాహరణకు బ్రిటిష్ ప్రభుత్వం, రాయ్ బహాదుర్, ఖాన్ బహాదుర్ లాంటి, "ప్రభుత్వ లేక రాజ్య సంబంధ బిరుదులు", సైన్యపరమైన బిరుదులూ ప్రకటించేది, ఇలాంటివి నిషేధం. కానీ విద్య, సంస్కృతీ, కళలు, శాస్త్రాలు మొదలగు వాటి బిరుదులు ప్రసాదించనూవచ్చు మరియు పొందనూవచ్చు. భారత రత్న మరియు పద్మ విభూషణ్ లాంటి వాటిని పొందినవారు, వీటిన తమ "గౌరవాలు"గా పరిగణించవచ్చు గాని, 'బిరుదులు'గా పరిగణించరాదు. 1995, 15 డిసెంబరు న సుప్రీంకోర్టు, ఇలాంటి బిరుదుల విలువలను నిలుపుదల చేసింది.

### స్వాతంత్ర్యపు హక్కు

భారత రాజ్యాంగము, తన అధికరణలు 19, 20, 21 మరియు 22 ల ద్వారా స్వాతంత్ర్యపు హక్కును ఇస్తున్నది. ఇది వైయుక్తిక హక్కు. ప్రతి పౌరుడూ ఈ హక్కును కలిగివుండడం, రాజ్యాంగ రచనకర్తల అసలు అభిలాష. అధికరణ 19, క్రింది ఆరు స్వేచ్ఛలను పౌరులకు ఇస్తున్నది :

1. వాక్-స్వాతంత్ర్యపు హక్కు మరియు భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం
2. సమావేశాలకు స్వేచ్ఛ, ఈ సమావేశాలు శాంతియుతంగా, ఆయుధాలు కలిగి వుండరాదు. దేశం మరియు ప్రజా శ్రేయస్సులను దృష్టిలో వుంచుకుని, ప్రభుత్వాలు వీటి అనుమతులు నియంత్రించనూవచ్చు.
3. సంస్థలు, సొసైటీలు స్థాపించే హక్కు. దేశ మరియు ప్రజా శ్రేయస్సుల దృష్ట్యా ప్రభుత్వం వీటిని నియంత్రించనూవచ్చు లేదా నిషేధించనూవచ్చు.
4. భారత పౌరుడు, భారతదేశం అంతర్భాగంలో ఏప్రాంతంలోనైనా పర్యటించవచ్చు. కాని కొన్నిసార్లు ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అంటురోగం గల సమయాలలో వాటిని అరికట్టే ప్రయత్నాలలో, పౌరుల ప్రయాణాలను నిషేధించవచ్చు.
5. భారత అంతర్భాగంలో ఏ ప్రదేశంలోనైనా, పౌరులు, నివాసాన్ని ఏర్పరచుకోవచ్చు. కానీ, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగల పరిరక్షణ దృష్ట్యా, ప్రభుత్వం కొన్ని నియంత్రణలు చేయవచ్చును.
6. భారతదేశంలోని ఏప్రాంతంలోనైనా, పౌరులు వ్యాపారాలు, వర్తకాలూ, ఉద్యోగాలూ చేపట్టవచ్చును. కానీ, నేరాలుగల వ్యాపారాలు, చీకటి వ్యాపారాలు మరియు నీతిబాహ్య వ్యాపారాలు చేపట్టరాదు.

ప్రాణాలు కాపాడే మరియు కాపాడుకునే హక్కునూ రాజ్యాంగం కల్పిస్తున్నది. అధికరణ 20, ఈ విషయాన్నీ చర్చిస్తుంది. ప్రాణాలు కాపాడుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛ క్రిందనే పరిగణింపబడుతుంది. అధికరణ 21 ప్రకారం, ఏ పౌరుడూ తన స్వేచ్ఛనూ, జీవితాన్ని కోల్పోయే హక్కు కలిగి లేడు, చట్టాన్ని తప్పించి.

### దోపిడిని నివారించే హక్కు

The right against exploitation, అధికరణలు 23 మరియు 24 ల ప్రకారం, కట్టు బానిసత్వం మరియు బాలకార్మిక విధానాలు నిషేధం మరియు 14 సంవత్సరాలకు లోబడి గల బాలబాలికలకు అపాయకరమైన పనులు (కర్మాగారాలలో, గనులలో) చేయించుట నిషేధం. బాలకార్మిక విధానం, రాజ్యాంగ ఊపిరికే విఘాతం లాంటిది. కట్టు బానిసత్వం, విధానంలో భూస్వాములు లేదా పెత్తందార్లు, మానవహక్కులకు విఘాతాలు కలుగజేసేవారు. మానవులకు కట్టుబానిసలుగా ఉంచుకుని, తరతరాల స్వాతంత్ర్యాన్ని హరించివేసేవారు. ఈ దురాగతాన్ని మాన్పించడానికే ఈ హక్కు కల్పించబడింది. మానవులకు 'బానిస వర్తకాలు', 'వ్యభిచారం' లాంటి అశ్లీల వృత్తులయందు బలవంతంగా ప్రవేశించేలా చేయువారికి చట్టప్రకారం కఠిన శిక్షలున్నాయి. కానీ కొన్ని అత్యవసర సమయాలలో ప్రభుత్వాలు, జీతభత్యాలు లేని ఉద్యోగాలు మరియు, తప్పనిసరి సైనిక భర్తీలను చేపట్టుట లాంటి వాటిని, ప్రత్యేక పరిస్థితులలో అనుమతించవచ్చును.

### మత స్వాతంత్రపు హక్కు

భారతదేశంలో పౌరులందరికీ మతస్వాతంత్ర్యపు హక్కును, అధికరణలు (ఆర్టికల్స్) 25, 26, 27 మరియు 28 ల ప్రకారం ఇవ్వబడింది. ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యం సెక్యులరిజం సూత్రాలను స్థాపించుటకు ఉద్దేశించినవి. భారత రాజ్యాంగం ప్రకారం, భారతదేశంలోని అన్ని మతాలు సమానమే, ఏమతమూ ఇతర

మతంపై ప్రాధాన్యతను కలిగి లేదు. ప్రతి పౌరుడు తన ఇష్టానుసారం మతాన్ని అవలంభించుటకు స్వేచ్ఛ కల్పింపబడ్డాడు. పౌరులు తమ మతాల గూర్చి ఉపన్యసించవచ్చు, అవలంబించ వచ్చు మరియు మతవ్యాప్తి కొరకు పాటుపడవచ్చు. అలాగే, మతపరమైన సంప్రదాయాలను ఉదాహరణకు సిక్కులు కిర్పాన్‌లను తమ ఉద్యోగాలు చేయు సమయాన ధరించడానికి, ప్రజల శ్రేయస్సును, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడానికి, నిరోధించవచ్చు.

ధార్మిక సంస్థలు, ప్రజాపయోగ స్వచ్ఛంద సంస్థలను స్థాపించుకొనవచ్చు. ఇతరత్రా, మతసంబంధం కాని కార్యకలాపాలను, ప్రభుత్వం నిర్దేశించిన చట్టాల ప్రకారం చేపట్టవచ్చు. చారిటబుల్ సంస్థలను కూడా ప్రజాపయోగం, సుహృద్భావన మరియు నియమాలను పునస్కరించుకొని, తమ కార్యకలాపాలు చేయునట్లుగా ప్రభుత్వం నిర్దేశించవచ్చును. మతపరమైన కార్యకలాపాల కొరకు ఏలాంటి పన్నులను విధించగూడదు మరియు నిర్దేశించగూడదు. ప్రభుత్వాలు నడిపే విద్యాసంస్థలలో, ప్రత్యేక మతాన్ని రుద్దే బోధనలు చేపట్టకూడదు. అలాగే, ఈ ఆర్టికల్స్‌లోని విషయాలు, ప్రభుత్వాలు చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాలపై ఏలాంటి విఘాతాలు కలిగించ గూడదు. ప్రభుత్వాలు చేపట్టే ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ విషయాలలో, ధార్మిక సంస్థల కార్యకలాపాలు అడ్డంకులుగా వుండరాదు.

## సాంస్కృతిక మరియు విద్యాహక్కులు

భారతదేశం, అనేక మతాలకు, భాషలకు మరియు సంస్కృతులకు నిలయం. రాజ్యాంగం వీరికి కొన్ని ప్రత్యేక హక్కులను ఇస్తూంది. అధికరణ 29 మరియు 30 ల ప్రకారం, మైనారిటీలకు కొన్ని హక్కులు ఇవ్వబడినవి. ఏ మైనారిటీలకు చెందినవాడైననూ, ప్రభుత్వం వీరికి, ప్రభుత్వ మరియు ప్రభుత్వసహాయం పొందిన సంస్థలలో ప్రవేశానికి నిషేధించరాదు.

మైనారిటీలు, అనగా మతం, భాష మరియు సాంస్కృతిక పరమైన మైనారిటీలు, తమ మతాన్ని, భాషలనూ, సంస్కృతినీ రక్షించుకొనుటకు, మైనారిటీ సంస్థలు స్థాపించుకొనవచ్చును. ఆ సంస్థలద్వారా వారు, తమ అభ్యున్నతికి పాటుపడవచ్చును. ఈ సంస్థలలో దుర్వినియోగాలు జరుగుతున్న సమయాన ప్రభుత్వాలు తమ ప్రమేయాలు కలుగజేసుకోవచ్చును.

## రాజ్యాంగ పరిహారపు హక్కు

ప్రాథమిక హక్కులకు ఏపాటియైనా భంగం కలిగితే, రాజ్యాంగ పరిహారపు హక్కును కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఉదాహరణకు, పౌరుడు, జైలు శిక్షను పొందితే, ఆ వ్యక్తి, న్యాయస్థానాలను ఆశ్రయించి, ఇది దేశ చట్టాలనుసారంగా వున్నదా లేదా అని ప్రశ్నించే హక్కును కలిగి ఉన్నాడు. ఒకవేళ, న్యాయస్థానం నుండి జవాబు "కాదు" అని వస్తే, ఆ వ్యక్తికి తక్షణమే విడుదలచేయవలసి వస్తుంది. పౌరుల హక్కులను వాటి సంరక్షణలను గూర్చి న్యాయస్థానాలను అడిగే విధానాలు కొన్ని ఉన్నాయి. న్యాయస్థానాలు కొన్ని దావాలను ప్రవేశపెట్టవచ్చు. ఆ దావాలు, హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో వారంటో మరియు సెర్టియోరారి. ఒక వేళ దేశంలో అత్యవసర పరిస్థితి యేర్పడితే, ఈ హక్కులన్నీ కేంద్ర ప్రభుత్వంచే 'సస్పెండు' చేయబడుతాయి.

## ఆస్తి హక్కు - క్రిత ప్రాథమిక హక్కు

భారత రాజ్యాంగం, ఆర్టికల్ 19 మరియు 31 వరకు గల విషయాలలో ఆస్తి హక్కును పౌరుల ప్రాథమిక హక్కుగా పరిగణించింది. ఆర్టికల్ 19, పౌరులందరికీ, ఆస్తులను సంపాదించడం, వుంచుకొనడం, అమ్మడం లాంటి హక్కులను కలుగజేసింది. ఆర్టికల్ 31 'పౌరులెవ్వరూ తమ ఆస్తి హక్కును, ప్రభుత్వాల ద్వారా కోల్పోగూడదు'. ప్రభుత్వం ప్రజల అవసరాల రీత్యా పౌరుల ఆస్తిని గైకొన్న యెడల, ఆ ఆస్తిదారునికి 'కాంపెన్జేషన్' చెల్లించవలెనని కూడా నొక్కి వక్కాణిస్తుంది.

కానీ భారత రాజ్యాంగ 44వ సవరణ ద్వారా, 1978 లో ఈ ఆస్తి హక్కును, ప్రాథమిక హక్కుల జాబితా నుండి తొలగించింది. ఓ క్రొత్త ఆర్టికల్ 300-ఏ, సృష్టింపబడింది. ఈ ఆర్టికల్ ప్రకారం "చట్టం ప్రకారం, పౌరుడు పొందిన ఆస్తిని, భంగం కలిగించరాదు". ఆస్తి హక్కు రాజ్యాంగపరమైన హక్కుగా పరిగణించబడుతున్ననూ, ప్రాథమిక హక్కు హోదాను కోల్పోయింది.

## విమర్శాత్మక విశ్లేషణ

ఈ ప్రాథమిక హక్కులను చాలా మంది పలువిధాలుగా విమర్శించారు. రాజకీయ సముదాయాలు, ప్రాథమిక హక్కులలో పని హక్కు, నిరుద్యోగస్థితి మరియు వయసు మీరిన స్థితులలో ఆర్థిక సహాయ హక్కు, మున్నగునవి చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ హక్కులన్నీ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు మరియు ప్రాథమిక విధులులో క్రోడీకరించియున్నవి. స్వాతంత్ర్యపు హక్కు మరియు స్వీయస్వతంత్రం కూడా కొన్నిసార్లు విమర్శలకు లోనైనవి. ఇవి పరిధులకు మించి స్వేచ్ఛలు కలిగి వున్నవని విమర్శింపబడినవి. ఈ పౌరహక్కులు ఎమర్జన్సీ యందు, నిలుపుదల చేయబడుతాయి, ఇలా నిలుపుదల చేసే చట్టాలకు ఉదాహరణ 'మీసా' (MISA Maintenance of Internal Security Ac) మరియు జాతీయ రక్షణా చట్టం ఎన్.ఎస్.ఏ. NSA (National Security Act). జాతీయ విపత్తుల (దేశ రాజకీయ అంతర్గత సంక్షోభం) సమయాలలో 'అత్యవసర పరిస్థితి' ని ప్రకటించి, ఈ కాలంలో పౌరహక్కులను తాత్కాలికంగా వెనక్కి తీసుకుంటారు.

☞ మిగతా 24వ పేజీలో

# భారత రాజ్యాంగంలో షెడ్యూల్స్

### I వ షెడ్యూల్ (1 నుంచి 4వ అధికరణాలు)

* మొదటి అనుబంధం భారతదేశ నిర్మాణం, భారతదేశ సరిహద్దులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, విలీన విభాగాలను గురించి వివరిస్తుంది. ప్రస్తుతం భారతదేశంలో 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి.

### II వ షెడ్యూల్: జీతభత్యాలు

* జీత భత్యాలను గురించి వివరిస్తుంది.
* రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, లోక్‌సభ డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ అధ్యక్షుడు (ఉప రాష్ట్రపతి), రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, రాష్ట్ర విధానసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాష్ట్ర విధానమండలి ఛైర్మన్, ఉప ఛైర్మన్, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ జీత భత్యాల గురించి వివరిస్తుంది.
* నోట్ : రెండో షెడ్యూల్‌లో పొందుపర్చిన వారి జీత భత్యాలను పార్లమెంట్ నిర్ణయిస్తుంది.

### III వ షెడ్యూల్: ప్రమాణ స్వీకారాలు

* ప్రధానమంత్రి, కేంద్ర మంత్రిమండలి, పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, మంత్రిమండలి, రాష్ట్ర శాసనసభ సభ్యుల ప్రమాణస్వీకారాలు, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం గురించి వివరిస్తుంది.

### IV వ షెడ్యూల్- రాజ్యసభ నిర్మాణం

* రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన రాజ్యసభలో ప్రాతినిధ్యం కల్పిస్తారు. విధానసభ కలిగిన ఢిల్లీ, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాలకు రాజ్యసభలో ప్రాతినిధ్యం కలదు.
* ఉదా: ఎక్కువ జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు 31 మంది సభ్యుల ప్రాతినిధ్యం, తక్కువ జనాభా కలిగిన సిక్కిం నుంచి ఒకరికి మాత్రమే ప్రాతినిధ్యం ఉంది.
* తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభలో ఏడుగురికి ప్రాతినిధ్యం ఉంది.

### V వ షెడ్యూల్ : 244 (1) అధికరణం

* షెడ్యూల్డ్ ప్రాంతాలు, గిరిజన తెగలకు సంబంధించిన పాలనా అంశాలు.
* గిరిజన ప్రదేశాలను షెడ్యూల్డ్ ఏరియాగా పార్లమెంట్ గుర్తిస్తుంది. వాటికి సంబంధించిన అంశాలను రాష్ట్రపతి ప్రకటిస్తాడు.

### VI వ షెడ్యూల్ : 224(2), 275(1) అధికరణాలు

* అసోం, త్రిపుర, మేఘాలయ, మిజోరాం రాష్ట్రాల్లో గిరిజనులు అత్యధికంగా ఉన్న ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన అంశాలను చేర్చారు.

### VII వ షెడ్యూల్ : కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికార విభజన

* 246 ప్రకరణను అనుసరించి కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికారాలను 3 జాబితాలుగా విభజించారు.
* రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు కేంద్ర జాబితాలో 97 అంశాలు, రాష్ట్ర జాబితాలో 66 అంశాలు ఉమ్మడి జాబితాలో 47 అంశాలను పొందుపర్చారు.
* ప్రస్తుతం కేంద్ర జాబితా : 99 అంశాలు
* రాష్ట్ర జాబితా : 61 అంశాలు
* ఉమ్మడి జాబితా : 52 అంశాలు
* 88వ రాజ్యాంగ సవరణ ద్వారా 2003లో సేవలపై పన్ను కేంద్ర జాబితాలో 268(A) ప్రకరణలో చేర్చారు. ప్రస్తుతం కేంద్ర జాబితాలో 100 అంశాలు (తెలుగు అకాడమీని అనుసరించి 99 అంశాలు) ఉన్నాయి.

### VIII వ షెడ్యూల్ : భాషలు

* రాజ్యాంగం గుర్తించిన అధికారిక భాషలు (344(1) నిబంధన)
* రాజ్యాంగం అమల్లోకి వచ్చినపుడు 8వ షెడ్యూల్‌లో 14 భాషలు మాత్రమే ఉన్నాయి. అవి...
* 1) అస్సామీ 2) బెంగాలీ 3) గుజరాతీ 4) హిందీ 5) కన్నడం 6) కాశ్మీరం 7) మలయాళం 8) మరాఠీ 9) ఒరియా 10) పంజాబీ 11) సంస్కృతం 12) తమిళం 13) తెలుగు 14) ఉర్దూ భాషలు ఉన్నాయి.

* 15వ భాషగా సింధీని 21వ రాజ్యాంగ సవరణ ద్వారా 1967లో చేర్చారు.
* 16,17,18వ భాషలుగా కొంకిణి, మణిపూరి, నేపాలీ భాషలను 71వ రాజ్యాంగ సవరణ ద్వారా 1992 సంవత్సరంలో చేర్చారు.
* 19, 20, 21, 22 భాషలుగా 92వ రాజ్యాంగ సవరణగా బోడో, డోగ్రి, మైథిలీ, సంతాలు అనే భాషలను 2003లో 8వ షెడ్యూల్‌లో చేర్చారు.
* 343 నిబంధన ప్రకారం హిందీ (దేవనాగరిక లిపిని) జాతీయ భాషగా గుర్తించారు.
* సెప్టెంబర్ 14 హిందీ భాషా దినోత్సవం
* 1963 సంవత్సరంలో అధికారిక భాషా చట్టాన్ని రూపొందించారు.
* ఇంగ్లీష్‌ను అధికారిక భాషగా కాకుండా అనుసంధాన భాషగా కొనసాగిస్తున్నారు.
* 2011లో 96వ రాజ్యాంగ సవరణ ద్వారా VIIIవ షెడ్యూల్‌లో ఒరియా అనే పదం స్థానంలో ఒడియా అనే పదాన్ని చేర్చారు.

### IX వ షెడ్యూల్ : 31-B నిబంధన

* భూసంస్కరణలు, రిజర్వేషన్లు అనే అంశాన్ని మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా జూన్ 18, 1951లో చేర్చారు.
* 76వ రాజ్యాంగ సవరణ ద్వారా 1995 సంవత్సరంలో తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి 69 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగంలో IXవ షెడ్యూల్‌లో చేర్చారు.
* 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినపుడు మన రాజ్యాంగంలో 395 ప్రకరణలు, 8 షెడ్యూల్స్, 22 విభాగాలు ఉన్నాయి.
* ప్రస్తుతం మన రాజ్యాంగంలో సుమారు 462 ప్రకరణలు (తెలుగు అకాడమీ ప్రకారం450 ప్రకరణలు) 12 షెడ్యూల్స్, 25 విభాగాలు కలవు.
* నిబంధన : ఆంగ్లంలో Articals అంటారు. ఆర్టికల్‌ను అధికరణం/నిబంధన/ప్రకరణ అంటారు.
* విభాగాలు (Parts) : రాజ్యాంగాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి అందులోని విషయాలను 22 అంశాలుగా తెలియజేశారు.
* రాజ్యాంగ సవరణ : మారుతున్న కాలానికి, పరిస్థితులకు అనుగుణంగా భారత పార్లమెంట్ చేసే సవరణను రాజ్యాంగ సవరణ అంటారు.
* భారత రాజ్యాంగం నుంచి 1956 సంవత్సరంలో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా VII, IX భాగాలు తొలగించారు.
* 1976 సంవత్సరంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా IV A భాగం (ప్రాథమిక విధులు), XIV A భాగం పాలనా ట్రిబ్యునల్స్ చేర్చారు.
* 1993 సంవత్సరంలో IXవ భాగంలో పంచాయతీరాజ్ వ్యవస్థను 73వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చగా IX A భాగంలో 1993లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ ప్రభుత్వాలకు రాజ్యాంగ హోదా కల్పించారు.
* 2012వ సంవత్సరంలో 97వ రాజ్యాంగ సవరణ ద్వారా సహకార సంఘాలను రాజ్యాంగంలో IX B భాగంలో చేర్చారు.
* ప్రస్తుతం భారత రాజ్యాంగంలో భాగాలు 22 (Number of Parts 25), నిబంధనలు 395 మాత్రమే ఉన్నాయి (Number of Articles 462)
* 2015 జనవరి నాటికి పార్లమెంట్ 121 రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టగా 99 మాత్రమే ఆమోదం పొందాయి.
* ఉదా : 99వ రాజ్యాంగ సవరణ న్యాయ నియామకాల కమిషన్

### X వ షెడ్యూల్ : పార్టీ ఫిరాయింపులు

* 102(2), 191 (2) అధికరణాలు
* 1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని 10వ షెడ్యూల్‌గా రాజ్యాంగంలో చేర్చారు.
* 91వ రాజ్యాంగ సవరణ ద్వారా 2003లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి సవరణలు చేశారు.

### XI వ షెడ్యూల్ : పంచాయతీరాజ్ సంస్థలు

* 243(A) నుంచి 243(O) నిబంధనలు
* నూతన పంచాయతీరాజ్ చట్టం 1992ను 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1993లో రాజ్యాంగంలో 9వ భాగంలో చేర్చి పంచాయతీరాజ్ సంస్థలకు 29 అధికారాలను కట్టబెట్టారు.

### XII వ షెడ్యూల్ : పట్టణ సంస్థలు

* 243(P) నుంచి 243(ZG) నిబంధనలు
* పట్టణ ప్రభుత్వాల చట్టం 1992 ను 74వ రాజ్యాంగ సవరణ ద్వారా 1993లో రాజ్యాంగంలోని 9A భాగంలో చేర్చి 18 అధికారాలను కేటాయించారు. ❑

# రాజ్యాంగ రచన - రాజ్యాంగ సభ

మన దేశం కంటే ముందు అనేక దేశాలు రాజ్యాంగాలను రచించాయి. అయితే భారత రాజ్యాంగ రచన ఒక సంక్లిష్టమైన విధానం. దేశంలో అనేక మతాలూ, తెగలూ, ఆదీవాసీలూ, దళితులూ, అణగారిన వర్గాలూ, పీడనకు గురైన వర్గాలు... తదితరులున్నారు. వీరి ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగ రచన ఒక సవాల్‌లాంటిదే.

ఈ నేపథ్యంలో భారత మొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ నేతృత్వంలోని రాజ్యాంగ సభ డా.బాబాసాహెబ్ అంబేద్కర్ సారథిగా డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేసింది.

1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించింది. జనవరి 26, 1950 నుంచి రాజ్యాంగం అమలులోకి వచ్చింది.

### భారత రాజ్యంగ్యం దేశానికి సర్వోన్నత చట్టం

భారత రాజ్యాంగం ద్వారా భారత దేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చింది. 1950 జనవరి 26న భారత రాజ్యాంగాన్ని అమలు పరిచిన తరువాత స్వతంత్ర భారత దేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. భారత ప్రభుత్వ నిర్మాణం ఎలా ఉండాలి, పరిపాలన ఎలా జరగాలి అనే విషయాలను రాజ్యాంగం నిర్దేశించింది. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థల ఏర్పాటు, ఆయా వ్యవస్థల అధికారాలు, బాధ్యతలు, వాటి మధ్య సమన్వయం ఎలా ఉండాలో కూడా నిర్దేశిస్తోంది.

### రాజ్యాంగ పరిషత్..

భారత రాజ్యాంగాన్ని తయారు చెయ్యడానికి ఒక రాజ్యాంగ సభ లేక రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేసారు. ఈ సభలో సభ్యులను పరోక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకున్నారు. సభ్యుల కూర్పు ఇలా ఉన్నది. రాష్ట్ర శాసన సభల ద్వారా ఎన్నికైన సభ్యులు: 292

భారత్ సంస్థానాల నుండి ఎన్నికైన సభ్యులు: 93

ఛీఫ్ కమిషనర్ ప్రావిన్సుల ప్రతినిధులు: 4

ఈ విధంగా మొత్తం సభ్యుల సంఖ్య 389 అయింది. అయితే, మౌంట్‌బాటెన్ యొక్క జూన్1947 నాటి దేశ విభజన ప్రణాళిక కారణంగా ఈ సభ్యుల సంఖ్య 299కి తగ్గిపోయింది.

రాజ్యాంగ సభ మొదటి సమావేశం ఢిల్లీలో ఇప్పటి పార్లమెంటు భవనపు సెంట్రల్ హాలులో1946, డిసెంబర్9 న జరిగింది. మొత్తం 211 మంది సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అందులో తొమ్మిది మంది మహిళలు.

రాజ్యాంగం రాత ప్రతిని తయారు చెయ్యడం కొరకు 1947 ఆగష్టు 29న రాజ్యాంగ సభ ఒక డ్రాఫ్టు కమిటీని ఏర్పాటు చేసింది. డా.బి.ఆర్.అంబేద్కర్ ఈ కమిటీకి అధ్యక్షుడు.

### రాజ్యాంగ సభ విశేషాలు..

స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణానికి రాజ్యాంగ సభకు పట్టిన కాలం: 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు.

రాజ్యాంగ సభ 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశమైంది.

ఇందులో 114 రోజులు రాజ్యాంగం రాత ప్రతిపై వెచ్చించింది. రాజ్యాంగ రాత ప్రతిని తయారుచేసే క్రమంలో రాజ్యాంగ సభ ముందుకు 7,635 సవరణ ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరించింది. భారత రాజ్యాంగాన్ని1949 నవంబర్ 26న సభలో ఆమోదించారు. 1950 జనవరి 24న సభ్యులు ఈ ప్రతిపై సంతకాలు పెట్టారు. మొత్తం 284 మంది సభ్యులు సంతకాలు చేసారు. రాజ్యాంగంపై సంతకాలు చేసే రోజున బయట చిరుజల్లు పడుతూ ఉంది. దీన్ని శుభ శకునంగా భావించారు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. ఆ రోజున రాజ్యాంగ సభ రద్దయి, భారత్ తాత్కాలిక పార్లమెంటుగా మారింది. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల తరువాత కొత్త పార్లమెంటు ఏర్పడే వరకు ఈ తాత్కాలిక పార్లమెంటు ఉనికిలో ఉంది.

### రాజ్యాంగ విశేషాలు..

భారత రాజ్యాంగం ప్రపంచంలోని అతి పెద్ద లిఖిత రాజ్యాంగాలలో ఒకటి. అవతారిక, 448 అధికరణాలు, 12 షెడ్యూళ్లతో కూడిన గ్రంథం ఇది. రాజ్యాంగం భారత ప్రభుత్వ వ్యవస్థా, రాష్ట్రాలూ, రాష్ట్రాల నిర్మాణం, కేంద్ర, రాష్ట్ర సంబంధాలూ, కేంద్ర రాష్ట్రాల విధులూ, అధికారాలూ, స్థానిక సంస్థలూ, ఎన్నికలు మొదలైన విషయాలను నిర్వచించింది.

పౌరులకూ, భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించి కింది వాటిని సూత్రీకరించింది..

ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్య వ్యవస్థ ప్రాథమిక విధులు భారత రాజ్యాంగం – ప్రాథమిక హక్కులు ఆదేశ సూత్రాలు ద్విసభా విధానం భాషలు వెనుకబడిన సామాజిక వర్గాలు.

అవసరమైనపుడు రాజ్యాంగాన్ని సవరించుకోడానికి వెసులుబాటు కలిగిస్తూ, సవరణ విధానాన్ని కూడా నిర్దేశించింది.

**అవతారిక..**

రాజ్యాంగంలో అవతారిక ప్రముఖమైనది. రాజ్యాంగ నిర్మాణం ద్వారా భారతీయులు తమకు తాము అందివ్వదలచిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పట్ల తమ నిబద్ధతను, దీక్షను ప్రకటించుకున్నారు.

**పీఠిక..**

భారత ప్రజలమైన మేము, భారత్‌ను సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఏర్పరచాలని, దేశ పౌరులందరికీ కింది అంశాలు అందుబాటులో ఉంచాలని సంకల్పించాము:

సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం;

ఆలోచనా స్వేచ్ఛ, భావప్రకటన స్వేచ్ఛ, మతావలంబన స్వేచ్ఛ;

హోదాలోను, అవకాశాలలోను సమానత్వం;

వ్యక్తి గౌరవాన్ని, దేశ సమైక్యతను, సమగ్రతను కాపాడి సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పుతామని కూడా దీక్షాబద్ధులమై ఉన్నాము;

1949 నవంబర్ 26వ తేదీన మా రాజ్యాంగ సభలో ఈ రాజ్యాంగాన్ని స్వీకరించి, ఆమోదించి, మాకు మేము సమర్పించుకుంటున్నాము.

మొదట్లో అవతారికలో భారత్‌ను సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పేర్కొన్నారు. అయితే 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా ఇది సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మారింది. దీనిలో ఆదేశిక సూత్రాలు

**ఇతర రాజ్యాంగాల నుంచి గ్రహించిన అంశాలు**

భారత రాజ్యాంగానికి 1935 భారత ప్రభుత్వ చట్టం మూలాధారం అయినప్పటికీ అనేక అంశాలు ఇతర రాజ్యాంగాల నుంచి గ్రహించారు. వాటిలో ముఖ్యమైనవి

ఏక పౌరసత్వం : బ్రిటన్

పార్లమెంటరీ విధానం : బ్రిటన్

స్పీకర్ పదవి : బ్రిటన్

భారతదేశంలో ప్రాథమిక హక్కులు : అమెరికా

సుప్రీం కోర్టు : అమెరికా

న్యాయ సమీక్షాధికారం : అమెరికా

భారతదేశంలో ఆదేశిక సూత్రాలు : ఐర్లాండ్

రాష్ట్రపతి ఎన్నిక పద్ధతి : ఐర్లాండ్

రాజ్యసభ సభ్యుల నియామకం : ఐర్లాండ్

భారతదేశంలో ప్రాథమిక విధులు : రష్యా

కేంద్ర రాష్ట్ర సంబంధాలు : కెనడా

అత్యవసర పరిస్థితి : వైమర్ (జర్మనీ)

భారత రాజ్యాంగంలోని షెడ్యూళ్లు..

భారత రాజ్యంగ రూపకల్పన సమయంలో 8 షెడ్యూళ్ళు ఉండగా ప్రస్తుతం 12 షెడ్యూళ్ళు ఉన్నాయి. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 9 వ షెడ్యూల్‌ను చేర్చగా, 1985లో 52 వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కాలంలో 10 వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు. ఆ తర్వాత 1992లో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా 11 మరియు 12 వ షెడ్యూళ్ళను చేర్చబడింది.

**సవరణలు..**

రాజ్యాంగంలో మార్పులకు, చేర్పులకు, తొలగింపులకు సంబంధించి పార్లమెంటుకు రాజ్యాంగం అపరిమితమైన అధికారాలిచ్చింది.

రాజ్యాంగం నిర్దేశించినదాని ప్రకారం సవరణలను కింది విధంగా చెయ్యాలి.

పార్లమెంటు ఉభయసభల్లోను సవరణ బిల్లు ఆమోదం పొందాలి. సభలో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల ఆధిక్యత, మరియు మొత్తం సభ్యుల్లో సాధారణ ఆధిక్యతతో మాత్రమే బిల్లు ఆమోదం పొందుతుంది. అయితే ప్రత్యేకించిన కొన్ని అధికరణాలు, షెడ్యూళ్ళకు సంబంధించిన సవరణల బిల్లులు పార్లమెంటు ఉభయసభలతో పాటు రాష్ట్రాల శాసనసభల్లో కనీసం సగం సభలు కూడా ఆమోదించాలి. పై విధానాల ద్వారా ఆమోదం పొందిన బిల్లులు రాష్ట్రపతి సంతకం అయిన తరువాత, సంతకం అయిన తేదీ నుండి సవరణ అమలులోకి వస్తుంది.

ఇప్పటి వరకు రాజ్యాంగానికి 100 సవరణలు జరిగాయి. అవతారికలోను, సవరణ విధానంలోను కూడా సవరణలు జరిగాయి. ❑

# జాతీయ పతాక రూపకల్పనలో ప్రతిఫలించిన భారతీయ బహుళత్వం



- కొప్పర్తి వెంకట రమణమూర్తి

ఒక వైపు పౌరసత్వ సవరణ చట్టం, మరోవైపు జాతీయ పౌరసత్వ పట్టికల పేరుతో దేశంలో లౌకికవాదాన్ని తెర వెనక్కు నెట్టి హిందూ జాతీయవాదాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం బహిరంగంగానే జరుగుతున్న నేపథ్యంలో జాతీయత, మతం అనేవి రెండు వేర్వేరు అంశాలని మరోసారి గట్టిగా చెప్పవలసి వస్తోంది. భారతీయ జాతీయతా నిర్మాణంలో హిందూయేతర మతాల, ముఖ్యంగా ముస్లింల పాత్ర విడదీయలేనంతగా కలిసిపోయి ఉందని మళ్ళీ మళ్ళీ రుజువు చెయ్యాల్సి ఉంది.

దేశాలకు సరిహద్దులు లేని రోజుల్లో ఎన్నో జాతులు తాము పుట్టిన గడ్డ నుంచి వలసలు పోయి ఇతర ప్రదేశాలలో స్థిరబడినట్లుగానే భారతదేశానికి మధ్య ఆసియా తెగలు వచ్చి స్థిరపడ్డాయి. అంతకు ముందు ఆర్యద్రావిడ సంస్కృతులతో పాటు పార్సీ, యవన, శక, హుణ సంస్కృతుల్ని కలుపుకుని స్థానిక సంస్కృతి రూపొందినట్లే. అనంతర కాలంలో స్థానిక మధ్య ఆసియాతో పాటు యూరోపియన్ సంస్కృత సమ్మేళనంగా భారతజాతి ఆవిర్భవించింది. కవి చెప్పినట్లు 'ఏ దేశ సంస్కృతీ ఏనాడూ కాదొక స్థిరబిందువు – అది నైక నదీనదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు'. సింధువంటే ప్రవాహం లేదా జలరాశి. అనేక పాయల్ని కలుపుకుని ప్రవహించే నది నుంచి కొన్ని పాయల నీటిని ఎట్లా వేరుచేస్తాం ?

భారతదేశంలో స్థిరపడిన తురుష్క మంగోలు, ఆఫ్ఘన్ జాతులు పాటించిన మతం ఇస్లాం. అంతకంటే ముందు స్థిరపడిన జాతులు అనుసరించిన మతం హైందవం. హిందూ ముస్లిం సైనికులు కలిసిపోయి ఉన్న ముస్లిం పాలకుడికీ, ముస్లిం హిందూ సైనికులు కలిసి ఉన్న హిందూ పాలకుడికి దేశంలో ఒక ప్రాంతం కోసం జరిగిన యుద్ధాన్ని ఏ మతాల మధ్య జరిగిన యుద్ధంగా గుర్తించాలీ? ఈ రెండు వర్గాల సైనిక శిబిరాల్లో పార్సీ హిందీ భాషల మిశ్రమంగా అవతరించిన ఉర్దూ భాషను ఇప్పుడు లేకుండా చెయ్యడం ఎట్లా? దక్షిణాది మాండలికాన్ని కూడా కలుపుకుని రూపొందిన దక్కనీ ఉర్దూని ఏం చేద్దాం? దక్కనీ ఉర్దూలో గోల్కొండ సుల్తాను రాసిన గీతాలలోంచి తెలుగు పదాలను మాయం చెయ్యడం ఇప్పుడు కుదురుతుందా? మహాకవి అమీర్‌ఖుస్రూను తోతో–ఇ–హింద్ (హిందూ దేశపు రామచిలక) అనేశామే. ఆయన కూడా 'నేనింత మధురంగా పాడడానికి కారణం ఈ దేశంలో నివసించడమే' అని నోరు జారాడా? కబీరుని శిష్యుడిగా అంగీకరించిన రామనందుడికి భారతీయ పౌరసత్వం ఇద్దామా వద్దా? అగ్నిపూజ, యజ్ఞోపవీత ధారణ, యోగ సాధనలను అంగీకరించిన సూఫీ తత్వాన్నీ, ఆ సూఫీ గురువుల సమాధుల ఆరాధనకు వెల్లువెత్తే హిందు భక్తి ప్రవాహాన్ని ఏ బారికేడ్లతో ఆపుతారు? భారత జాతీయోద్యమంలో 1857 మొదలుకుని 1947 దాకా రక్తతర్పణ చేసిన లక్షలాది ముస్లింలది ఏ దేశం ?

1885లో ప్రారంభమైన జాతీయ కాంగ్రెస్ తొలి అధ్యక్షుడు ఉమేశ్ చంద్ర బెనర్జీ హిందువైతే, రెండవ అధ్యక్షుడు దాదాభాయ్ నౌరోజీ పార్సీ, మూడవ అధ్యక్షుడు బద్రుద్దీన్ త్యాబ్జీ ముస్లిం, నాల్గవ అధ్యక్షుడు జార్జి యూల్ క్రైస్తవుడు. అట్లా మొదలైన జాతీయోద్యమ బహుళతత్వం చివరి దాకా కొనసాగి స్వతంత్ర భారతం ప్రజాస్వామ్య లౌకిక దేశంగా అవతరించడంలో ప్రతిఫలించింది. జాతీయోద్యమం పొడవునా ముస్లింలు లేని ఘట్టాన్ని చూడలేం. స్వాతంత్ర్య ఉద్యమం మలుపు తీసుకున్నదే హిందూ ముస్లిం ఐక్యతకు విఘాతం కలిగించాలని బ్రిటన్ చేసిన బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన వందేమాతరం (స్వదేశీ) ఉద్యమంతో. మొదట ప్రపంచ యుద్ధంలో ఇంగ్లండ్ తరపున పోరాడి బలిదానం చేసిన భారతీయుల్లో అధిక సంఖ్యాకులు ముస్లింలే. గాంధీ సహాయ నిరాకరణోద్యమ విజయం అది ఖిలాఫత్ ఉద్యమంతో జతకూడడం వల్లనే సాధ్యపడింది. ముస్లిం లీగ్ సాగించిన విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ వంటి వారు నేషనల్ ముస్లిం కాన్ఫరెన్స్‌ను స్థాపించి జాతీయవాదాన్ని ప్రోది చేశారు. సరిహద్దు గాంధీ అని పిలవబడిన ఖాన్ అబ్దుల్ గఫూర్‌ఖాన్ సారధ్యంలోని ఖుదైకిద్మత్ గార్స్ వాయువ్య రాష్ట్రంలో నిర్వహించిన పాత్ర చెప్పనక్కర్లేదు. 1945 తర్వాత జరిగిన పతాక సన్నివేశ ఘట్టాలలో దేశ విభజన రాజకీయాలు పరాకాష్టను చేరిన దశలోనే అనేక మంది ముస్లిములు భారతదేశమే తమ మాతృదేశమని ప్రకటించారు. ఈ బొడ్డుపేగు బంధాన్ని తెంచుకోవడానికి నిరాకరించి దేశంలోనే స్థిరపడ్డారు. లౌకికతత్వాన్ని విశ్వసించారు. రాజ్యాంగ పరిషత్ సభ్యుల్ని ఎన్నుకున్నారు. తామే సభ్యులయ్యారు. చర్చల్లో పాల్గొన్నారు. దేశసంవిధానంలో అంతర్భాగమయ్యారు. చివరికి

దేశ సార్వభౌమత్వానికీ, ఉనికికీ, వ్యక్తిత్వానికీ ప్రతీక అయిన జాతీయ చిహ్నం, జాతీయ పతాకాల రూపకల్పనలో కూడా భాగస్వాములయ్యారు.

జాతీయ పతాక రూపశిల్పిగా అందరూ ఎరిగిన పేరు ఆంధ్రుడైన పింగళి వెంకయ్య. అయితే అందులో సురయ్యాత్యాబ్జీ అనే మహమ్మదీయ మహిళ పాత్ర కూడా ఉందని కొందరికి మాత్రమే తెలిసిన వాస్తవం.

మన జాతీయజెండా రూపశిల్పి పింగళి వెంకయ్య అనే మాటలో పూర్తి నిజం లేదు. జాతీయ పతాక రూపకల్పన ఒకేసారి ఒక వ్యక్తి చేత చేయబడింది కాదు. వివిధ దశల్లో వివిధ మార్పులకు లోనైన ఘట్టం అది. 1906లో వందేమాతరం ఉద్యమ సమయంలో సనీంద్రకుమార్ బోస్, సుకుమార్ మిత్రలచే రూపొందించబడిన పతాకంలో నీలం, పసుపు, ఎరుపురంగు పట్టీలతో పాటు ఎనిమిది నక్షత్రాలు, సూర్యుడు, నక్షత్రంతో కూడిన చంద్రవంక దేవనాగరి లిపిలో వందేమాతరం నినాదమూ ఉన్నాయి. 1907లో మేడమ్ కామా పారిస్‌లో ఎగరేసిన పతాకంలో అదే పతాకం కొనసాగి ఒక కమలం ఏడు నక్షత్రాల మార్పు జరిగింది. 1921లో పింగళి వెంకయ్యచే రూపొందించ బడి గాంధీచే అంగీకరించబడిన పతాకంలో తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగుల పట్టీలు వరుసగా పై నుంచి కిందకు ఉన్నాయి. గాంధీ కోరిక మేరకు ఆర్థిక స్వావలంబనకు ప్రతీకగా చరఖా ఉంచబడింది. దీన్నే స్వరాజ్య జెండా అనీ కాంగ్రెస్ జెండా అనీ గాంధీ జెండా అని అన్నారు. దీన్ని కాంగ్రెస్ జాతీయజెండాగా గుర్తించలేదు. కానీ 1921 నుంచి 1931 దాకా ఇదే విస్తృతంగా ఉపయోగించబడింది. 1931లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కరాచీలో సమావేశమైనప్పుడు కాంగ్రెస్‌కు ఆమోదయోగ్యమై అధికారికంగా గుర్తించబడవలసిన జెండా అవసరాన్ని గుర్తించి ఏడుగురు సభ్యులతో ఒక కమిటీని వేసింది. అది ఎడమవైపు పైమూలన చరఖాతో మొత్తం కాషాయరంగు జెండాను రూపొందించింది. కానీ అది ఆమోదయోగ్యం కాలేదు. చివరికి పై నుంచి వరుసగా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ పట్టీలు ఉండి మధ్య చరఖా ఉన్న పతాకాన్ని కాంగ్రెస్ ఒక తీర్మానంతో 1933లో అంగీకరించింది. 1947 దాకా ఈ పతాకమే కొనసాగింది.

1947లో స్వాతంత్ర్యం సిద్ధించే ఘట్టంలో చరఖా స్థానంలోకి అశోకధర్మచక్రం వచ్చి చేరడం ఆసక్తికర పరిణామం.

బ్రిటీష్ చరిత్రకారుడు ట్రెవర్ రోయల్ The Last Days of the Raj అనే పుస్తకంలో 'భారతదేశ చరిత్ర పొడవునా కనిపించే భిన్నత్వానికి కొనసాగింపు అన్నట్టు భారత జాతీయ జెండాను బద్రుద్దీన్ త్యాబ్జీ అనే ముస్లిం రూపకల్పన చేశాడు. త్రివర్ణ పతాక మధ్యలో ఉన్న చరఖా రాజకీయ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నందున దాని స్థానంలో హిందువులకూ ముస్లింలకూ ఆమోదయోగ్యమైన అశోకధర్మచక్రాన్ని ఉంచాడు. తొలిసారి నెహ్రూ కారు మీద ఎగిరిన జెండాను ఆయన భార్య ప్రత్యేకంగా తయారు చేసింది' అని రాయడంతో చర్చ ప్రారంభమైంది. కాగా హైదరాబాద్‌కు చెందిన చరిత్రకారుడు కెప్టెన్ యల్. పాండు రంగారెడ్డి తన పరిశోధనలో అశోకధర్మ చక్ర ప్రతిపాదన బద్రుద్దీన్ త్యాబ్జీది కాదని ఆయన భార్య సురయ్య త్యాబ్జీదని తేలిందని, రాజ్యాంగ పరిషత్ చర్చలు, డాక్యుమెంట్లను పరిశీలించిన మీదట జెండా ప్రదర్శన కమిటీ (Flag Presentation Committee) లో సురయ్యాత్యాబ్జీ పేరున్నట్టు రూఢీ అయిందని ప్రకటించడంతో భారతీయ లౌకికతత్వానికీ, భిన్నత్వంలో ఏకత్వానికీ, నిదర్శనమైన గొప్ప ఉదాహరణ చరిత్ర మరుగు నుంచి బయట పడినట్లయింది.

బద్రుద్దీన్ త్యాబ్జీ భారత రాజ్యాంగ పరిషత్‌లో సివిల్ సర్వీస్ అధికారి. ఆయన భార్య సురయ్య త్యాబ్జీ హైదరాబాద్‌కు చెందిన మహిళ. బద్రుద్దీన్ భారతదేశం తరపున వివిధ దేశాలలో దౌత్యవేత్త గానూ, 1962–65 మధ్య ఆలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగానూ పనిచేశాడు. అదే పేరున్న ఇతని తాతగారు బద్రుద్దీన్ త్యాబ్జీ (1844–1906) భారత జాతీయ కాంగ్రెస్ మూడవ అధ్యక్షుడు (1887–88), తొలి ముస్లిం అధ్యక్షుడు కూడా. జాతీయవాది. హిందూ ముస్లిం ఐక్యతకు, ముస్లిం మహిళ విద్యాభివృద్ధికీ కృషి చేశాడు. బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కూడా పనిచేశాడు.

ఈ నేపథ్యంలో బద్రుద్దీన్ త్యాబ్జీ (1907–95), సురయ్య త్యాబ్జీ (1919–78)ల కుమార్తె లైలా త్యాబ్జీ 2018లో రాసిన వ్యాసంలో మరికొన్ని విషయాలు వెల్లడించారు.

"విభజన సృష్టించిన భీభత్సంలో మా ఇల్లు ముట్టడించబడి దోపిడి చేయబడింది. ఒక సిక్కు యువకుడు మా నాన్న గుండెలకేసి తుపాకీ ఎక్కుపెట్టగా ఒక హిందువు గురి తప్పించి ఆయన ప్రాణాలు కాపాడాడు. మా నాన్న సివిల్ సర్వెంట్‌గా రాజ్యాంగ పరిషత్ కార్యక్రమాల్లో తలమునకలై ఉండగా మా అమ్మ ఎర్రకోట వద్ద శరణార్థి శిబిరాల్లో సేవ చేసేది. మా సామాన్లు ఉంచుకోవ డానికి కూడా మా నాన్న స్నేహితులు భయపడిన సందర్భమది. పాకిస్తాన్‌కు వెళ్ళిపోవలసిందిగా ఎందరో చేసిన సూచనతో పాటు ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీస్ ఉద్యోగిగా పాకిస్తాన్ కొత్త ప్రభుత్వం ఇవ్వచూపిన ఉన్నత పదవులను నిరాకరించారు మా నాన్న. మా తాత గారికి రాసిన లేఖలో ఆయన ఇలా అన్నారు. "ఇండియాలోనే ఉండిపోవాలని నేను తీసుకున్న నిర్ణయం మీకు ఆశ్చర్యం కలిగించదని ఆశిస్తున్నాను. ముస్లిం లీగ్ భావజాలాన్ని నేను

ఆపాదమస్తకం వ్యతిరేకిస్తున్నాను. పాకిస్తాన్ ఇవ్వజూపే పదవులకు ఆశపడి నా ఆశలకు, ఆశయాలకు మోసం చేయలేను".

ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జాతీయచిహ్నం, జాతీయ జెండాల అవసరాన్ని గుర్తించిన జవహర్‌లాల్ నెహ్రూ ఆదేశాల మేరకు, మా నాన్న బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షుడుగా ఒక జెండా కమిటీని ఏర్పాటు చేశారు. చిత్రకళ పాఠశాలలకు డిజైన్లు పంపవలసిందిగా లేఖలు వెళ్ళాయి. వందలాది చిత్రాలు వచ్చి చేరాయి. కానీ వాటిల్లో ఎక్కువ భాగం బ్రిటన్ జాతీయ చిహ్న ప్రభావంతో వేసినవే. సమయం మించిపోతోంది. ఈ అంశాన్ని శ్రద్ధగా గమనిస్తోన్న నెహ్రూలో అసహనం పెరిగిపోతోంది. ఈ దశలో వాస్తుశిల్ప, చిత్రకళాభిమానులైన మా తల్లిదండ్రుల మనోఫలకం మీద అకస్మాత్తుగా అశోకస్థూపం మీద సింహశీర్షం మెరిసింది. వెంటనే మా అమ్మ సింహచిహ్నాన్ని చిత్రించింది. ఆ చిత్రాన్ని వైస్‌రాయ్ నివాసంలోని ముద్రణాలయం ముద్రించింది. అది అందరి ఆమోదమూ పొందింది.

ఈ దశలోనే జాతీయపతాక రూపకల్పన మీద దృష్టి మరలినప్పుడు దాని పునర్నిర్మాణ బాధ్యతలు కూడా మా తల్లిదండ్రులకు అప్పగించబడినాయి. వారు అశోకస్థంభంలోని ధర్మచక్రాన్ని చరఖా స్థానంలో ఉంచినపుడు అది ఎంతో సహజంగా అమరిపోయింది. మొదట మా అమ్మ నలుపు రంగులో చక్రాన్ని చిత్రించింది. గాంధీజీ సూచన మేరకు అది నేవీబ్లూగా మార్చబడింది. అప్పటికి మా అమ్మ వయసు 28 సంవత్సరాలు. జాతికి అందించిన ఈ కానుక పట్ల మా తల్లిదండ్రులెప్పుడూ అతిశయం ప్రదర్శించలేదు. భారతీయ అస్తిత్వ సహజ లక్షణంలో వారు అంతర్లీనమయ్యారు. నిజానికిది వారిద్దరి సమిష్టి కృషి. కానీ ఆ ఘనతనంతా మా అమ్మకే కట్టబెడుతూ అంతర్జాలంలో టపాలు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది అని అన్నారు.

అశోక ధర్మచక్ర ప్రతిపాదనలో త్యాబ్జీ దంపతుల్లో ఎవరి పాత్ర ఎంత అనే ప్రశ్న అటుంచితే, విభజన రాజకీయాల కల్లోల వర్తమానంలో వారిద్దరూ ముస్లిం దంపతులై ఉండడం భారతీయ బహుళతత్వానికి బలం చేకూరుస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌరసత్వ పట్టిక పేరుతో హిందూ మెజారిటీవాద ప్రతిష్టాపనా ప్రయత్నాల్ని వైవిధ్యభరితమైన ఈ భారతీయ చారిత్రక వాస్తవికత ప్రశ్నిస్తోంది. భారత జాతీయ పతాక రూపశిల్పి ఎవరు అనే ప్రశ్నకు పింగళి వెంకయ్య అనే ఏకవ్యక్తి సమాధానానికి తోడుగా త్యాబ్జీ దంపతులు కూడా అనే సమాధానం ఈ దేశం ఎవరిదీ అనే ప్రశ్నకు హిందువులతో పాటు ఇతర మతస్థులదీ అనే సమాధానాన్ని ప్రతిధ్వనిస్తోంది. అందులో ఒక మహిళ కూడా ఉండడం స్వతంత్ర భారతదేశంలో మహిళల ఉనికికి, వ్యక్తిత్వానికి, వికాసానికి, స్వావలంబనకు సమప్రాధాన్యతనిచ్చినట్లయింది. ❑

## భారత రాజ్యాంగం - ప్రాథమిక విధులు

**(17వ పేజీ తరువాయి)**

"పత్రికా స్వేచ్ఛ" స్వాతంత్ర్యపు హక్కులలో మిళితం చేయబడలేదు, ప్రజల ఉద్దేశ్యాల ప్రకటన, భావ ప్రకటనా స్వాతంత్ర్యం మున్నగు విషయాల కొరకు పత్రికాస్వేచ్ఛ అవసరం. అపాయకర పనులలో బాలల చాకిరి కొంచెం తగ్గుముఖం పట్టినా, అపాయాలులేని పనులలో బాలల చాకిరి (Child Labour) అనేవి, భారతరాజ్యాంగ విలువలను కాలరాస్తున్నాయి. 1.65 కోట్లమంది బాలబాలికలు నేటికీ భారతదేశంలో వివిధ పనులలో ఉద్యోగాలు చేస్తున్నారు. 2005 'ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్' అనే పత్రిక ప్రచురించిన ప్రచురణల ఆధారంగా, ప్రపంచంలో లంచగొండితనం గల 159 దేశాల జాబితాలో భారత్ 88వ స్థానాన్ని ఆక్రమిస్తోంది. ఈ లంచగొండులలో అధికారులు, రాజకీయనాయకులూ ఉన్నారు. 2003 'పౌర బిల్లు' (సవరణ) ప్రకారం, ఉద్యోగ ప్రయత్నాలు చేసేందుకు సమాన హక్కులు పొంది వుంటారు గాని, ఉద్యోగాలు పొందే విధానంలో సమానత్వపు హక్కు పరిగణనలోకి రాదు. పోటీలో నెగ్గినవారే ఉద్యోగాలు పొందే అర్హత గలిగి వుంటారు.

### సవరణలు

ప్రాథమిక హక్కులలో మార్పులు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. ఈ రాజ్యాంగ సవరణ పార్లమెంటు ఆమోదం పొందాలి. పార్లమెంటు ఆమోదానికి మూడింట రెండొంతుల పార్లమెంటు సభ్యుల ఆమోదం అవసరం. ఈ ఆమోదానికి పార్లమెంటులో ఓటింగ్ అవసరం.

ఆస్తి హక్కు ప్రథమ దశలో ప్రాథమిక హక్కుగా పరిగణింప బడింది. కాని 1978 లో జరిగిన భారత రాజ్యాంగ 44వ సవరణ ప్రకారం దీనిని ఓహక్కుగా కాకుండా, ప్రతి పౌరుడు తన ఆస్తిని కాపాడుకోవడానికి చట్టం ప్రకారం హక్కును కలిగి వున్నాడని చట్టం చేయబడింది. ఈ చట్టం, ప్రజాస్వామిక విలువలను కాపాడడానికి సామ్యవాద ఉద్దేశాలు సాధించడానికి, చేయబడింది.

విద్యా హక్కును, 2002 లో, భారత రాజ్యాంగ 86వ సవరణ ప్రకారం ప్రాథమికహక్కుగా చేయబడింది. ఈ హక్కు ప్రకారం, ప్రతి బాలురు/బాలికలు, పౌరులు, ఎలిమెంటరీ స్థాయిలో ప్రాథమిక విద్యను ఓ హక్కుగా కలిగి వుంటారు. ❑

# కాల పరీక్షకు నిలచిన రాజ్యాంగం



**ఆర్వీ రామారావ్**

"రాజ్యాంగ నిర్ణాయక సభను ఏర్పాటు చేయడం కాంగ్రెస్‌ను మచ్చిక చేసుకోవడానికే. రాజ్యాంగ నిర్ణాయక సభ అణగారిన వర్గాల పట్ల ఎలా వ్యవహరిస్తుంది? టూకీగా చెప్పాలంటే అణగారిన వర్గాల కాళ్లూ చేతులు కట్టేసి వారిని సవర్ణ హిందువుల దగ్గర పడేస్తారు. వారికి ఏమీ ఇవ్వరు. భోజనానికి బదులు రాళ్లు ఇస్తారు. రాజ్యాంగ నిర్ణాయక సభ అంటే అణగారిన వర్గాల వారికి ద్రోహం చేయడమే"

ఈ మాటలు రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అధ్యక్షుడైన డా. బి.ఆర్.అంబేద్కర్ అన్న మాటలివి. ఆ తర్వాత 1945 మేలో అఖిల భారత షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్ సమావేశంలో మాట్లాడుతూ "రాజ్యాంగ నిర్ణాయక సభకు నేను పూర్తిగా విరుద్ధం. ఇది అనవసరమైంది. అది చాలా ప్రమాదకరమన్నది నా అభిప్రాయం. దీని వల్ల దేశంలో అంతర్యుద్ధం చెలరేగవచ్చు. అసలు రాజ్యాంగ నిర్ణాయక సభ ఎందుకో నాకు అర్థమే కాలేదు" ఈ మాటలన్నదీ అంబేద్కరే. ఇవన్నీ రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పడక ముందు అన్న మాటలు. ఆ తర్వాత రాజ్యాంగ రచనా కమిటీకి అధ్యక్షుడైంది ఆయనే. రాజ్యాంగ నిర్ణాయక కమిటీలో ఉన్న ఇతర సభ్యులందరూ ఏదో ఒక కారణంతో అందుబాటులో లేకపోతే అంబేద్కర్ ఒక్క చేతి మీద ముసాయిదాకు రూపుదిద్దారు. రాజ్యాంగంలో చేర్చిన కొని అంశాలు వ్యక్తిగతంగా ఆయనకు నచ్చకపోయినా కర్తవ్యపరాయణత ఎన్నడూ వీడలేదు. రాజ్యాంగానికి మెరుగులు దిద్దడంలో తన సర్వశక్తులూ ధారపోశారు.

తుది రూపు దిద్దుకున్న రాజ్యాంగాన్ని పార్లమెంటులో ప్రతిపాదిస్తూ చేసిన ప్రసంగంలో తన మీద పెట్టిన బాధ్యతను నిర్వర్తించినందుకు చాలా ఆనందం వ్యక్తం చేశారు. "ఈ దేశ ప్రజలకిచ్చిన రాజ్యాంగం అత్యద్భుతమైన పత్రం. ఈ మాట అంటున్నది నేను ఒక్కడినే కాదు. ఈ రాజ్యాంగం అత్యంత సరళమైంది, సులభమైంది అని చాలా మంది చెప్పారు" అని అంబేద్కర్ అన్నారు.

అంబేద్కర్ అన్న మాటలు వమ్ము కాలేదని 65 ఏళ్ల కింద ఆమోదించిన రాజ్యాంగమే నిరూపించింది. నవంబర్ 26ను రాజ్యాంగ నిర్మాణ దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కారణాలేమైనా రాజ్యాంగం నిర్దేశించిన విలువలు ఇంకా పదిలంగానూ సజీవంగానూ ఉన్నాయి. మనతో పాటు స్వతంత్ర దేశంగా అవతరించిన పాకిస్తాన్ రాజ్యాంగం రూపొందించడానికి ఏడేళ్లు పట్టింది. రెండేళ్లకే పాకిస్తాన్ రాజ్యాంగం కుదేలైంది. ఆ తర్వాత 1969లోనూ, 1978లోనూ అదే జరిగింది. పాకిస్తాన్ చరిత్రలో గణనీయమైన కాలం సైనిక పాలనలోనే కునారిల్లింది. ఇప్పటికీ పాక్ పౌర ప్రభుత్వం నిరంతరం సైన్యం పడగనీడలోనే కొనసాగుతోంది.

భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండడానికి ప్రధానమైన కారణం మన రాజ్యాంగ నిర్మాతలు అధికార దాహం కోసం ఆ పని చేయలేదు. వారందరికీ అపారమైన దూరదృష్టి ఉండేది. వారి నిజాయితీ నికార్సైంది. మన రాజ్యాంగ నిర్మాతలు తీవ్రమైన ఉత్సాహంతో రాజ్యాంగానికి రూపకల్పన చేశారు. దాన్ని ఒక క్రతువుగా, బృహత్తరమైన కర్తవ్యంగా భావించారు.

మన రాజ్యాంగాన్ని వందకన్నా ఎక్కువ సార్లు సవరించి ఉండొచ్చు. ఆ సవరణలు కొన్ని మినహాయిస్తే మిగతావన్నీ అవసరం కొద్దీ చేసినవే. వ్యవసాయ సంస్కరణల కోసం, సంఘ సంస్కరణ కోసం, సామాజిక న్యాయం సాధించే దిశలో జరిగినవే. మరి కొన్ని కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేయడం కోసం చేసినవి. ఇందిరా గాంధీ హయాంలో జరిగిన అనేక రాజ్యాంగ సవరణల వెనక, ముఖ్యంగా ఎమర్జెన్సీ సమయంలో చేసిన సవరణల వెనక స్వార్థ ప్రయోజనాలు, అవకాశ వాదం ఉన్న మాట వాస్తవం. ఆ తర్వాతే సుప్రీం కోర్టు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని అనేక సందర్భాలలో స్పష్టంగా చెప్పింది. కొన్ని రాజ్యాంగ సవరణలు రాజ్యాంగం అమలులో జరుగుతున్న పొరపాట్లను సరిదిద్దడానికి ఉద్దేశించినవి. 356వ అధికరణాన్ని ఎడా పెడా దుర్వినియోగం చేసి ప్రతిపక్ష ప్రభుత్వాలను, స్వపక్షంలోనే ముఠా తగవులు తీర్చడానికి, లేదా ప్రత్యర్థి వర్గాన్ని దెబ్బ తీయడానికి కొన్ని డజన్ల సార్లు రాష్ట్రపతి పాలన విధించారు. మళ్లీ అదే రాజ్యాంగ సవరణ వల్ల ఈ అకృత్యాలకు తెరపడింది.

పార్టీ ఫిరాయింపులను నిలవరించడానికి చేసిన రాజ్యాంగ సవరణలవల్ల అంతగా ప్రయోజనం లేని మాట నిజమే. ఎన్నికల ప్రక్రియ ధనబలానికి, కండబలానికి దాసోహమనడం రాజ్యాంగం తప్పుకాదు. రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న రాజకీయపక్షాలదే ఆ పాపం. క్షుద్ర రాజకీయాలు రాజ్యాంగాన్ని దళారులకు, లాభాలు తప్ప మరేదీ పట్టించుకోని ప్రైవేటు వ్యాపార రంగానికి తాకట్టు పెట్టింది రాజ్యాంగాన్ని అమలు చేయడంలో అడుసుతొక్కింది రాజకీయ నాయకులే. సహజ వనరులపై హక్కు ప్రజలదేననీ, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత రాజ్యవ్యవస్థదీ ప్రభుత్వానిదేనని రాజ్యాంగం స్పష్టం చేసింది. సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చూడాలని రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు స్పష్టం చేస్తే దాన్ని అటకెక్కించిన ఘనత రాజకీయాలదే. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు, లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నదీ రాజకీయ నాయకులే. రాజ్యాంగ స్ఫూర్తిపై నీళ్లు చల్లడం బాహాటంగా కొనసాగుతున్న రాజకీయ క్షుద్ర క్రీడకు రాజ్యాంగానిది బాధ్యత కాదు. మనది అత్యంత శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశం అని మన వీపు మనమే చరుచుకోవడం వల్ల ప్రయోజనం లేదు.

కొన్ని రాష్ట్రాలలోనైనా భూసంకరణలు అమలు కావడానికి రాజ్యాంగం ఇచ్చిన స్ఫూర్తే కారణం. సహజ వనరులను విదేశీ గుత్తపెట్టుబడిదార్లకు దోచిపెడుతుంటే చూస్తూ ఊరుకోకుండా ఉద్యమించే ప్రజలకు జవజీవాలు సమకూరుస్తున్నది మన రాజ్యాంగమే.

రాజ్యాంగం మీద నమ్మకం లేదని బాహాటంగా ప్రకటించి అడవి బాట పట్టిన వారు రాజ్యాంగానికి తలపెట్టిన అపచారం కన్నా రాజ్యాంగాన్ని వినియోగించుకుని అధికారంలోకి వచ్చి అదే రాజ్యాంగానికి తూట్లు పొడిచింది రాజకీయ నాయకులే. మన రాజ్యాంగం ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎంత పటిష్ఠమైనవో మన రాజకీయ వ్యవస్థ అంత బలహీనమైంది. ఆ కుళ్లు భారాన్ని కూడా మోస్తూ నిటారుగా నిలబడిన ఘనత మన రాజ్యాంగానిదే. రాజ్యాంగ నిర్మాతలదే.

రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలు చేసేవారు సవ్యంగా వ్యవహరించకపోతే అది విఫలమవుతుందని, రాజ్యాంగం ఎంత చెడ్డదైనా అమలు చేసేవారు సజావుగా వ్యవహరిస్తే ఆ రాజ్యాంగం నిలబడుతుందని డా. అంబేద్కర్ ఏనాడో హెచ్చరించారు. మొదటి మాటను నిజం చేసే దిశగా మన రాజ్య వ్యవస్థ పయనిస్తోంది. ఇంకా రాజ్యాంగం విఫలం కాలేదంటే అది అంతర్నిహితమైన రాజ్యాంగ శక్తివల్లే. పాలకులు దారి తప్పినప్పుడల్లా నిర్దాక్షిణ్యంగా శిక్షించడానికి సందేహించని ప్రజానీకమే రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడుతున్నారు. రాజ్యవ్యవస్థలో పొంగిపొర్లుతున్న కుళ్లుకు, కుతంత్రాలకు, కూటనీతికి రాజ్యాంగాన్ని నిందించి లాభం లేదు. రాజ్యాంగాన్ని తిరగ రాయాలని 2002లో చేసిన ప్రయత్నాలు ఎందుకు బెడిసికొట్టాయో ఆలోచించాల్సిందే.

తొలిసారిగా నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవం ప్రజలు రాజ్యాంగం గురించి మరింత తెలుసుకోవడానికి ఉపకరించాలని ప్రధాని నరేంద్ర మోదీ తన సందేశంలో ఆకాంక్షించారు. ఈ సూత్రాన్ని అధికారపీఠాలెక్కి విద్వేశం నింపుతున్న వారికి వర్తింపచేస్తే మరింత మేలు. ❏


## జాతీయ స్ఫూర్తి
### ప్రకటనల రేట్లు

| | |
|---|---|
| 1/4 డెమ్మీ సైజు | |
| లోపలి పూర్తిపేజీ | రూ. 5,000/- |
| లోపలి అరపేజీ | రూ. 2,500/- |
| కవరు పేజీ : | |
| లోపలి కవరు పేజీలు | రూ. 7,500/- |
| వెనుక కవరు పేజీ | రూ. 10,000/- |

*పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. రమేష్‌చంద్రబాబు**
క్రాంతి నర్సింగ్ హోమ్, నన్నయ్య విగ్రహం వద్ద
మెయిన్‌రోడ్, తణుకు - 534 211
✆ 08819 222265, 93971 14495

## చందా వివరాలు

| | |
|---|---|
| విడి ప్రతి | రూ. 15-00 |
| 2 సంవత్సరాలకు | రూ. 500-00 |
| 1 సంవత్సరానికి | రూ. 300-00 |
| విద్యార్థులకు | రూ. 150-00 |

*చందా డి.డి. లేదా మనియార్డరు ద్వారానే పంపండి.*
*చెక్కులు పంపరాదు*

*NEFT లేదా RTGS పంపడానికి*
**JAATEEYA SPURTHI**
**A/c No.3620 101 0000 380**
**Syndicate Bank, Eluru Main Branch**
**IFSC Code : SYNB0003620**

# రాజ్యాంగ వ్యవస్థలపై మోదీ ప్రభుత్వ నీలినీడలు



**డా॥ రమేష్ చంద్రబాబు**

మోదీ – షాల ద్వయం ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం చాపకింద నీరులాగా ఆరెస్సెస్ ఎజెండాను అమలు చేస్తోంది. భారతదేశంలోని స్వయం ప్రతిపత్తి, స్వతంత్ర వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ మూలస్థంభాలైన ప్రజాస్వామ్య, లౌకిక, ఫెడరల్ సూత్రాలపై బహుముఖ దాడులు ప్రారంభించింది. ప్రజల హక్కులను కాలరాస్తూ హిందూ రాష్ట్ర నిర్మాణానికి దారులు వేస్తోంది.

అధికారంలోకి వచ్చిన వెంటనే పార్లమెంటును ప్రహసనంగా మార్చివేసింది. బడ్జెట్టుపై సరైన చర్చలు లేకుండానే ఆమోదింప జేసింది. ఆధార్‌కార్డులపై చర్చను రాజ్యసభలో జరగకుండా ఫైనాన్స్ బిల్లు పేరిట ఆమోదింపచేసింది. విమర్శకు ప్రతివిమర్శే సమాధానంగా పార్లమెంటు వాయిదాలతో ముగుస్తోంది.

గవర్నర్లుగా ఆరెస్సెస్‌కు సంబంధించిన వారిని నియమిస్తూ రాష్ట్రాలలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలను నియంత్రించడానికి బిజెపీ ప్రయత్నిస్తోంది. ఢిల్లీ ప్రభుత్వానికి కేంద్రానికి మధ్య జరిగే జగడం దీనికి మంచి ఉదాహరణ. మోదీ ప్రభుత్వం గవర్నరు ద్వారా కల్పిస్తున్న ఆటంకాలు కారణంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం సజావుగా నడవడం లేదు. వివిధ పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు వెనుకకు త్రిప్పి పంపిస్తున్నారు.

గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటక గవర్నర్ల పక్షపాత పూరిత ధోరణి వల్ల బేరసారాల ద్వారా లేదా రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం ద్వారా బిజెపీ తన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల మహారాష్ట్రలో మెజారిటీ లేకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం కల్పించి, వెంటనే సుప్రీంకోర్టు జోక్యం వల్ల ప్రమాణస్వీకారం చేసిన వెంటనే రాజీనామా చేయడం జరిగింది.

భారతదేశంలోని వివిధ స్వయంప్రతిపత్తి గల సంస్థలలో బిజెపీ ప్రభుత్వం జోక్యం చేసుకుంటూ తన చెప్పుచేతలలో ఉండేటట్లు చేసుకుంటోంది. దీనికి న్యాయవ్యవస్థ కూడా మినహాయింపు కాదు. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి సారిగా సుప్రీంకోర్టుకు చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు పత్రికాగోష్టి నిర్వహించి న్యాయవ్యవస్థ స్వతంత్రతను రక్షించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. వ్యవస్థ జీవమూ, ఉనికీ ప్రమాదంలో చిక్కుకుందని, తక్షణ జోక్యం అవసరమనీ పేర్కొన్నారు. పారదర్శకత లేకుండా బిజెపీకి అనుకూలంగా ప్రధాన న్యాయమూర్తి పని పంపకం చేస్తున్నారని అభియోగం మోపారు. ప్రధాన న్యాయమూర్తిపై అభిశంసన తీర్మానాన్ని రాజ్యసభ ఛైర్మన్ అధికారం లేకపోయినప్పటికీ ఏకపక్షంగా తిరస్కరించారు. ఇది వారికి చట్టంపై ప్రజాస్వామ్యంపై ఉన్న గౌరవం.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వం బహిరంగంగానే జోక్యం చేసుకుంటోంది. ఉదాహరణకు జస్టిస్ జోసెఫ్‌ను కొలీజియం సిఫార్సు చేసినప్పటికీ ప్రభుత్వం దానిని త్రోసి పుచ్చింది.

రిజర్వుబ్యాంకుకు 2016 సం॥ ప్రకటించిన నోట్ల రద్దు నిర్ణయాన్ని కేవలం 24 గంటల ముందు మాత్రమే తెలియజేసింది. రిజర్వు బ్యాంకు కార్యకలాపాలలో జోక్యం కారణంగా ఇద్దరు గవర్నర్లు తమ పదవి నుంచి తప్పుకున్నారు. రిజర్వు బ్యాంకు కార్యకలాపాలలో జోక్యానికి వీలుగా సమాంతర అధికార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆరెస్సెస్ ముఖ్య సభ్యుడు ఎస్.గురుమూర్తిని బోర్డు సభ్యుడిగా నియమించింది.

స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం ప్రభుత్వ ఒత్తిళ్ళకు రాజీపడి పనిచేస్తున్నట్లు కనపడుతోంది. ప్రధానమంత్రి గుజరాత్‌లో పర్యటించి వివిధ పథకాలు ప్రకటించడానికి వీలుగా అక్కడి ఎన్నికలను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. వాయిదా వేయకపోతే ఆ పథకాలు ప్రకటించడానికి వీలుండేది కాదు. అలాగే ఢిల్లీలో ఆప్ ఎమ్ఎల్ఏ లను ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ ఛార్జీలపై సరైన విచారణ లేకుండా అనర్హులుగా ప్రకటించడం కూడా ప్రభుత్వ ఒత్తిడి కారణమే.

కేంద్ర నేర పరిశోధన శాఖలో ముఖ్య అధికారుల మధ్య జరిగిన పోటీ ఆ శాఖ అంతర్గత స్థితికి అద్దం పడుతోంది. మోదీ ప్రభుత్వ అలోక్‌వర్మను డైరెక్టరుగా నియమించింది. వెంటనే

రెండవ స్థానంలో రాకేష్ ఆస్థానాను నియమించింది. వారి మధ్య పోటీ వచ్చి ఆరోపణలు చేసుకోవడంతో ఇద్దరినీ సెలవుపై పంపించి, మధ్యంతర డైరెక్టరుగా నాగేశ్వరరావు అనే మూడవ వ్యక్తిని నియమించింది. అలోక్‌వర్మపై అభియోగాలను విచారించాల్సిందిగా కేంద్ర నిఘా విభాగాన్ని సుప్రీంకోర్టు ఆదేశించడం ఆ శాఖలో జరుగుతున్న వ్యవహారాల స్వభావాన్ని తెలియజేస్తోంది.

కేంద్ర సమాచార కమిషన్ ఒక స్వతంత్ర సంస్థ సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ చట్ట సవరణకు పాల్పడింది. బిజెపీ ప్రభుత్వం సమాచార కమిషనర్ల 5 సం॥ల పనికాలాన్ని కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ తొలగించి కేంద్రమే వారి పని కాలాన్ని, వారి జీతభత్యాలనూ యితర సర్వీసు నియమ నిబంధనలనూ నిర్ణయించే అధికారం పొందింది. దీనితో ప్రభుత్వం శాసనమార్గంలో పారదర్శకత, జవాబుదారీతనం తొలగించినట్లయింది. సమాచార కమిషనర్ల పనితనం సంపూర్ణంగా ప్రభుత్వంపై ఆధారపడేటట్లు చేయడంలో సమాచార హక్కు చట్టం మరింత బలహీనపడింది.

కేంద్ర నిఘా కమిషన్ (సివిసి) : ఈ సంస్థ అధిపతిగా మోదీ తనకు యిష్టమైన కె.వి.చౌదరిని నియమించారు. 2015 సం॥ నియామక సమయంలో అనేక మంది ప్రముఖులు ఇతనిపై నీరా రాడియా టేపులు కేసు, మొయిన్ ఖురేషీ కేసు మొదలైన అనేక అవినీతి, నేర కేసులున్నట్లు చెప్పి వ్యతిరేకించినా ప్రభుత్వం ఈ నియామకంపై పునరాలోచించలేదు.

విద్యాసంస్థలు ఆచరణలో దేశంలోని అన్ని ప్రధాన విశ్వ విద్యాలయాలు, ఎఫ్‌టిఐఐ, ఐసిహెచ్‌ఆర్, ఐసిఎస్‌ఎస్‌ఆర్ మొదలైన విద్యాసంస్థలను ఆరెస్సెస్ మద్దతుదారులకు అందించారు. వారిలో చాలా మందికి అటువంటి సంస్థలను నడిపిన అనుభవం లేదు. విశ్వవిద్యాలయాల్లో వారిపై తీవ్ర వ్యతిరేకత ఎదురైనప్పటికీ ఆ సంస్థలలో ఆరెస్సెస్ ప్రణాళికను రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉద్యమబాట పట్టారు. జెఎన్‌యు, హెచ్‌సియు, అల్హాబాద్ విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఎఫ్‌టిఐఐ తదితర చోట్ల ఈ ఉద్యమాలు జరిగాయి. జరుగుతున్నాయి. దీనిని జీర్ణించుకోలేని ప్రభుత్వం జామియా విశ్వవిద్యాలయంలోకి పోలీసులను పంపి విద్యార్థులపై లాఠీఛార్జి, భాష్పవాయు ప్రయోగం చేయించింది. జెఎన్‌యులోకి తమ అనుబంధ సంస్థ ఎబివిపి గుండాలను పంపి విద్యార్థులపై దాడి చేయించింది.

రాజ్యాంగంలో పొందుపరచినట్లు ప్రతి పౌరుడూ శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి, ప్రచారం చేయాలి అని ఉన్నప్పటికీ విశ్వవిద్యాలయంలో భూతవైద్యం కోర్సు ప్రవేశపెట్టడం బిజెపీకే చెల్లింది.

రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా జమ్మూ కాశ్మీర్‌లో 144 సెక్షన్ విధించి రాజకీయ పార్టీల నాయకులను అరెస్టు లేదా గృహ నిర్బంధంలో ఉంచి, ప్రజల అభిప్రాయాలతో కాని, వారి భవిష్యత్తుని నిర్ణయించుకునే అవకాశం గాని లేకుండా ఇంటర్నెట్, టెలిఫోన్ సౌకర్యాలను నిలిపివేసి ఆ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసింది బిజెపీ ప్రభుత్వం. ప్రత్యేక ప్రతిపత్తి కాశ్మీర్‌కు మాత్రమే కాక భారతదేశంలో ప్రత్యేక పరిస్థితుల వల్ల యితర ప్రాంతాలకు కూడా ఉన్నప్పటికీ కాశ్మీర్ ప్రజలకు రాజ్యాంగ పరంగా 370 అధికరణ ద్వారా 35-ఎ అధికరణ ద్వారా యిచ్చిన హామీలను ఉల్లంఘించి రాజ్యాంగాన్ని ఉల్లంఘించింది. దీనిని సుప్రీంకోర్టు తప్పు పట్టి సుదీర్ఘకాలం ప్రజాస్వామ్య హక్కులు లేకుండా చేయడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది.

కార్యనిర్వాహక వర్గాన్నంతటినీ ఆరెస్సెస్ కార్యకర్తలతో నింపి హిందూత్వ ఎజెండాతో ప్రయాణం చేస్తోంది. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని దేశద్రోహం నేరం క్రింద అరెస్టులు చేస్తోంది. సిబిఐ, ఐడిలతో ప్రతిపక్షం పైనా, విమర్శలు చేసే వారిపైనా దాడులు చేయిస్తోంది. మతవిద్వేష ప్రసంగాలూ మైనారిటీలపై అత్యాచారాలు పెరిగాయి. గోరక్షణ పేరుతో మూకదాడులు, హత్యలు జరుగుతున్నాయి. ఏం తినాలి, ఏ దుస్తులు ధరించాలి అనేది కూడా వారే నిర్ణయిస్తున్నారు. జరిగే హింసాకాండను ఖండించడం లేదు సరికదా బాధితులపై నేరారోపణ చేస్తున్నారు.

ఇటీవల పౌరసత్వ సవరణ చట్టం పేరుతో గతంలో ఎన్నడూ లేని మత ప్రాతిపదికను రాజ్యాంగంలో చేరుస్తున్నారు. ఎన్నార్సీ, ఎన్నార్సీ పేరుతో రాబోవు కాలంలో మతాల మధ్య గల సుహృద్భావాన్ని, సౌభ్రాతృత్వాన్ని విచ్ఛిన్నం చేయడం హిందూ రాష్ట్రాన్ని నిర్మించడం వీరి లక్ష్యం. ప్రభుత్వ ప్రజల సంక్షేమం అభివృద్ధి గురించి కాక వారిని భయభ్రాంతుల్ని చేసి అదుపులో ఉంచుకోవడమే వీరు కోరుకునేది.

స్వాతంత్ర్య సమరం నుంచి ప్రజాస్వామ్యం, లౌకిక, ఫెడరల్ సూత్రాలపై నిర్మించుకున్న రాజ్యాంగాన్ని ప్రజలే రక్షించుకోవాలి. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. బిజెపీని నిలువరించడం ప్రజలందరి కర్తవ్యం. ❑

# రాజ్యాంగ లక్ష్యాలపై దాడి

**కె.ఎస్. లక్ష్మణరావు**
శాసనమండలి సభ్యులు



భారత రాజ్యాంగం రాజ్యాంగ పరిషత్ ఆమోదం పొంది నేటికి 70 సంవత్సరాలైంది. 1949 నవంబరు 26న రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగాన్ని ఆమోదించి, జాతికి అంకితం చేసింది. 1946 డిసెంబరు 13న జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన రాజ్యాంగ లక్ష్యాల తీర్మానం రాజ్యాంగంలో పీఠికగా రూపొందినది. రాజ్యాంగ పీఠిక భారతదేశాన్ని 'సర్వ సత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం'గా ప్రకటించింది. గత 70 ఏళ్లలో 104 రాజ్యాంగ సవరణలు జరిగాయి. 2000 సంవత్సరంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉండగా నియమించిన రాజ్యాంగ సమీక్ష కమిషన్ కూడా ప్రస్తుత రాజ్యాంగం సమున్నతమైనదని తేల్చి చెప్పింది. ఏడు దశాబ్దాలుగా భారత రాజ్యాంగం 'భారత దేశ భిన్నత్వాన్ని, బహుళత్వాన్ని సమైక్యత'ను కాపాడడంలో ముఖ్య పాత్ర పోషించింది. 1975లో ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉండగా అత్యవసర పరిస్థితి విధించినప్పుడు, 1977లో ప్రజలు ఇందిరా గాంధీని ఓడించి రాజ్యాంగ ఆశయాలను కాపాడుకున్నారు.

1967లో గోలక్నాథ్ వర్సెస్ పంజాబ్ కేసులో ప్రాథమిక హక్కులను సవరణ చేసే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కాని 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో 'రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చకుండా ప్రాథమిక హక్కులను సవరణ చేసే అధికారం పార్లమెంటుకు ఉందని తీర్పు చెప్పింది. ఈ కేసులో సుప్రీంకోర్టు 'రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని' వివరిస్తూ రాజ్యాంగ లక్ష్యాలను విశదీకరించింది. అవి... రాజ్యాంగ ఆధిక్యత, సమాఖ్య విధానం, లౌకిక విధానం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, స్వతంత్ర న్యాయ వ్యవస్థ.

2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ నాయకత్వాన గల బిజెపి ప్రభుత్వానికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదు. గత ఆరేళ్లుగా రాజ్యాంగ లక్ష్యాలు, ఆదర్శాలు, విలువలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడులు చేస్తున్నది. డా॥ బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వాన రూపొందిన రాజ్యాంగ లక్ష్యాల స్ఫూర్తిని దెబ్బ తీసే విధంగా మోడీ ప్రభుత్వ చర్యలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విషయమై బిజెపి అనుసరిస్తున్న పద్ధతులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

### సమాఖ్య విధానం

భారతదేశం ఆచరణలో సమాఖ్యగా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. ఒకటవ నిబంధనలో భారతదేశాన్ని 'రాష్ట్రాల యూనియన్' అని పేర్కొన్నారు. ఏడవ షెడ్యూల్లో అధికారాన్ని కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలుగా విభజించారు. రాష్ట్రాల అధికారాలు పెంచడానికి గతంలో సర్కారియా కమిషన్, పూంచీ కమిషన్లను నియమించారు.

నరేంద్రమోడీ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రాల అధికారాలు హరించడానికి ప్రయత్నిస్తున్నారు. జీఎస్టీ ప్రవేశ పెట్టడం ద్వారా రాష్ట్రాలకు వచ్చే పన్నుల ఆదాయం తగ్గిపోయింది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్రం వాటా తగ్గించింది. పెద్ద నోట్ల రద్దు వలన రాష్ట్రాలలో వేలాది పరిశ్రమలు మూతబడి ఆదాయం కోల్పోయాయి. 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదనలు దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలిగించేవిగా వున్నాయి.

సమాఖ్య విధానంలో కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రాలలో భిన్నమైన పార్టీలు అధికారంలో ఉండడం, సహజమైన విషయం. నరేంద్రమోడీ, అమిత్‌షాలు రాష్ట్రాలలో తమ ప్రభుత్వాలు ఏర్పడాలని రాష్ట్రానికి ఒక రకమైన ఎత్తుగడను అనుసరిస్తున్నారు. త్రిపుర, గోవా, మణిపూర్ మొదలగు రాష్ట్రాలలో అధికారం కోసం నీతి బాహ్యమైన విధానాలు అనుసరించారు. ఈ వారంలో మహారాష్ట్రలో తమ ప్రభుత్వ ఏర్పాటుకు చేసిన ప్రయత్నం ప్రజాస్వామ్య విరుద్ధమైనది. జమిలి ఎన్నికల పేరుతో వారు చేస్తున్న ప్రయత్నాలు సమాఖ్య విధానానికి పూర్తి విరుద్ధమైనవి.

జమ్ము-కాశ్మీర్ రాష్ట్రానికి గల 370వ నిబంధన రద్దు చేయడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగ నిర్మాతలు పూర్తిగా చర్చించి జమ్ము, కాశ్మీరుకు 370వ నిబంధన ద్వారా ప్రత్యేక ప్రతిపత్తి కల్పించారు. ఈ నిబంధనను తమకు పార్లమెంటులో గల మెజారిటీని ఉపయోగించుకొని రద్దు చేసి, కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం సమాఖ్య విధానానికి పూర్తి వ్యతిరేకం. రాజ్యాంగంలో 5,6 షెడ్యూళ్లలో ఈశాన్య రాష్ట్రాలలో

గల గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక హక్కులు కల్పించారు. 371 ద్వారా మహారాష్ట్ర, గుజరాత్‌లకు, 371(ఎ) ద్వారా నాగాలాండ్, 371(బి) ద్వారా అస్సాం, 371(సి) ద్వారా మణిపూర్, 371(డి, ఇ) ల ద్వారా ఆంధ్రప్రదేశ్, 371(ఎఫ్) ద్వారా సిక్కిం ప్రత్యేక హక్కులు కలిగి వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన హక్కులు కాపాడటానికి 1/70 చట్టం అమలులో ఉంది. ఇన్ని ఉండగా, మోడీ ప్రభుత్వం కేవలం జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రానికి సంబంధించి 370వ నిబంధన రద్దు చేయడం ప్రజలలో మతపరమైన భావోద్వేగాలు రెచ్చగొట్టడానికి మాత్రమే. జమ్మూ-కాశ్మీర్ ప్రజల మనోభావాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, వారిపై నిర్బంధకాండ ప్రయోగించడం పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకం. ఈ వారం కాశ్మీర్లో పర్యటించిన మాజీ ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హా నాయకత్వ బృందం కూడా జమ్ము, కాశ్మీర్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని చెప్పింది. జమ్మూ-కాశ్మీర్ ప్రజల హక్కులను, సమాఖ్య విధానాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నది. మోడీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి చేసే ప్రయత్నాలన్నీ రాజ్యాంగ విరుద్ధమే.

## లౌకిక విధానం

భిన్న మతాల సమాహారమైన భారతదేశాన్ని రాజ్యాంగం లౌకిక రాజ్యంగా ప్రకటించింది. రాజ్యాంగంలో 25-28 మధ్యగల నిబంధనలు పౌరులకు మత స్వేచ్ఛను కల్పించాయి. భారత దేశంలో 5 వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో 'ఉమ్మడి సంస్కృతి' రూపుదిద్దుకున్నది. హిందూ, బౌద్ధ, జైన, ఇస్లాం, క్రైస్తవ, సిక్కు పార్శీ మతాల ఆచార, సాంప్రదాయాలతో భారత జీవన విధానం రూపొందింది.

భారత ఉమ్మడి సంస్కృతి, సాంప్రదాయాలను దెబ్బ తీసి 'హిందుత్వ' విధానాలు ప్రవేశపెట్టడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అయోధ్యలో రామాలయ నిర్మాణం, శబరిమలై ఆలయంలో స్త్రీల ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పుపై బిజెపి విధానాలు, తలాక్ చట్టాలు మొదలగు వాటితో ప్రజలలో భావోద్వేగాలు రెచ్చగొట్టి మతపరమైన విభజనకు ప్రయత్నిస్తున్నది. పరిశోధనా సంస్థలను, విశ్వవిద్యాలయాలను ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఉండే వారితో నింపుతున్నది. కర్ణాటకలో టిప్పుసుల్తాన్ ఉత్సవాలతో సహా ప్రతి అంశాన్ని మతానికి ముడిపెట్టడానికి సంఘపరివార్, బిజెపి ప్రయత్నిస్తున్నాయి. ఈ అంశాలన్నీ రాజ్యాంగ లక్ష్యమైన లౌకికవాదానికి విఘాతం కలిగిస్తున్నాయి.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యం

రాజ్యాంగ నిర్మాతలు భారత దేశంలో రాజ్యాంగం ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రవేశ పెట్టారు. భారత రాజ్యాంగ పరిషత్‌లో డా॥బి.ఆర్ అంబేద్కర్, నెహ్రూ మొదలగు వారందరూ పార్లమెంటరీ విధానం ఉండాలని భావించారు. రాష్ట్రపతికి నామమాత్ర అధికారాలు ఇచ్చి, ప్రధానమంత్రి నాయకత్వాన గల మంత్రి మండలికి నిజమైన అధికారాలు కల్పించారు. పార్లమెంటరీ విధానం ఏడు దశాబ్దాలుగా భారతదేశంలో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ విజయవంతంగా కొనసాగుతున్నది.

నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగ లక్ష్యాలకు తూట్లు పొడిచే విధంగా ప్రవర్తిస్తోంది. భారత దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అమెరికా వలె అధ్యక్ష పాలనా విధానంలోకి మార్చాలనే ఆలోచనలు కొనసాగుతున్నాయి. అధ్యక్ష పాలనా విధానంలో నియంతృత్వ ధోరణులు ఉంటాయి. మనలాంటి దేశాలకు ఇది సరిపోయే అంశం కాదు.

## భావ ప్రకటనా స్వేచ్ఛ

భారత రాజ్యాంగంలో మూడవ భాగంలో పౌరులకు ఆరు ప్రాథమిక హక్కులు కల్పించారు. వీటికి న్యాయ స్థానాల సంరక్షణ ఉంటుంది. వీటిలో 19వ నిబంధన ద్వారా కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ అతి ముఖ్యమైంది. వాక్ స్వాతంత్ర్యం, సభా స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం మొదలగునవి భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగంగా ఉంటాయి.

గత ఆరేళ్లుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి జరుగుతున్నది. భిన్నాభిప్రాయాలను రాజద్రోహ నేరంగా ప్రకటిస్తున్నారు. ఇటీవల ప్రధాన మంత్రికి లేఖ రాసిన మేధావులపై రాజ ద్రోహం నేరం మోపాలని భావించారు. ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ మొదలగు చోట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే వాతావరణం లేకుండా చేస్తున్నారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినందుకు మహారాష్ట్రలో నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారేలను కర్నాటకలో ఎం.ఎం కల్బుర్గిని హత్య చేశారు. హిందూత్వ సనాతన ధర్మ సంస్థలు ఈ హత్యలు చేశాయనడానికి ఆధారాలు ఉన్నాయి. ఇంతవరకు అరెస్టులు జరగలేదు.

భిన్న సంస్కృతులు గల భారతదేశంలో ప్రజల జీవన విధానం ఆహారపు అలవాట్లు, సాంప్రదాయాలు, ఆచారాలు ఎంతో

☞ మిగతా 32వ పేజీలో

# రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న ఆర్ ఎస్ ఎస్

డా॥ కత్తి పద్మారావు
నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు



నిజానికి మన భారత రాజ్యాంగం హిందూమతం ప్రతిపాదించిన, వర్ణం, కులం, ఆచారం అన్నింటికి ప్రత్యామ్నాయ సిద్ధాంతాలతో రూపొందింది. ఈ క్రమంలో భారత దేశం 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య గణతంత్రంగా ప్రకటించబడింది. అంతేగాక సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని కలిగించేదిగా ఉంది. మన రాజ్యాంగం ద్వారా మనకు ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ కలుగుతున్నాయి. భారత రాజ్యాంగం సమాన హోదా, సమాన అవకాశాలను కలిగిస్తుంది. దీని ద్వారా భారతీయులు రాను రాను సమైక్యతా భావాన్ని పెంపొందించుకోవలసి వుంది. కులమత భావాలు లేని అఖండతా భావం పెంపొందించుకొంటూ ముందుకు వెళ్ళాల్సి వుంది. కుల భావం తగ్గే కొద్దీ ప్రజల మధ్య సోదర భావం పెరుగుతుంది. ప్రతి మనిషికి ఒక విలువ, ఆత్మగౌరవం పెంపొందించుకోవలసి వుంది. అయితే బి.జె.పి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీయాలని ఆర్.యస్.యస్. ప్రయత్నిస్తోంది. డా॥బి.ఆర్ అంబేద్కర్‌తో పాటు జవహర్‌లాల్ నెహ్రూ, బాబూ రాజేంద్ర ప్రసాద్, మౌలానా ఆజాద్, వల్లభాయ్ పటేల్, అల్లాడి కుప్పుస్వామి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం, ఎన్.జి.రంగా, బాబూ జగ్జీవన్‌రామ్, కామరాజ్ నాడార్ వంటి జాతీయ నాయకులు రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులుగా ఉన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. అనేక చర్చలు, మదింపుల తరువాత రాజ్యాంగంలో మూలసూత్రాలు రూపొందించబడ్డాయి. అయితే ఆర్.యస్.యస్ రాజ్యాంగేతరంగా ప్రవర్తిస్తూ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తోంది. అన్ని మతాలు, సాంప్రదాయ పార్టీలు విజ్ఞానం వైపు నడవవలసి వుంది. ఆర్.యస్.యస్ కూడా ఆధునిక భావాలు సంతరించుకోకుండా దళితుల పట్ల ద్వేషాన్ని మరింత పెంచుకొంటోంది. కోట్లాది దేవుళ్ళను సృష్టించుకొంటూ పోతోంది. స్వాములు, యోగులు వంటి తత్వశాస్త్ర రహితులను, మానవ బలహీనతలను రెచ్చగొట్టే స్వాములను సృష్టిస్తోంది.

ఉత్పత్తిలో భాగస్వాములు కాని, మేధో సంపదలో భాగం కాని వారి సంఖ్య పెరిగే కొద్దీ మన ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలిపోతుంది. నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ ఈ విషయం నొక్కి చెబుతున్నారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 17 అస్పృశ్యతా నివారణను నిర్దేశించింది. మహాత్మా గాంధీ అస్పృశ్యతా నివారణా కార్యక్రమం తీసుకొన్నారు. అత్యధిక మంది హిందువుల మనస్సుల్లో అస్పృశ్యతా భావం ఇంకా బలంగా ఉంది. ఒక పక్క సర్వేజన: సుఖినో భవంతు చెబుతూ మరోపక్క అస్పృశ్యతను గుండెల్లో పేర్చుకొని వుండటం ఎంత వరకు సామాజిక ధర్మం అవుతుంది? మాట్లాడితే, భారత, రామాయణాలను ఉదహరిస్తున్నారు. ఆ కథలు మొదట చిన్నవిగా ప్రారంభమై బృహత్తరంగా పెరిగిన క్రమం తెలియదా! వాస్తవ ధర్మం నీకు రాజ్యాంగంలో వున్నప్పుడు, పురాణ గాథలను అనుసరించి జీవించడం ఎందుకు? ప్రపంచం మొత్తంగా హిందూ మతం విస్తరిస్తోందని ఆర్.యస్.యస్ వారు చెబుతున్నారు. ప్రపంచంలో హిందూ ధర్మాన్ని ఆచరించడానికి అక్కడ కులం, అస్పృశ్యత, స్త్రీ అణచివేతను వీరు కొత్త బోధనల ద్వారా తెస్తున్నారు! ఇతర దేశాలు తమ భూభాగాన్ని పితృభూమిగా భావిస్తుంటే, భారతదేశం మాతృభూమిగా చేసుకున్నందుకు పొగుడుతున్న మీరు, కులాంతర వివాహాలు చేసుకొన్న వారిని ఎందుకు చంపుతున్నారు? సాటి మనిషిని మనిషిగా చూడలేని మత ధర్మం ఎలా విశ్వజనీనం అవుతుంది? హిందూ ధర్మం భారతీయ ధర్మం ఎలా అవుతుంది? ఆదిమ భారతీయులు సమ ధర్మంతో జీవించారు. వైదిక ధర్మాల వల్ల సమాజం సామాజిక విచ్ఛిన్నానికి గురైంది. అనేక పోరాటాల ఫలితంగా రాజ్యాంగం సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రకటించగలిగింది.

రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షా రాజ్యాంగాన్ని కుళ్లపొడిచేందుకు ప్రయత్నించడం ఆశ్చర్యం. రాజ్యాంగాన్ని అనుసరిస్తే ప్రజల్లో ఉత్పాదక శక్తి, సామర్థ్యం పెరుగుతుందని అంబేద్కర్ చెప్పారు. అంతేగాక ప్రభుత్వ పరిశ్రమలను అభివృద్ధి చేయడం ద్వారా దళిత బహుజనులకు ఉద్యోగ వసతి కల్పించవచ్చన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం నిరంతరం పరిపాలనా సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. అయితే ఇటువంటి

చర్యలను ఆర్.యస్.యస్ వ్యతిరేకిస్తుంది. కారణం ప్రభుత్వ రంగ సంస్థలు పెరిగితే యస్.సి, యస్.టి, బి.సిలకు ఉద్యోగఅవకాశాలు పెరుగుతాయని, తద్వారా పేదరికం పోతుందని, అలా పేదరికం పోతే కర్మభావం మీద నమ్మకం పోతుందని ఆర్.యస్.యస్ భావిస్తుంది. పేదరిక నిర్మూలనకు కృషి చేయవలసిన ఒక మత సంస్థ పేదరికం పెరగడం ద్వారానే దేవుని మీద భక్తి పెరుగుతుందని భావించడం తిరోగమన చర్య.

ఆర్.యస్.యస్ మానవాభ్యుదయానికి వ్యతిరేకమైన సంస్థ. ఎన్నో సార్లు రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరించి నిషేధానికి గురైన సంఘం. హిందూ మతం ఆవిర్భవించక ముందటి తాత్వికాంశాలు వారికి తెలియదు. సాంఖ్యదర్శనం, న్యాయ దర్శనం, వైశేషిక దర్శనం వంటి గ్రంథాలు ముందుకు తెచ్చిన తాత్విక చర్చలో పాల్గొనే సాహసం వారు చేయరు.

మతం కోసం మనిషి కాదు. మనిషి కోసం మతం అని అంబేద్కర్ ప్రకటించారు. ఈ సందర్భంగానే మనుషులను జంతువులకన్నా హీనంగా చూసేవారు వంచకులు. అటువంటి వ్యక్తులతో కలిసి ఉండకండి. జంతువుల స్పర్శను అనుమతిస్తూ, మానవుల స్పర్శను నిషేధించే మతం, మతం కాదు మూర్ఖత్వం. నిరక్షరాస్యులను నిరక్షరాస్యులుగా, పేదలను పేదలుగా తొక్కి ఉంచే మతం, మతం కాదు అని ఆయన చెప్పారు.

నిజానికి కారల్ మార్క్స్ మతం మత్తు మందు వంటిదని చెప్పినా, అంబేద్కర్ మతోన్మాదం దేశానికి అవరోధమని చెప్పినా శాస్త్ర జ్ఞానాభివృద్ధి పట్ల జిజ్ఞాసను పెంచుకోమనేదే వారి సందేశం. మీ ఇంట్లో సగ భాగంగా వున్న మహిళను అవమానించి, నీకు అన్నాన్ని సృష్టిస్తున్న శ్రామికుణ్ణి అవమానించి దేశాన్ని నువ్వు ముందుకు తీసుకెళ్ళలేవు. భారతీయులందరిదీ ఒకే ఒక ప్రవచన గ్రంథం. అదే భారత రాజ్యాంగం. భారత రాజ్యాంగ అవగాహనతో మనం ముందుకు వెళితే ప్రపంచ దేశాలను అధిగమించే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, తాత్విక, సాంకేతిక వ్యవస్థ మనకు ఏర్పడుతుంది. ఆ దిశగా లౌకికవాద భావజాల ఆచరణ కర్తలంతా ఐక్యశక్తితో ముందుకు నడవాలి. అప్పుడే మతోన్మాద భావజాలానికి ప్రత్యామ్నాయంగా బుద్ధుడు, మహాత్మాఫూలే, అంబేద్కర్, పెరియార్ రామస్వామి నాయకర్ వంటి వారు తీసుకొచ్చిన సామాజిక సాంస్కృతిక విప్లవం విజయవంతం అవుతుంది. ఆ దిశగా నడుద్దాం. ❑

## రాజ్యాంగ లక్ష్యాలపై దాడి

**(30వ పేజీ తరువాయి)**

భిన్నంగా వుంటాయి. మతతత్వ వాదులు ప్రజల ఆహారపు అలవాట్లపై దాడి చేయడం ద్వారా ప్రజలలో మతపరమైన విభజన తేవటానికి ప్రయత్నాలు చేశారు. ఢిల్లీ వద్ద గల, దాద్రిలో మహ్మద్ అఖ్లాక్ కుటుంబంపై గొడ్డు మాంసం సాకుతో దాడి చేయడం ప్రజల ఆహార హక్కులకు భంగం కలిగించడమే భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతుంది.

### స్వతంత్ర న్యాయ వ్యవస్థ

ప్రభుత్వ అంగాలైన కార్యనిర్వాహక వర్గం, శాసన నిర్మాణ శాఖ, న్యాయ వ్యవస్థలు స్వతంత్రంగా పని చేయాలని రాజ్యాంగం భావించింది. జస్టిస్ వి.ఆర్ కృష్ణయ్యర్, ఒ.చిన్నప్పరెడ్డి, పి.ఎన్ భగవతి, వై.వి చంద్రచూడ్ వంటి న్యాయమూర్తులు న్యాయ వ్యవస్థ స్వతంత్రతను నిలబెట్టారు.

గత ఆరేళ్లుగా నరేంద్రమోడీ ప్రభుత్వం న్యాయ వ్యవస్థ వ్యవహారాలలో అనేక సందర్భాలలో జోక్యం చేసుకుంటున్నది. ఇటీవల మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయడం దీనిలో భాగమే.

గత సంవత్సరం 'కొలీజియం' లోని నలుగురు న్యాయ మూర్తులు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించి తమ నిరసనను జస్టిస్ చలమేశ్వర్ ఆధ్వర్యంలో తెలియజేయడం ప్రభుత్వం జోక్యం చేసుకోవడం వలనే. ఇటీవల అయోధ్య, రాఫెల్, శబరిమలై మొదలగు వాటి విషయంలో సుప్రీంకోర్టు చెప్పిన తీర్పులపై ప్రభుత్వ ప్రభావమున్నదని అనేకమంది న్యాయ నిపుణులు భావించారు. న్యాయశాఖ స్వతంత్రత పైనే ప్రజాస్వామ్య పటిష్టత ఆధారపడి వున్నది.

ఏడు దశాబ్దాల రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో రూపొందించిన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ ఆదర్శాలను కాపాడుకోవాల్సిన బాధ్యత పౌర సమాజంపై, ప్రజా సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, అభ్యుదయవాదులపై ఉన్నది. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, పీఠిక మొదలగు వాటిని స్ఫూర్తిగా తీసుకుని రాజ్యాంగ పరిరక్షణకు కదులుదాం. ❑

# ఆర్.టి.ఐ. సవరణ
# ప్రజల భాగస్వామ్యానికి భంగం

పార్లమెంటు ఇటీవల ఆమోదించిన సమాచార హక్కు (సవరణ) చట్టం కేంద్ర సమాచార కమిషన్ అస్తిత్వానికే ముప్పు కలిగించేదిగా ఉంది. ఈ సవరణ చట్టం ప్రవేశపెట్టడానికి పార్లమెంటులో అనుసరించవలసిన ప్రక్రియ అనుసరించకుండానే హడావుడిగా ఈ సవరణ ఆమోదించేశారు. ఈ సవరణలను నిశితంగా పరిశీలించకుండా ఎందుకు ఆమోదించినట్టు? సెలెక్ట్ కమిటీకి పంపకూడదని ఎందుకు పట్టుబట్టినట్టు? ఈ సవరణలను చూస్తే ఈ మహా వ్యవస్థల అస్తిత్వమే ప్రశ్నార్థకంగా తయారైంది.

2005 నాటి ఆర్.టి.ఐ. చట్టం ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని, రహస్యంగా వ్యవహరించడాన్ని ప్రశ్నించే హక్కు పౌరులకు ఇస్తుంది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఉన్న సమాచార కమిషన్ల ద్వారా ప్రజలకు ప్రభుత్వానికి సంబంధించిన సమాచారం అందుతుంది. ఈ సమాచారం ప్రజా శ్రేయస్సు కోసం కావచ్చు. ఎందుకంటే అది ప్రజల ప్రయోజనాలకు సంబంధించింది. దాపరికం లేని ప్రభుత్వానికి మూల స్తంభం లాంటిది. 2019 నాటి ఆర్.టి.ఐ. సవరణ చట్టం 13, 15, 27 సెక్షన్లను సవరించింది. ఈ సవరణల ద్వారా సమాచార కమిషనర్ల నియామకం, వేతనాలు, వారి పదవీ కాలం మొదలైన వాటిని నిర్ణయించే అధికారం ప్రభుత్వానికి సంక్రమించింది. అయితే ప్రభుత్వానికి దఖలు పడే సవరణలు సమాచార హక్కు వ్యవస్థ స్వయంప్రతిపత్తికి, ఈ చట్టాన్ని సమర్థంగా అమలు చేయడానికి విఘాతం కలిగిస్తుంది.

ఇది ఫెడరల్ విధానాన్ని దెబ్బ తీసేది. ఇది రాష్ట్రాల మీద ఆధిపత్యం చెలాయించడానికి ఉపకరిస్తుంది. అందువల్ల ఇది ప్రజాస్వామ విరుద్ధమైంది. దీనివల్ల భవిష్యత్తులో సమాచార కమిషన్ల నియామకంలో ఎగుడు దిగుళ్లకు దారి తీస్తుంది. రాష్ట్రాలకు, కేంద్రాలకు మధ్య తగవులకు దారి తీస్తుంది. ప్రభుత్వాల దాపరికం లేని తత్వాన్ని దెబ్బ తీస్తుంది.

ప్రభుత్వం ఏ మేరకు దాపరికం లేకుండా వ్యవహరిస్తోంది, ఏ మేరకు లక్ష్యాలు సాధించగలుగుతుంది అనేది ఈ సవరణల మీద ఆధారపడి ఉంటుంది. కానీ వీటికి సంబంధించిన సమాచారం అనేక ప్రయోజనాలు ఉంటాయి. అది సమాజ ప్రయోజనాలు కాపాడగలుగుతుంది.

ప్రతి సంవత్సరం సమాచార హక్కు చట్టం కింద 60 లక్షల దరఖాస్తులు దాఖలవుతున్నాయి. ఇది ప్రపంచంలోనే అత్యంత గొప్ప వ్యవహారం. ఈ దరఖాస్తులు అనేక రకాల సమాచారం కోరతాయి. ప్రాథమిక సమస్యలకు ప్రభుత్వ బాధ్యతను నిలదీస్తాయి. ప్రభుత్వ ఉన్నతాధికారులను ప్రశ్నించడానికి ఈ దరఖాస్తులు ఉపకరిస్తాయి. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకుని ప్రజలు అవినీతిని, మానవ హక్కుల ఉల్లంఘనను, రాజ్యవ్యవస్థ చేసే పొరపాట్లను ప్రశ్నించారు. గత కొద్ది సంవత్సరాలుగా సమాచార కమిషనర్లు ఆదేశించినప్పటికీ సమాచారం ఇవ్వడానికి నిరాకరించారని ఈ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా సభ్యులు చెప్పారు.

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం పౌరులకు సమాచారం ఎందుకు నిరాకరిస్తుంది? ప్రభుత్వ వ్యవస్థలకు సంబంధించి ప్రజలు సమాచారం అడగడానికి ఈ చట్టం ఉపకరిస్తుంది. సమాచార హక్కు చట్టం పటిష్ఠమైన ప్రజాస్వామ్యం కొనసాగడానికి ఉపయోగపడుతుంది. ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్యం పౌరులను నిష్క్రియాపరులైన పాలితులుగా భావిస్తోంది. విధానాలు, నిర్ణయాలకు సంబంధించి పౌరులు తెలుసుకునే సమాచారం బాధ్యతాయుతంగా వ్యవహరించడానికి వీలుంటుంది. అందువల్ల రాజకీయాలకు కేంద్ర బిందువు ప్రజలే తప్ప పాలకులు, నాయకులు కారు. సమాచార హక్కు చట్టం రాజ్యాంగంలోని 19,21 అధికరణాల నుంచి వచ్చిందని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో స్పష్టం చేసింది. భావా ప్రకటనా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యమే ఈ చట్టానికి మూలం. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల పాత్రను పరిమితం చేయాలని చూస్తోంది. పాలితులు పాలకులకు సంబంధించిన ప్రశ్నలు అడగడానికి వీలు లేదు. సమాచార హక్కు చట్టం వల్ల పరిశోధనాత్మక పత్రికా రచనకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఆర్.టి.ఐ. చట్టాన్ని వినియోగించుకుని పరిశోధనాత్మక పత్రికా రచన సాగింది. మీడియాను గుప్పెట్లో పెట్టుకోవాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పరిశోధనాత్మక పత్రికా రచనకు అవకాశం లేకుండా చేస్తోంది.

ఆర్.టి.ఐ. ప్రజోద్యమాల నుంచి ఉద్భవించింది. అనేక మంది ఆర్.టి.ఐ.ని యాదృచ్ఛికంగా వినియోగించుకున్నారు. ఇది ఆర్.టి.ఐ. స్ఫూర్తికి సంకేతం. వందలాది మంది ఆర్.టి.ఐ. కార్యకర్తలను హతమార్చారు. దాడి చేశారు. వేధించారు. వ్యవస్థ మీదే దాడి జరుగుతున్నప్పుడు వ్యక్తులు పోరాడే అవకాశం ఉండదు. ప్రజల మద్దతు లేకుండా ఈ సవరణలను తిరగదోడడం సాధ్యం కాదు.

**EPW సంపాదకీయం** ❑

# ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు

కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని, రాష్ట్ర హోదాను రద్దు చేసి, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సహజంగానే కొంత మద్దతు, అనేకానేక అభ్యంతరాలూ వ్యక్తమైనాయి. సభ్య సమాజం, ప్రజల తరఫున మాట్లాడే మేధావి వర్గం, ప్రతిపక్ష నాయకులు లేవనెత్తిన అభ్యంతరాలు ఇప్పటికే బహుళ ప్రచారంలో ఉన్నాయి. వాటిని పునరుద్ఘాటించవలసిన అవసరం లేదు. కశ్మీర్‌పై నిర్ణయాన్ని ప్రతిపక్షాల దృష్టి నుంచి చూడడం అంటే రాజ్యాంగ ప్రమాణాలను ఖాతరు చేయకపోవడాన్ని, ఏ నిర్ణయమైనా విస్తృతమైన సంప్రదింపుల తరవాతే తీసుకోవాలన్న నియమాన్ని ఉల్లంఘించడాన్ని, జరిగే అన్యాయం గురించి ఆలోచించడమే. ప్రశ్నించడమే. అధికార పక్షం అన్యాయంగానే కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసింది.

ఇలాంటి నిర్ణయాన్ని ప్రభుత్వం సమర్థించుకోవడం అసాధారణమైంది ఏమీ కాదు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేయడం అంటే ఆ ప్రాంతాన్ని దేశంలో సమైక్యం చేయడం, ఆ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం పాటు పడడమేనని కేంద్రం సమర్థించుకోవడం మామూలే. కశ్మీర్ భారత్‌కు భిన్నం కాదు అని చెప్పాలంటే 370వ అధికరణం, దానితో సంబంధం ఉన్న 35-ఎ అధికరణం అడ్డంకిగా ఉన్నాయన్నది ప్రభుత్వ వాదన. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పటిష్ఠమైన ప్రభుత్వాలు ఉండాలంటే కశ్మీర్‌ను "సమైక్యం" చేయాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం, కేంద్ర నిర్ణయాన్ని సమర్థిస్తున్న వారూ భావిస్తున్నారు.

కశ్మీర్‌ను సమైక్యం చేయడం అని అధికార పక్షం చెప్పే మాట వెనక తామ వాదనే చెల్లాలన్న ధోరణి ఉంది. ఇందులో దేశ సమైక్యత, ఆ ప్రాంత అభివృద్ధి, కశ్మీరీ ప్రజల సంక్షేమం అన్న మాటలు సహజంగానే ఇమిడి ఉంటాయి. కేంద్రప్రభుత్వం చేస్తున్న ఈ వాదన, అనేక రాజకీయ పక్షాలు ఈ వాదనను సమర్థించడం సవ్యమైన రాజకీయ చైతన్యం కొరవడడానికి నిదర్శనం. ప్రభుత్వ వాదనలు నిజానికి ఊకదంపుడు మాటలే తప్ప వాస్తవం మీద ఆధారపడ్డవి కాదు. ఇది అభివృద్ధికరమైన జాతీయవాదానికి అనుగుణమైంది కాదు. దేశంలోని అనేక ప్రాంతాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఉద్రిక్తతలు రాష్ట్రాల మధ్య కూడా కనిపిస్తాయి. ఈ ప్రాంతాలు, రాష్ట్రాలూ భారత ఫెడరల్ వ్యవస్థలో భాగమే. ఫెడరల్ విధానంలో సామరస్యం కొనసాగితేనే రాష్ట్రాలకు విలువ ఉంటుంది. ఈ ప్రాంతాలలో నివసించేవారిలో వ్యధ ఉంటే సామరస్యం సాధ్యంకాదు.

అధికారం కేంద్రీకృతం అయితే సంక్షేమం సాధ్యం కాదు. ఒక వేళ అదే సాధ్యమయ్యేటట్టయితే మన దేశంలో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలే ఉండేవి కావు. ప్రజలకు నాణ్యమైన జీవనాన్ని అందించే సామర్థ్యం మన పట్టణాలకు లేదు. గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేసినందువల్ల, ప్రాంతీయ అభివృద్ధి మీద శ్రద్ధ తీసుకోనందువల్ల వలసలు తప్పడం లేదు. దీనివల్ల వేలాది గ్రామాల్లో నాగరికత ధ్వంసం అయింది. ఉత్తరాఖండ్ దీనికి మంచి ఉదాహరణ. అక్కడి గ్రామాలు ఇప్పుడు దయ్యాల కొంపలుగా మారిపోయాయి. నిర్జనంగా తయారయ్యాయి. మనుషుల, జీవావరణ మనుగడకు ఏ మేరకు ఉపయోగపడుతుందన్న అంశం మీదే ఒక ప్రాంతం విలువ ఆధారపడి ఉంటుంది.

కశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు చేయడంవల్ల మరిన్ని అవకాశాలు కల్పించగలమని కేంద్ర ప్రభుత్వం చెప్తోంది. ఆర్థిక లావాదేవీలకు ఎక్కువ అవకాశం ఉండే పట్టణ ప్రాంతాలలో ప్రభుత్వం అందరికీ సమాన అవకాశాలు కల్పించలేదన్నది వాస్తవం. దీనివల్ల అవకాశం కోల్పోయేది ప్రధానంగా సామాన్యులే. అనుభవాన్ని బట్టి చూస్తే పట్టణాలు అత్యంత సంపన్నులకే అవకాశాలు కల్పిస్తున్నాయి. అవి ఆధునిక అగ్రహారాలుగా మారిపోతున్నాయి. అట్టడుగు వర్గాల వారికి అవకాశమే ఉండడం లేదు. కేంద్ర ప్రభుత్వ వాదన అన్యాయాన్ని ఎదిరించే వర్గాల వారి వాణిని కప్పి పుచ్చుతాయి. కశ్మీర్ లోయలో ఈ పరిస్థితి మరింత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వారికి నైతికంగా కనీస స్థానమైనా దక్కలేదు. 370వ అధికరణానికి సంబంధించి ప్రభుత్వం ఏ చేయబోతోందో తెలుసుకునే హక్కైనా తమకు ఉండాలని కశ్మీర్ ప్రజలు భావించారు.

ఎలాంటి సంప్రదింపులు లేకుండా కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలన్న ఆత్రుతలో ఉందని తేలిపోయింది. సకల వ్యవహారాలూ తమ గుప్పెట్లోనే ఉంచుకోవాలనే ప్రయత్నం కొన్ని సార్లు విలోమ ఫలితాలు ఇవ్వవచ్చు. కశ్మీర్ కల్లోలం ఆధారంగానే అధికార కేంద్రీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం అంటే వ్యవసాయ, ఉపాధి, పట్టణాల నిర్వహణా రంగంలో ఉన్న సంక్షోభాన్ని విస్మరించడమే. ఘర్షణలను నివారించడానికి ఫెడరల్ విధానం మంచి అవకాశం కల్పిస్తుంది. రాష్ట్రాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా కుదించడంవల్ల ఇది సాధ్యం కాదు. కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అధికార కేంద్రీకరణ ద్వారానే ఘర్షణలను పరిష్కరించాలనుకుంటోంది. వికేంద్రీకృతంగా ఉన్న ఘర్షణలను విస్మరిస్తే దానివల్ల బాధితులైన వారు ఎప్పుడో ఉవ్వెత్తున ఎగసిపడే ప్రమాదం పొంచి ఉంటుంది. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఫెడరల్ విధానాన్ని అనుసరిస్తేనే ఘర్షణల నివారణ సాధ్యం అవుతుంది. మానవుల అభివృద్ధి ఆధారంగా ఉండే ఫెడరల్ విధానంలో సమానత్వభావన ఉంటుంది. అంటే నాగరికంగా జీవించే అవకాశం కల్పించాలి.

**EPW సంపాదకీయం** ❑

# సైనిక 'రాజకీయం' ప్రమాదకరం

**విజయ్ ఒబెరాయ్**
మాజీ వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్,
ఇండియన్ ఆర్మీ థింక్ టాంక్ సంస్థాపక డైరెక్టర్



సైన్యం నిర్దిష్ట రాజకీయ పార్టీకి అనుకూలంగా మాట్లాడుతున్నప్పుడు జాతీయ భద్రతా విధానం సర్వసమ్మతంగా అమలవుతుందని విశ్వసించటం కష్టం. రాజకీయాలకు, మతానికి, జెండర్‌కు, కులానికి, జాతి వివక్షకు అతీతంగా ఉంటూండటమే భారతీయ సైన్యం నిజమైన బలం. దేశ ప్రజలు సైన్యంపై అంతటి విశ్వాసాన్ని, ఆరాధనను ప్రదర్శించడానికి ఇదే కారణం. ఉన్నత స్థానాల్లోని సైన్యాధికారులు ఈ దృక్పథాన్ని, సైనిక జీవితాన్ని క్రమం తప్పకుండా పాటిస్తుంటారు. కానీ ఇటీవలి సంవత్సరాల్లో కొందరు సీనియర్ సైనికాధికారులు ఈ సూత్రాన్ని వదిలివేశారు. ఉన్నత ర్యాంకు కోసం తపిస్తూ, సొంత ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి సైనిక వారసత్వ మనస్తత్వాన్ని వదిలేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇది సైన్యం నైతిక ధృతికి అవరోధంగా మారుతుంది. యావత్ సైనిక బలగాలపై తీవ్ర ప్రభావం కలిగిస్తుంది.

పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) సంబంధించిన తీవ్ర వివాదం మధ్య భారతదేశం ప్రస్తుతం చిక్కుకుపోయి ఉంది. అదే సమయంలో జాతీయ జనగణన నమోదు (ఎన్పీఆర్), అస్సాంలో అక్రమ వలసదారులను గుర్తించే ప్రక్రియను ఖరారు చేయడానికి సంబంధించిన వార్తల్ని ప్రచారంలో పెట్టి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. అయితే తమ ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపుతున్న కొన్ని దేశాల సరసన భారత్ కూడా చేరడం విచారకరం. ఆఫ్రికా, యూరోప్, మధ్యప్రాచ్యం, తూర్పు ఆసియా, దక్షిణ అమెరికా.. ఇలా ప్రపంచమంతటా ఇలాంటి ధోరణులు పొడసూపుతుండటం తెలిసిందే. ప్రజాందోళనలకు విభిన్న కారణాలు ఉండవచ్చు కానీ పాలకవర్గాలు తమ విధానాలను మార్చుకోవడంలో, పునరాలోచన చేయడంలో మొండివైఖరిని ప్రదర్శించడం అనే ఉమ్మడి లక్షణమే ఈ ఆందోళనలకు భూమిక. అయితే కొన్ని దేశాలు తమ ప్రజల ఆకాంక్షలను పట్టించుకుని విధానాల్లో కొన్ని సవరణలను చేసుకుంటున్నాయి కానీ భారత ప్రభుత్వం మాత్రం ప్రజల డిమాండ్లకు ఏమాత్రం తలొగ్గుతున్నట్లు కనిపించనందునే ప్రజాందోళనలపై, హింసాత్మక చర్యలపై భద్రతా బలగాల అణచివేత కొనసాగుతున్నాయి.

బహుశా, పార్లమెంటులో అఖండ మెజారిటీ వల్లే పాలక పార్టీ తన సిద్ధాంతాలను ఎలాగైనా సరే ముందుకు తీసుకుపోవాలని భావిస్తున్నట్లుంది. ఇప్పటికే పార్లమెంటు ఆమోదం లభించడంతో తన విధానాలను ఏకపక్షంగా అమలు చేయాలని పాలకపక్షం సిద్ధమైంది. చాలా సందర్భాల్లో సంఖ్యాబలంలో చిన్నదిగా ఉన్న ప్రతిపక్షం అభిప్రాయాలను పెద్దగా లెక్కచేయని పరిస్థితి ఏర్పడింది. పౌరసత్వ సవరణ చట్టం జాతీయ జనగణన ప్రాతిపదికన జరుగుతుందనే అంశంపై కేంద్రప్రభుత్వం పరస్పర విభిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నట్లు ఇటీవలి నివేదిక సూచిస్తోంది. ఎన్నార్సీకి అనుగుణంగానే ఎన్పీఆర్ ఉంటుందని రాజకీయ నేతలు ప్రకటిస్తుండగా ఎన్పీఆర్ తొలిదశగా ఉంటుందని ఎమ్హెచ్ఏ వార్షిక నివేదిక చెబుతోంది. ఇలా ప్రభుత్వ పక్షాన మారుతున్న విధానాలు ఆందోళనకారులకు హామీ ఇవ్వకపోగా, ప్రతికూల ప్రభావాలకు దారితీసి విశ్వాస భంగం కలిగిస్తున్నాయి.

ప్రభుత్వం ఇప్పటికే ఎదురుదాడి మొదలెట్టేసింది. తనకు తోడుగా ప్రాంతీయ, రాష్ట్ర పార్టీలను సమీకరిస్తోంది. ఈ విధాన సూత్రీకరణల ద్వారా తమ పౌరసత్వం ఎక్కడ పోతుందో అని ఏ భారతీయ పౌరులూ భయపడాల్సిన పనిలేదని హామీ ఇస్తోంది. రాజకీయ పార్టీల దృక్పథాలు విభిన్నంగా ఉండటంతో ప్రజల్లో విశ్వాసరాహిత్యం ప్రబలుతోంది. ఈ పరిస్థితిపై సాయుధబలగాలకు ఎలాంటి పాత్ర ఉండకూడదు. ఎందుకంటే సైన్యం పాత్ర, వారి కార్యాచరణ పక్కాగా నిర్వచించబడి ఉంది. రాజకీయ విన్యాసాలు రాజకీయ నేతలకు, పార్టీలకు మాత్రమే సంబంధించినవి కానీ సాయుధ బలగాలకు కాదు.

72 సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో మనం అనేక రాజకీయ పార్టీలు పాలించడం చూశాం. కానీ, ఒక విషయంలో మాత్రం ఇవి రెండు ముఖాలను ప్రదర్శిస్తుంటాయి. ప్రజల డిమాండ్లను వింటాయి. తర్వాత వాటిని సవరిస్తాయి, నిర్లక్ష్యం చేస్తాయి, వదిలివేస్తాయి, అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కూడా గతంలో ఇలాగే చేసింది. కానీ ఇటీవలి కాలంలో ప్రజానుకూల చర్యలను ప్రధాన ఎన్నికలకు ముందు

మాత్రమే ప్రకటించడం పార్టీలకు అలవాటుగా మారింది. కానీ ఇప్పుడు మన సైనిక బలగాల విషయానికి వద్దాం. భారత సైన్యం లౌకికత్వానికి చెందిన ప్రాథమిక సూత్రాలకు కట్టుబడి రాజకీయ పోరాటాలపై ఎలాంటి వైఖరి తీసుకోకూడదని రాజ్యాంగంలో పొందుపర్చిన సూత్రీకరణలను తు.చ. తప్పకుండా గౌరవిస్తుంటాయి.

సైన్యం ఉదాహరణను విస్తరించి చూసినట్లయితే, వాయుసేన, నావికాబలగానికి చెందిన కమాండింగ్ ఆఫీసర్లకు చెందిన వివిధ స్థాయిల అధికారులు కూడా రాజకీయాలకు అతీతంగా ఉంటాయి. వీరు మతపరమైన, లైంగికపరమైన ఎలాంటి వివక్షను పాటించరు. అలాగే కులాన్ని చూడరు, జాతి వివక్షను ప్రదర్శించరు. ఇదే మన సైన్యం బలం. భారత ప్రజలు సైన్యంపై అంతటి విశ్వాసాన్ని, అంత ఆరాధనను ప్రదర్శించడానికి ఇదే కారణం.

ఉన్నత స్థానాల్లోని సైనికాధికారులు ఈ దృక్పథాన్ని, సైనిక జీవితాన్ని క్రమం తప్పకుండా పాటిస్తుంటారు. కానీ ఇటీవలి సంవత్సరాల్లో సీనియర్ సైనికాధికారులు ఈ సూత్రాన్ని వదిలివేశారు, పలుచన చేశారు కూడా. ఉన్నత ర్యాంకు కోసం తపిస్తూ, భౌతిక ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి సైనిక వారసత్వపు మనస్తత్వాన్ని వదిలేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. సాధారణంగా సైనిక నైతిక ధృతికి, ప్రత్యేకించి సైనిక శిక్షణలో పెరిగిన జీవన దృక్పథానికి ఇవి అవరోధాలుగా మారుతున్నాయి. అత్యంత దయనీయమైన విషయం ఏమిటంటే, యావత్ సైనిక బలగాలపై ఇది తీవ్ర ప్రభావం కలిగిస్తుంది.

సాధారణ ప్రజలకు సంబంధించినంతవరకు సొంత ప్రయోజనాల కంటే సైనికులు, వారి అధికారులు ప్రదర్శించే సేవా భావాన్ని చాలా ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈ సమాచార యుగంలో దేశంలో ఏం జరుగుతోంది, వివిధ రాజకీయ పార్టీల రాజకీయ విన్యాసాలు ఎలా ఉంటున్నదీ సైనికులకు పూర్తి అవగాహన ఉంటోంది. అధికారం నిలుపుకోవడానికి, ఎన్నికల్లో విజయం సాధించడానికి పార్టీలు ఏమేం చేస్తున్నది కూడా ఇప్పుడు సైన్యానికి బాగానే తెలుసు. ఈ నేపథ్యంలో పక్షపాత రాజకీయ వైఖరిని స్పష్టంగా ప్రదర్శిస్తున్న ఒక ప్రత్యేక రాజకీయ పార్టీకి విశ్వాసం ప్రకటించేలా సైన్యంలో కొందరు సీనియర్ అధికార్లు రాజకీయ ప్రభావాలకు గురవుతోందనిపిస్తోంది. రాజకీయాలకు అతీతమైన, పాక్షిక దృక్పథం లేని సైన్యం భారతీయ ప్రజాస్వామ్యాన్ని ఎత్తిపడుతుంది. భారతీయ సైన్యం వృత్తిగతతత్వానికి అది ప్రతీకగా ఉంటుంది.

రాజ్యాంగం రీత్యా సైనిక బలగాలు ప్రజాస్వామికంగా ఎన్నికైన రాజకీయ నాయకత్వానికి పార్టీలతో పనిలేకుండా, నిష్పాక్షికంగా లోబడి ఉంటాయి. ఉండాలి కూడా. దీనివల్లే అధికారం శాంతియుతంగా మారినప్పుడల్లా ఎలాంటి సంక్షోభాలు లేకుండా ప్రభుత్వాలు గద్దెనెక్కగలుగుతున్నాయి. భారత ప్రజలు కూడా ఎలాంటి నిర్బంధ ప్రమాదం లేకుండా ఎవరు పాలించాలన్న ఎంపికను ఎంచుకోగలుగుతున్నారు. మరోమాటలో చెప్పాలంటే, సైన్యం ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉంటే.. ప్రజలచేత ప్రజాస్వామికంగా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు జాతీయ భద్రతా విధానపు విశ్వసనీయ అమలుపై ఆధారపడి పాలన సాగించలేరు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయపార్టీలపై, సైన్యంపై, ప్రభుత్వ పాలనపై ప్రజల విశ్వాసం చెదిరిపోతుంది. రాజకీయాలకు అతీతమైన సైన్యం విభిన్న రాజకీయ పార్టీల ప్రతినిధులను వారి సైద్ధాంతిక దృక్పథాలతో పని లేకుండా సమానంగా గౌరవిస్తుంది. దీనికంటే మించి, సైనిక బలగాల నిర్వహణ రాజకీయ ప్రక్రియను బట్టి కాకుండా, పూర్తి వృత్తిగత నైపుణ్యంతో కొనసాగాలి. సైనిక వృత్తి ప్రాతిపదికపై ఉనికిలో ఉన్న నిబంధనలు, నియమావళిని ఇక్కడ నేను ప్రస్తావించదల్చుకోలేదు. వాటి గురించి అందరికీ తెలుసు, మీడియా ఇప్పటికే వాటిని చాలా వరకు ప్రచారం చేసింది.

ఇప్పుడు సాయుధ బలగాల సీనియర్ అధికారులు మీడియా ముందుకు వచ్చి, బహిరంగంగా ప్రభుత్వానుకూల రాజకీయ వైఖరులను ఎందుకు వ్యక్తపరుస్తున్నారు అన్నదే కీలకప్రశ్న. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న సాయుధ కమాండ్‌పై ఇది ఎలాంటి ప్రతికూల ప్రభావాలు కల్పిస్తుందన్న ఆలోచన కూడా లేకుండా వీరు ఇలాంటి వ్యవహారాలకు దిగుతున్నారు. ప్రభుత్వం తమకు కల్పించిన అన్ని అవకాశాలకు కృతజ్ఞతగా తమ విశ్వాసాన్ని ఈ రకంగా ప్రదర్శించడానికి పూనుకుంటున్నారా? ప్రభుత్వానికి అనుకూలంగా బహిరంగంగా ఒకసారి సైన్యాధికారులు ప్రకటన చేశాక దానిపై తర్వాత ఎన్ని వివరణలు ఇచ్చినా, తమ వ్యాఖ్యను సమర్థించుకునే ప్రయత్నాలు చేసినా దాని ప్రతికూల ప్రభావాన్ని ఎన్నటికీ తుడిచిపెట్టలేవు. సీనియర్ సైనికాధికారుల ప్రకటనలపై ఆధారపడటానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం ప్రజల వాణిని, వారి అభిప్రాయాలను పట్టించుకోవలసి ఉంది. వివిధ పార్టీలకు చెందిన విస్తృత ప్రజావర్గాల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ❑

# నేను ఈ దేశపు పౌరుడినేనా ?

**మాడభూషి శ్రీధర్**
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్



"ఏ వ్యక్తికీ పౌరసత్వం ఆటోమేటిక్‌గా దొరకదు, ప్రతి వ్యక్తీ తనకు పౌరుడిగా ఉండే అర్హతలున్నాయని రుజువు చేసుకోవలసిందే" – ఈ మాట నేను చెప్పడం లేదు, హోం శాఖ ప్రకటించింది. ప్రతి పౌరుడు తనను తాను పౌరుడని రుజువు చేసుకోవలసిన దుస్థితి. ఎందుకొచ్చింది? నన్ను ఓటు అడిగి, నా వంటి వారి ఓటుతో గెలిచి నన్ను పౌరుడిగా రుజువు చేసుకొమ్మంటారా అని లక్షలమంది పౌరులు అడుగుతున్నారు.

పౌరసత్వ చట్టం, దాని సవరణ చట్టం 2019 జాతీయ పౌర పట్టిక, జాతీయ ప్రజాపట్టిక వంటి శాసనాల అమలు ప్రభావం గురించి ఆలోచించవలసి ఉంది. జనాభా లెక్కల్లో మిమ్మల్ని లెక్కిస్తే మీరు ఈ దేశ ప్రజ అవుతారే గాని, ఈ దేశ పౌరుడు కాదు. జాతీయ ప్రజా పట్టికలో మీ పేరు నమోదు చేస్తే మీరు జనంలో ఒకరవుతారు కాని పౌరుడని గుర్తించినట్టు కాదు. మీరు ఆధార్ కార్డు చూపితే మీకు ఆధార్ ఉన్నట్టే అవుతుంది కాని అది పౌరసత్వానికి రుజువు కాదు. మీకు ఓటరు కార్డు ఉందా, ఉంటే ఓటేయొచ్చు కానీ, మీరు పౌరుడని దేశం ఒప్పుకోదు. మీకు పాస్ పోర్టు ఉన్నా అది పౌరసత్వానికి రుజువులు కావు.

ఈ మాటలు సాక్షాత్తూ హోం మంత్రి అమిత్ షా చెప్తున్నారు. "ఏది పౌరసత్వానికి రుజువో ఇప్పుడే చెప్పలేము. నియమాలు తయారు చేస్తున్నారు. అప్పుడు ఏ పత్రాలతో పౌరసత్వం రుజువు చేసుకోవాలో వివరిస్తాం. ఇప్పటికి అధికారికంగా చెప్పేదేమంటే ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, పాస్‌పోర్టు ఉన్నంత మాత్రాన పౌరసత్వానికి రుజువు కాబోవు" అని డిసెంబర్ 21న కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర హోం శాఖ అధికార ప్రతినిధి చెప్పిందేమంటే జన్మించిన స్థలం లేదా తేదీ లేదా రెండూ ఇవ్వడం ద్వారా పౌరసత్వం రుజువుచేసుకోవలసి ఉంటుందని. ఏ పత్రాలు లేని వారు నిరక్షరాస్యులు తన స్థానికతను రుజువు చేసుకోవడానికి ఎవరయినా వ్యక్తిగత సాక్షులను తెచ్చుకోవచ్చునని వివరించారు. కానీ.. జన్మస్థలం, పుట్టిన తేదీకి సంబంధించి వ్యక్తిగత సాక్షులు ఎవరుంటారు? వారిని నమ్మను పొమ్మంటే గతేమిటి? పౌరసత్వ చట్టం సవరణ 2019 కింద పూర్తి ప్రక్రియ వివరాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ న్యాయశాఖతో సంప్రదించి త్వరలో రూపొందిస్తుందని హోం శాఖ ప్రతినిధి వివరించారు. దీని తరువాత "ఏ వ్యక్తికీ పౌరసత్వం ఆటోమేటిక్‌గా దొరకదు, ప్రతి వ్యక్తీ తనకు పౌరుడిగా ఉండే అర్హతలున్నాయని రుజువు చేసుకోవలసిందే" అని అధికారికంగా ప్రకటించారు. అంటే ఫలానా వ్యక్తి పౌరుడు కాదని రుజువు చేసే బాధ్యత ప్రభుత్వం తనపై ఉంచుకోలేదు. తాను పౌరుడినని రుజువు చేసుకోవలసిన బాధ్యత భారం పౌరుడిదే.

ఒకవేళ పౌరుడినని రుజువు చేసుకోలేకపోతే పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. ఆ వ్యక్తి విదేశీయుడైపోతాడు. విదేశీయుల ట్రిబ్యునల్ కూడా విదేశీయుడే అని తేల్చితే వాడి గతి దారుణం. డిటెన్షన్ సెంటర్లో ఉండిపోవాలి. హైకోర్టులో ఈ నిర్ణయాన్ని సవాలు చేయవచ్చు. ఎన్నేళ్లలో హైకోర్టు తీర్పు చెబుతుందో, దానికి ఎంత ఖర్చవుతుందో, ఆ ఖర్చు పెట్టుకోలేని వారి గతి ఏమవుతుందో చెప్పలేము. ఇవి పుకార్లు కావు, అనుమానాలు కావు. ప్రభుత్వ అధికారిక ప్రకటనల పరిణామాలు. ఈ ప్రశ్నలకు ఆధారం ఏమంటే అస్సాంలో 1600 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సాగించిన పౌరసత్వ నమోదు ప్రక్రియ అనుభవంలో ఎదురైన సవాళ్లు. 19 లక్షల పైచిలుకు ప్రజలు పౌరులు కాదని అస్సాం తుది పౌర జాబితా తేల్చివేసింది. అస్సాంలో ఒక్క డిటెన్షన్ సెంటర్ కోసం 46 కోట్ల రూపాయలు వెచ్చించింది. పౌరులని రుజువు చేసుకోలేక విదేశీయులని ముద్రపడిన మూడు వేలమందికి అందులో స్థలం దొరుకుతుంది. 19 లక్షల మంది అస్సామీయులను పౌరులు కాదని తేల్చిన నేపథ్యంలో వారందరికీ డిటెన్షన్ సెంటర్లలో వసతి కల్పించాలంటే 27 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా. అందుకు సిద్ధంగా ఉంది కేంద్ర ప్రభుత్వం. అస్సాంలో నిరసన జ్వాలలు ఎగసిపోతుంటే నిరంకుశంగా అణచి వేస్తున్నది. బీజేపీ సీనియర్ నాయకులు పార్టీ వదిలిపోతున్నా పట్టించుకోవడం లేదు. ఎట్టి పరిస్థితిలో అస్సాంలోనూ దేశవ్యాప్తంగానూ జాతీయ పౌరసత్వ పట్టిక తయారు చేయాలని పట్టుబట్టింది కేంద్రం. ❑

# చలికాలపు "వడ"గాలులు!



**మందలపర్తి కిషోర్**

మా చిన్నప్పుడు సాంఘిక శాస్త్ర వాచకంలో, "భారత దేశములోని వాతావరణ పరిస్థితిని సమశీతోష్ణ స్థితి అందురు" అని చదువుకున్నాం. అంతేకాదు– సమశీతోష్ణ స్థితి నెలకొనివున్న దేశాల్లో ఎండాకాలంలో వేడిగానూ, శీతాకాలంలో చల్లగానూ ఉంటుందని కూడా చదువుకున్నాం. అయితే, 2019 శీతా కాలంలో దేశమంతటా "వడ" గాలులు వీచడం చూసి ఆశ్చర్యమని పించింది! అంతకు మించి, మనపాలకులే ఈ "వడ" గాలులు వీచేలా ప్రత్యేక ఏర్పాట్లు చెయ్యడం మరింత విడ్డూరంగా కూడా అనిపించింది. అయితే, పాలకులు ఏంచేసినా అందులో ఎంతెంతో అంతరార్థం ఉంటుందని మనకు తెలుసు కనక, అదేమిటో గ్రహించే ప్రయత్నం చేస్తున్నామిక్కడ– అంతియ!

మా చిన్నప్పటి సాంఘిక శాస్త్ర వాచకాలు రాసినవాళ్ళు మామూలు మేస్టార్లు. అసలు శీతోష్ణ స్థితి గురించి వాళ్లకి ఏమైనా తెలుసా తెలీదా? అనే అనుమానం వస్తోందిప్పుడు. ఎందుకంటే, ఇప్పుడు దేశమంతటా "వడ"గాలులు వీయిస్తున్న వాళ్ళేమన్నా తక్కువ వాళ్ళా? పరమ శివుడే తొలి ప్లాస్టిక్ సర్జెన్ అంటూ – సాక్షాత్తూ సైన్స్ కాంగ్రెస్ వేదిక మీదనుంచే– ఢంకా బజాయించిన విజ్ఞాన ఖనులు వారు! మంచుకురిసే వేళలో సర్జికల్ స్ట్రైక్స్ జరిపిన పక్షంలో ఆ విషయం రాడార్లు పసిగట్టలేవని సైనిక నిపుణులకు సలహా చెప్పిన మేధావులు వారు! శ్రీహరికోట అంతరిక్ష నౌకా ప్రయోగ కేంద్రంలో చంద్రయాన్–2 లాంటి కీలక ఘట్టం జరుగుతున్న వేళ, స్వయంగా దగ్గిరుండి– వ్యవహారం మొత్తం పర్యవేక్షించిన మహానుభావులు వారు. ఇక, ఆర్థిక విధానాల రంగంలో ఒకదానితర్వాత మరొకటిగా ప్రయోగాలు చేస్తూ, రఘురాంరాజన్ లాంటి ప్రపంచ ప్రసిద్ధ ఆర్థిక నిపుణులకు అదురుపుట్టిస్తున్న సాహస వీరులు వారు! అలాంటి ప్రవాచకులతో, సాదాసీదా వాచకాలు రాసుకునే మేస్టార్లను పోల్చడానికి ఎంత గుండె ధైర్యం ఉండాలి?

ఇంతకీ, కాలం కాని కాలంలో, ఈ "వడ" గాలులు ఎందుకు వీస్తున్నట్టు?

సదరు "వడ" గాలుల ద్వారా సాధించదలిచిన మహత్తరమైన ఆ యొక్క ప్రయోజనం ఏమిటి??

ఈ ప్రశ్నలకు సూటిగా గానీ, నిజాయితీతో కానీ మన ప్రభువులు సమాధానం చెప్పడం లేదు. నెలకు మూడు వానలు క్రమం తప్పకుండా కురిసేలా చెయ్యడానికే –ఇంటింటా ధాన్యలక్ష్మి నాట్యం చెయ్యడానికే– అన్ని ఋతువులూ, పంచాంగంలో రాసినట్టుగా ఠంచనుగా రావడానికే– ఈ "వడ" గాలులు వీయిస్తున్నామని ప్రభువుల ఉవాచ! అందులో నిజమెంతో అనుభవసారం వడగట్టిన మన ప్రజలకు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు! అయినప్పటికీ, సర్కారు వారి తరఫున సోషల్ మీడియాలోని ప్రభువర్గాల అస్మదీయులు అసలు విషయం కుండబద్దలు కొట్టి మరీ చెప్తూనే ఉన్నారు!

అస్మదీయులు కానివాళ్లను –అనగా, "మాయాబజార్" భాషలో తసమదీయుల్ని–ఎక్కడికక్కడ వడగట్టి పారేయడమే ఈ "వడ"గాలుల లక్ష్యం అని చెప్పి సోషల్ మీడియాలో పాలక పక్షీయులు కొందరు తెగబడి చెప్తున్నారు. "ఇంతకీ ఎవరయ్యా ఈ తసమదీయులు?" అంటారేమో, చిత్తగించండి! సదరు తసమదీయులు మన "సంఘం" సభ్యులు కాకపోవచ్చు– మన పార్టీవాళ్ళు కాకపోవచ్చు– మన మతస్థులు కాకపోవచ్చు– మన కులస్థులు కాకపోవచ్చు– గత రెండు ఎన్నికల్లో ఒక్కసారి కూడా మనకి ఓటు వేసినవాళ్లు అయి వుండకపోవచ్చు– మనకు పెద్దగా భిన్నం కాని "ప్రతిపక్షానికి" ఓటు వేసిన వాళ్ళు కావచ్చు– లేదా, కుళ్ళి గవులు కంపు కొడుతున్న మన మహోన్నత సదాచారాలను విమర్శించే "కుసంస్కారులు" కావచ్చు– మనకి నచ్చని రీతిలో వస్త్రధారణ చేసుకునేవాళ్లూ కావచ్చు– మనకి రాని భాషలు వచ్చిన వాళ్ళు సైతం కావచ్చు– ఒక్క మాటలో చెప్తే, మనకి నచ్చని వాళ్ళెవరైనా సరే "తసమదీయులే!" ముందుగా పౌరసత్వ జాబితాల్లోంచీ, తదనంతరం జనాభా లెక్కల జాబితాల్లోంచీ, ఈ తసమదీయుల్ని వడగట్టే ప్రయత్నం అధికారికంగా మొదలైంది 2019 శీతాకాలంలోనే. అందుకే వాటిని చలికాలపు "వడ" గాలులు అనేది!

సామాన్య దేశవాసుల గురించిన "సమగ్ర గుర్తింపు సమాచారం" రూపొందించడమే ఈ యొక్క "జాతీయ జనాభా పట్టిక" యొక్క లక్ష్యమని ప్రభువులు విన్నవిస్తున్నారు. దాని మాట అలా ఉంచండి– ఎందుకంటే, ఈ జాతీయ జనాభా పట్టిక నిజానికి ఇంకా రంగం మీదికి రాలేదు. ప్రస్తుతం సా.......గుతున్న

అంకం పేరు పౌరసత్వ (సవరణ) బిల్లు అను చట్టం. ఇది "అల్పసంఖ్యాకులు" అనే పేరిట హిందుత్వ వాదులు ప్రేమగా పిల్చుకునే విభిన్న వర్గాల మధ్య చిచ్చు రగిలించడానికే పుట్టుకొచ్చిందని ప్రముఖ సంపాదకులూ, రచయితలూ, కళాకారులూ, మేధావులూ, మరియూ ఇప్పుడిప్పుడే కళ్ళుతెరుస్తున్న బుద్ధిజీవులు –అనగా, విద్యార్థులూ– అంటున్నారు. ముందు ముందు కథ మరిన్ని ఆసక్తికరమైన మలుపులు తిరిగే సూచనలున్నాయన్నది ఈ బుద్ధిజీవుల హెచ్చరిక!

ఉదాహరణకి, "హిందువులు"గా గుర్తింపు పొందినప్పటికీ హిందుత్వ వాదాన్ని సమర్థించని వారిని ఈ జాబితాల్లోంచి "వడగట్టే" సౌకర్యం ప్రభువులకు ఎప్పుడూ ఉంటుంది. అదే విధంగా, జనన పత్రాలనూ– తమ తాత తండ్రులు ఈ గడ్డమీదే పుట్టి పెరిగినట్లు రుజువు చేసే అధికారిక పత్రాలనూ చూపించలేని అట్టడుగు బీదా బిక్కీ వర్గాలనూ ఈ జాబితాల్లోంచి "వడగట్టే" సౌకర్యం కూడా ప్రభువులకు ఉంటుంది. ఇలా మరెందరినో ఈ "వడ"గాడ్పులు వడగట్టేయగలవు!

సమశీతోష్ణ స్థితి నెలకొనివున్న దేశాల్లో ఎండాకాలంలో వణుకు పుట్టించే శీతవాయువులు వీచే అవకాశం ఉందని కానీ, శీతాకాలంలో గూబలు గుయ్యిమనిపించే వడగాలులు వీచే ప్రమాదం ఉంటుందని గానీ మా చిన్నప్పటి సాంఘిక శాస్త్ర వాచకాల్లో చదువుకోలేదు. అవును మరి– మేం చిన్నప్పుడు చదువుకున్నది సోషల్ వాచకమాయె; ఇప్పుడు వడగాలులు వీయిస్తున్నది యాంటీ సోషల్ ప్రవాచకులు కదా! అదీ కథ!

ఈ కాలమ్ చదివే వాళ్లలో చాలామంది –రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంగా– జర్మన్ లూథరన్ మతాధికారి మార్టిన్ నిమోలర్ చేసిన "కన్ఫెషన్" చూసే వుంటారు. మరొక్కసారి వాళ్లకి ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఆ పశ్చాత్తాప ప్రకటనను గుర్తు చేయాలనిపిస్తోంది.

"ముందుగా వాళ్ళు సోషలిస్టుల కోసం వచ్చారు;
అప్పుడు నేను మౌనం వహించాను–
ఎందుకంటే మరి, నేను సోషలిస్టును కాను!
తర్వాత, వాళ్ళు ట్రేడ్యూనియనిస్టుల కోసం వచ్చారు;
అప్పుడు కూడా నేను మౌనం వహించాను–
ఎందుకంటే మరి, నేను ట్రేడ్యూనియనిస్టును కూడా కాను!
ఆ తర్వాత, వాళ్ళు యూదుల కోసం వచ్చారు;
అప్పుడు కూడా నేను మౌనం వహించాను–
ఎందుకంటే మరి, నేను యూదునూ కాను!
చివరికి, వాళ్ళు నా కోసమే వచ్చారు;
కానీ నా కోసం గొంతెత్తి మాట్లాడ్డానికి ఒక్కడూ మిగల్లేదు!"

నిమోలర్ ప్రకటించిన పశ్చాత్తాపం తిరిగి ప్రకటించాలని అనుకోని వాళ్లంతా ఈ చలికాలపు "వడ"గాలులను తిప్పికొట్టక తప్పదు! ❑

## ఫ్రెడరిక్ ఎంగెల్స్
## ద్విశత జయంతి ప్రత్యేక సంచిక
### వ్యాసాలకు విజ్ఞప్తి



ఇది ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి సంవత్సరం. మార్క్సిజం, మార్క్స్ రచనలు, మార్క్స్–ఎంగెల్స్‌ల సంయుక్త రచనలు, ఎంగెల్స్ రచనల సమాహారం. ప్రపంచాన్ని దోపిడీ నుండి విముక్తి చేసే ఒక కొత్త తాత్విక, ఆర్థిక, చారిత్రక దృక్పథాన్ని అది వివరిస్తుంది.

జాతీయ స్ఫూర్తి 2020 ఫిబ్రవరి సంచికను **"ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి ప్రత్యేక సంచిక"** గా రూపొందిస్తున్నది. ఎంగెల్స్ జీవితము, సాగించిన సిద్ధాంత కృషి ప్రతిబింబించేలా ఈ సంచికకు వ్యాసాలను పంపించవలసినదిగా కోరుతున్నాం.

ఎంగెల్స్ రచనల మీద, మార్క్స్ – ఎంగెల్స్‌ల సంయుక్త రచనల మీద విశ్లేషణలు, పుస్తక పరిచయ వ్యాసాలను టైపులో నాలుగు, అయిదు పేజీలకు మించకుండా ఏదో ఒక అంశం మీద 2020 జనవరి 30 లోగా అందేలా పంపండి.

**email : dvvsvarma1946@gmail.com**

# నెరవేరని దళిత రాజకీయ ఆకాంక్షలు

ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ



ప్రాచీన సాహిత్యంలో 'చండాలులు', 'అవర్ణులు', 'పంచములు' మొదలైన పేర్లతో పిలిచే నేటి దళితులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అనేక ఒడిదుడుకులను అధిగమించి సుదీర్ఘ పోరాటం తర్వాత ఇప్పుడు 'దళితులు' (ఖండించబడిన వారు అని ఒక నిరసనతో కూడిన పేరుతో) ఎక్కువగా పిలుస్తున్నారు.

బౌద్ధ సాహిత్యంలో పేర్కొన్న 'నాగ', 'యక్ష' జాతులు ఇప్పటి దళితులే అనే అభిప్రాయం కూడా పరిశోధకులలో ఉంది. బ్రాహ్మణ మత సాహిత్యంలో అదే 'నాగులు', 'యక్షులు' వైదిక కర్మకాండలను నాశనం చేసే దుర్మార్గులుగా పేర్కొనడం విశేషం.

ప్రాచీన కాలంలో కులవ్యవస్థ ఏర్పడి, సామాజిక అంతస్తులలో పైనున్న కులాలు తమకంటే కింది కులాల పట్ల అంటరానితనాన్ని పాటించడం మొదలయ్యాక సహజంగానే అంటరానితనానికి, పరాయీకరణకు, వివక్షకు గురయ్యే కులాలను ఇతరులు ఒక విధమైన ద్వేష భావంతో చూడడం, వారిని పరాయి వారిగా పరిగణిస్తూ శత్రుపూరితంగా వ్యవహరించడం మామూలే.

ఆ క్రమంలో పై కులాలు ఈనాటి 'దళితుల' పరంగా 'చండాలుడు', 'అవర్ణుడు' వంటి పదాలను ఉపయోగించి ఉండవచ్చు. వైదిక సాహిత్యంలో చెప్పిన చాతుర్వర్ణ వ్యవస్థ పరిధిలోకి రాని వారిని 'పంచములు'గా పేర్కొనడం కూడా వారిని సమాజంలో కలుపుకోకపోవడంలో భాగమేనని అర్థమవుతుంది.

దళితులపై ఇతరులు అంటరానితనాన్ని పాటించడం మొదలై ఎంతకాలమైందో స్పష్టంగా తెలియక పోయినా వారు బ్రాహ్మణ వాదాన్ని, మతాన్ని అంగీకరించక బౌద్ధాన్ని అనుసరించడం, వైదిక కర్మ కాండలను ధిక్కరించడం వారిపై ఇతరుల శత్రుత్వానికి, తద్వారా పరాయీకరణకు కారణాలని తెలుస్తుంది.

## రాజ్యాధికారం భావ సమాలోచన

శ్రామికులు, దళితులు, బహుజనులు, మైనారిటీలు రాజ్యాధికారంలో తగిన పాత్రను పోషించలేక పోతున్నారు. బహుజనులు, దళితులు తమకు రాజ్యాధికారం దక్కాలన్న ఆకాంక్షను పదే పదే వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికలలో అలాంటి ప్రయత్నాలు ఒకటి రెండు సార్లు జరిగినా అవి ఫలితాలను ఇవ్వలేదు.

ప్రస్తుత పరిస్థితి ఏదో ఒక పార్టీకి ఓటు బ్యాంకులుగానే మనుగడ సాగిస్తున్నారు. మన ఎన్నికల వ్యవస్థ కుబేరుల సొత్తు అయింది. మరో పక్క హిందూత్వ జాతీయవాదం ముసురు కొస్తున్నది. డా అంబేద్కర్ సారథ్యంలో అందరికీ సమాన హక్కులు కల్పించిన ప్రజాస్వామ్య రాజ్యాంగం ప్రమాదంలో పడుతున్నది. డా అంబేద్కర్ ఒకనాడు దహనం చేసిన మనువాదం ఇప్పుడు పాలనకు తహ తహ లాడుతున్నది.

ఈ నేపథ్యంలో సకల శ్రామికులకు, దళితులకు, బహుజనులకు, మైనారిటీలకు రాజ్యాధికారం అన్నది తప్పనిసరి చర్చనీయాంశం అవుతున్నది. ఈ తరగతుల ప్రజలు అత్యధిక సంఖ్యాకులైనప్పటికీ వీరిమధ్య రాజకీయ ఐక్యత ప్రస్నార్థకంగానే వుంటున్నది. కేవలం నినాదంతోనే ఈ తరగతుల ప్రజల మధ్య రాజకీయ ఐక్యత సిద్ధించదు. అంతకు ముందు ఈ తరగతుల మధ్య సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాలలో ఒక ఉమ్మడి దృక్పథం పాదుకొనాలి. దానికి తగిన చైతన్యాన్ని కలిగించే భావ విప్లవం ఈ తరగతుల ప్రజలను ఆవహించాలి. ఈ పునాది మీదే అది రాజకీయ ఉద్యమంగా విజయాలను సాధిస్తుంది.

అలాంటి ఉమ్మడి చైతన్యాన్ని, ఉమ్మడి దృక్పధాన్ని కల్పించడానికి ఈ తరగతుల ఆవేదనలనూ, ఆకాంక్షలను వ్యక్తం చేస్తున్న మేధావులు, రచయితలు కవులు, కళాకారులు, ఉద్యమ కారులు అందరికీ ఒక ఉమ్మడి వేదిక అవసరం. ఇలాంటి ఉమ్మడి భావ విప్లవానికి దోహదం చేసే విధంగా జాతీయ స్ఫూర్తి అభిప్రాయ వేదికను నిర్వహిస్తున్నది. ఈ అభిప్రాయం వేదికను వినియోగించుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

మీ అభిప్రాయాలను, రచనలను ఈ కింది ఈ మెయిల్‌కు పంపండి. dvvsvarma1946@gmail.com ❑

అంటరానితనం అనే శిక్షలో భాగంగా గ్రామాలలో దళితులు వూరెలపటితనాన్ని, పేదరికాన్ని, 'నీచ' వృత్తులైన చెప్పులు కుట్టడం, గొడ్డు తోలుతో వివిధ పనిముట్లు తయారు చేసి ఇతరులకు అందించి వారిచ్చే 'మిరాసి' ద్వారా జీవనోపాధిని పొందడం, చచ్చిన పశువులను తరలించడం, చనిపోయిన వారి దహన కార్యాలు నిర్వర్తించడం చేశారు.

వారు పై కులాలవారి చావుకు డప్పు కొట్టడం, ఇతరుల మల, మూత్రాలు ఎత్తిపోసే పారిశుద్ధ్య పనులు, వ్యవసాయ కూలీలుగా, పెత్తందారీ కులాల దగ్గర వెట్టి చాకిరీ, పాలేరుతనం చెయ్యడం వంటి అనేక వృత్తులను తరాలుగా చేశారు. కనీస గుర్తింపు, గౌరవం లేకుండా సమాజపు అట్టడుగు పొరల్లో జీవిస్తూ వచ్చారు. దళిత స్త్రీలపైన పెత్తందారీ కులాల లైంగిక దోపిడీ, వేధింపులూ ఎక్కువే!

మతం పేరుతో వారిపైన తెలంగాణలో 'జోగిని', 'మురళి' రాయలసీమలో 'బసివి', ఉత్తరాంధ్రలో 'దేవుడమ్మ', దక్షిణ కోస్తా జిల్లాలలో 'మాతంగి' వ్యవస్థలు ఆ స్త్రీలను ప్రచ్ఛన్న వ్యభిచార కూపంలోకి నెట్టాయి.

గ్రామదేవతారాధనతో ముడిపడిన ఈ సంస్కృతి పెద్ద దేవాలయాల్లోని 'దేవదాసీ' వ్యవస్థను పోలి ఉన్నప్పటికీ దేవదాసీల వలే గ్రామీణ పేద స్త్రీలైన వీరికి ఎలాంటి ఆర్థిక వెసులుబాటు ఉండదు.

దళితులు ప్రాచీన కాలంలో వైదిక హిందూ మతాన్ని కాదని చార్వాక, లోకాయత తాత్విక ధోరణుల వైపు వెళ్లి తర్వాత బౌద్ధాన్ని అనుసరించారు. మధ్యయుగాల్లో సామాజిక సమానత్వాన్ని ప్రతిపాదించిన వీరశైవ మతాన్ని స్వీకరించి 'జంగములు' గా, వైష్ణవాన్ని పాటించి 'దాసరులు'గా కొంత ఊరట పొందారు. కొందరు ఇస్లాం స్వీకరించారు.

వీటికి తోడు గ్రామ దేవతారాధనలో వారే పూజారులుగా, పోతురాజు వంటి పాత్రల్లో తమదైన మత విధానాన్ని పాటించారు. అయితే బ్రిటీషు వారితో పాటు వచ్చిన క్రైస్తవ మిషనరీలు దళితులకు చేసిన సేవ, మతమార్పిడి ద్వారా అంది వచ్చిన చదువు, పరిశుభ్రత, ఆత్మగౌరవం దళితుల చరిత్రలో కీలకమైన అధ్యాయం అని చెప్పొచ్చు. అప్పటిదాకా అంటరానితనం, వివక్ష, ఆర్థిక పరాధీనత, వెట్టిచాకిరీల కింద నలిగిపోయిన దళితులకు క్రైస్తవ మతం చదువుకునే అవకాశాన్ని, తద్వారా ఆత్మగౌరవాన్ని బహూకరించిందని చెప్పాలి.

క్రైస్తవ మిషనరీలు దళితవాడల్లో నెలకొల్పిన 'లేబర్ స్కూళ్లు'.. తరాలుగా విద్యకు, మర్యాదకు దూరమై వెట్టి బతుకులు ఈడుస్తున్న దళితులకు బాహ్య ప్రపంచపు ద్వారాలను తెరిచాయి. తొలితరం విద్యావంతులైన కొందరు పాశ్చాత్య భావజాలం వైపు ఆకర్షితులై సంఘ సంస్కరణకు పూనుకున్నారు. క్రమంగా వెట్టి చాకిరీ, పాలేరుతనం, వారిపై రుద్దిన 'హీన' వృత్తులను వదిలి మిషనరీ స్కూళ్లు, హాస్టళ్లలో చేరారు. తొలినాటి దళిత కవి బోయి భీమన్న రాసిన 'పాలేరు' నాటకం ఈ పరిస్థితికి అద్దం పడుతుంది.

విద్యావంతులైన దళితులు తమ వ్యక్తిగత జీవితాలలో వెలుగులు నింపుకోవడమే కాక సంఘ సంస్కర్తలుగా, కవులు, రచయితలుగా, పాత్రికేయులుగా తమ సమాజాభివృద్ధికి కృషి చేశారు. అయితే, కొందరు దళితులు చైతన్యవంతులై గ్రామీణ కుల సమాజపు వివక్ష నుంచి తప్పించుకుని వెళ్లి సైన్యంలో కింది స్థాయి సిపాయిలుగా, బొగ్గు గని కార్మికులుగా జీవనోపాధిని పొంది కుల రక్కసి కోరల నుంచి బయట పడ్డారు.

అంతేకాదు పొరుగు దేశాలైన బర్మా, శ్రీలంకలలో కార్ఖానాలలో పనివారుగా జీవనోపాధిని పొందిన చైతన్యం కూడా ఆంధ్రప్రదేశ్ దళితులకు ఉందనే చెప్పాలి. అలాంటి వారు గోదావరి జిల్లాలలో కనిపిస్తారు. వీరి సంఖ్య చాలా తక్కువే అయినా వారి చైతన్యం చెప్పుకోదగినది.

20 శతాబ్దం మొదట్లో జరిగిన దళిత ఆత్మగౌరవ ఉద్యమాల ఫలితంగా ఈ ప్రాంతపు దళితులు తమ పూర్వపు కుల గుర్తింపును వదిలి 'ఆది ఆంధ్ర' అనే కొత్త కులంగా మారారు. అది 1930వ దశకంలో మొదలయింది.

మహారాష్ట్రలో మహర్లు తమ విముక్తి ప్రదాత అయిన అంబేడ్కర్ తో పాటు బౌద్ధాన్ని స్వీకరించాక 'నియో–బుద్ధిస్ట్' అనే కొత్త రకం సామాజిక గుర్తింపును పొందినట్టు ఆంధ్ర ప్రాంతంలో కూడా దళితులు అటువంటి సామాజిక చలనానికి దారులు వెతికారు.

వ్యవసాయ కూలీలుగా, కౌలుదారులుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా అత్యధిక శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడే తెలుగు రాష్ట్రాల దళితులు భూమిపై సొంతదార్లుగా ఉన్న సందర్భాలు తక్కువ.

ఎంతో కష్టపడి ఎకరం, రెండెకరాలో సంపాదించుకునే దళితులను గ్రామాలలో పెత్తందారీ కులాల భూస్వాములు పెట్టే తిప్పలు అన్నీ, ఇన్నీ కావు. వారిని తమ భూములు సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకోవడం, వారి పంట చేలోకి గొడ్లను తోలి నాశనం చెయ్యడం, పొలంలోకి నీరు, దారి ఇవ్వకుండా

అడ్డుకుని ఆ భూమిని సాగు చేసుకోలేని స్థితికి వారిని నెట్టడం, చివరికి వారు ఆ చిన్నపాటి భూమిని కూడా వదులుకోవడం వంటి సంఘటనలు కూడా చరిత్రలో చోటుచేసుకున్నాయి.

కానీ, వారి శ్రమ లేనిదే ఎక్కడా వ్యవసాయ రంగ అభివృద్ధి ఊహించలేం. దళితుల కష్టంతోనే హరిత విప్లవాలు వర్ధిల్లాయని చెప్పాలి.

బ్రిటీషువారి రాకతో పాటు వచ్చిన క్రైస్తవ మిషనరీలు దళితుల జీవితాలలో నింపిన వెలుగు కంటే వారి పరంగా డాక్టర్. బి.ఆర్. అంబేడ్కర్ వంటి సామాజిక విప్లవకారులు రాజ్యాంగం ద్వారా సాధించి పెట్టిన హక్కులు, అవకాశాలు, ఆయన తన కార్యాచరణ ద్వారా అందించిన ఆత్మగౌరవ చైతన్యం దళితుల తరతరాల సంకెళ్లను తెంచాయనవచ్చు.

రాజ్యాంగం ద్వారా వచ్చిన రిజర్వేషన్లతో వారి ఆర్థిక, సాంఘిక పరిస్థితులలో చెప్పుకోదగిన మార్పు వచ్చింది. ఉద్యోగాల్లో స్థిరపడిన వారు గ్రామాలను వదిలి పట్టణాలలో నివసిస్తూ గ్రామీణ కుల సమాజపు దుర్భర స్థితి నుంచి కూడా బయటపడగలిగారు.

మొదటి తరం విద్యావంతుల్లో ఎక్కువగా స్కూలు టీచర్లుగా, మిలిటరీ సర్వీసుల్లోనూ, పోలీసు సర్వీసులోనూ, స్త్రీలైతే నర్సులు, ఆయాలు, టీచర్లుగా ఉద్యోగాలు పొందారు. క్రమంగా ప్రభుత్వ రాయితీలు ఉపయోగించుకుని ఉన్నత విద్య ద్వారా పై స్థాయి ఉద్యోగాలలో కూడా స్థిరపడ్డారు.

దళితులు విద్య ఉద్యోగ రంగాలలో కొంతమేరకు స్థిరపడినప్పటికీ ఇంకా వారిలో నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగం, ఆరోగ్య భద్రత లేకపోవడం, ప్రభుత్వం కల్పించే రాయితీలను అందిపుచ్చుకునే చైతన్యం, స్థాయి లేకపోవడంతో పాటు వారిపై పెత్తందారీ కులాల వివక్ష, దోపిడీ అనేక రంగాలలో నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది.

ఇంకా అత్యధిక శాతం దళితులు వ్యవసాయ రంగంపై ఆధారపడే కూలీలుగా, కౌలుదారులుగా గ్రామాలలో నివసిస్తూ కుల వివక్షను, శ్రమ దోపిడీని, స్త్రీలు లైంగిక దోపిడీని ఎదుర్కొంటున్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో దళితులు అత్యధికంగా 25.39% గా ఉన్నప్పటికీ వారిలో 37 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువున జీవిస్తూ కనీసపు అవసరాలు, సౌకర్యాలు లేకుండా అతి తక్కువ జీవన ప్రమాణాలతో జీవిస్తున్నారు.

వీరిలో 54 శాతం మంది దళిత బాలలు పోషకాహార లోపంతో రోగాల బారినపడి నెట్టుకొస్తున్నారు. ప్రతి వెయ్యి మంది బాలల్లో 83 మంది శారీరక లోపాలతో పుట్టి ఏడాదిలోపే మరణిస్తున్నారు.

దళితులలో ఇంకా 45 శాతం మంది నిరక్షరాస్యులుగానే ఉన్నారు. గ్రామాలలో దళిత స్త్రీల అక్షరాస్యత 37.8 శాతం మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. 27 శాతం మంది దళిత స్త్రీలకు కనీసం ప్రసూతి సౌకర్యాలు లేక దురవస్థపాలవడం గమనార్హం.

మూడొంతుల దళిత గృహాలకు నీరు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవు. గ్రామాలలో వీరికి వైద్యం అందించడానికి ప్రాథమిక వైద్య ఆరోగ్య సిబ్బంది సుముఖంగా లేకపోవడం కుల వివక్ష వల్లనేనన్నది అర్థమవుతోంది.

ఇంకా అనేక ప్రభుత్వ పాఠశాల్లో దళిత విద్యార్థులు ఇతర విద్యార్థులకు దూరంగా, విడిగా కూర్చుంటున్నారు. గ్రామాల్లో దళితులకు పోస్టులో వచ్చే ఉత్తరాలను బట్వాడా చేయికపోవడం ఇంకా కొనసాగడం కుల వివక్ష తాలూకు రూపంగానే అర్థం చేసుకోవాలి.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం 15 శాతం కేసుల్లోనే నిందితులను అదుపులోకి తీసుకోగా, ఇంకా 85 శాతం కేసులు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో నివేదిక ప్రకారం దళితులపై నేరాలు ఇటీవల కాలంలో 66 శాతం పెరిగాయని తెలుస్తుంది. ప్రతిరోజు కనీసం ముగ్గురు దళిత స్త్రీలు దేశంలో ఎక్కడో ఒక చోట అత్యాచారానికి గురౌతున్నారు. ఇద్దరు దళితులు హత్యకు గురౌతున్నారు. కనీసం రెండు దళిత గృహాలను పెత్తందారీ కులస్తులు తగలబెడుతూ కనీసం పదకొండు మంది దళితులను శారీరకంగా చిత్ర హింసలపాలు చేస్తున్నారు.

మరోవైపు కొన్ని గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతూనే ఉంది, వారికి దేవాలయ ప్రవేశం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దళిత స్త్రీలపైన పెత్తందారీ పురుషుల వేధింపులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. జోగినీ వ్యవస్థ గ్రామాల్లో నిరాటంకంగా కొనసాగుతుంది. తెలంగాణలో సుమారు పది వేల మంది, ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది వేల మంది స్త్రీలు ఇంకా జోగినీ వ్యవస్థలో మగ్గుతున్నట్టు అంచనా.

తెల్ల బట్టలు వేసుకున్నారని, గుడిలోకి వెళ్లారని, గుర్రం పైన తిరిగారని, మీసం పెంచారని, తమ వీధుల్లో ఊరేగింపులు

☞ మిగతా 45వ పేజీలో

# పని చేసేందుకు నాకొక రాజకీయ పార్టీ కావాలి!

రేకా కృష్ణార్జునరావు
మానవ వికాస మండలి, మంగళగిరి



ఈ వ్యాసంలో నేను ఏ పార్టీలనైతే వద్దని చెప్పానో దాదాపుగా ఆ పార్టీలన్నీ నాకు కావలసినవి. నేను ఆ పార్టీల శ్రేయోభిలాషిని.

అయితే ఆ పార్టీల మూల సిద్ధాంతాలను ఆమోదించుతూనే – ఆ పార్టీలు ఆచరణలో అనుసరిస్తున్న కొన్ని విధానాల పట్ల నేను కొంత అసంతృప్తి కలిగి ఉన్నాను.

ఆ అసంతృప్తుల ఆధారంగానే కింద కొన్ని విషయాలను చెప్పటం జరిగింది. నేను ఇష్టపడే పార్టీలలో ఒక మంచి మార్పును ఆశించి చేసిన మిత్ర పూరిత విమర్శే తప్ప ఇది ఏ ప్రగతిశీల పార్టీపై రాళ్లు వేయటం కోసం కాదని తెలియజేస్తున్నాను.

మార్క్స్ వాద, అంబేద్కర్ వాద సంస్థలు, పార్టీలు బాగా బలపడాలని, వాటి మధ్యన ఉన్న అగాధాలు బాగా తగ్గాలని, అవి కలసి ఐక్యంగా పని చేయాలని, అంతిమంగా లాల్ – నీల్ పార్టీలు తమ ఐక్యతా బలంతో అజేయమైన శక్తిగా ఎదగి, ఈ దేశంలో సమగ్ర సామాజిక విప్లవాన్ని సాధించాలని, నా ప్రగాఢ వాంఛ. నా వాంఛను సాఫల్యం చేసుకునేందుకు చేసిన ఒక చిరు ప్రయత్నమే కింద నేను రాసిన మేటర్.

కార్యకర్తగా పని చేసేందుకు నాకొక రాజకీయ పార్టీ కావాలి!

- ఆ పార్టీ మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగం పట్ల విధేయత కలిగి ఉండాలి – అన్ని రాజ్యాంగ వ్యవస్థల పట్ల గౌరవ భావం ఉండాలి.
- కాలానుగుణంగా రాజ్యాంగంలో మార్పులు అనివార్యమైనప్పుడు భారత రాజ్యాంగానికి మూల స్థంభాలుగా ఉన్న స్వేచ్ఛ – సమానత్వం – సౌభ్రాతృత్వాలకు ఎంత మాత్రం భంగం కలుగకుండా ఆ పార్టీ రాజ్యాంగ మార్పులు చేసుకునేదిగా ఉండాలి.
- ఆ పార్టీకి వర్గ – కుల స్పృహ రెండూ ఉండాలి – కుల నిర్మూలన, వర్గ నిర్మూలన రెండింటిని అది ప్రధాన లక్ష్యాలుగా కలిగి ఉండాలి.
- సమాజంలో సగభాగంగా ఉన్న మహిళల విషయంలో మహిళా విముక్తి, మహిళా సాధికారత, మహిళా సమానత్వం పట్ల చిత్తశుద్ధి కలిగి ఉండాలి.
- నూటికి 85 శాతంగా ఉన్న బహుజన కులాల (SC, ST, BC, మైనార్టీల) సర్వతోముఖాభివృద్ధి ఆశయం ఆ పార్టీ కలిగి ఉండాలి.
- ఆ పార్టీ వర్గ పోరాట ముసుగులో కుల తత్వాన్ని దాచి ఉంచ కూడదు – అలాగే కుల నిర్మూలనా పోరాట ముసుగులో వర్గ దోపిడీని దాచి ఉంచకూడదు.
- అది ఏ రూపంలోను కులాన్ని బట్టి మనిషిని గౌరవించే మనువాద సంస్కృతిని పాటించ కూడదు – అగ్ర కులాల్లో పుట్టిన సంఘ సంస్కర్తలను, అభ్యుదయ, ప్రగతిశీల, విప్లవ వాదులను వారివారి నిస్వార్థ, పోరాట, త్యాగాల ప్రాతిపదికపై వారి పట్ల సమున్నత గౌరవాన్ని చూపించుటలో అది ఎలాంటి తటపటాయింపులు పడకూడదు.
- ఆ పార్టీ నూరు సంవత్సరాల అంబేద్కర్ వాద ఉద్యమం కోట్లాది బహుజనుల జీవితాల్లో తెచ్చిన వెలుగును చూడకుండా ఆ ఉద్యమంలో ఉండే లోపాలను మాత్రమే చూసేదిగా అది ఉండకూడదు. అలాగే నూరు సంవత్సరాల కమ్యూనిస్టు ఉద్యమం నడిపిన వీరోచిత ప్రజా పోరాటాలను, వారు చేసిన త్యాగాలను చూడ నిరాకరించి, కేవలం ఆ ఉద్యమంలో ఉన్న దోషాలను మాత్రమే చూసే వైఖరి ఆ పార్టీకి ఉండకూడదు.
- అది కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని పాటించేదిగా కాకుండా – బహుజన ప్రజాస్వామ్యాన్ని అమలు పరచే పార్టీగా ఉండాలి.
- ఆ రాజకీయ పార్టీ వారసత్వ నాయకులను తయారు చేసేది గాను, వ్యక్తి పూజ అమలు పరచేది గాను ఉండకూడదు – బుద్ధుడు, పూలే, మార్క్స్, అంబేద్కర్ వంటి మహోన్నతులను వారి గొప్ప సందేశాలను సందర్భానుగుణంగా పదే పదే గుర్తు చేసుకోవటాన్ని వ్యక్తి పూజగా పరిగణించరాదు.

❖ ఏ మహనీయుని బోధనలైనా గుడ్డిగా అనుకరించ కూడదు – మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మహనీయుల బోధనలను వారి సామాజిక స్ఫూర్తికి భంగం కలగని రీతిలో సృజనాత్మకంగా మార్పులు చేసుకోగల సైద్ధాంతిక శక్తి ఆ పార్టీకి ఉండాలి.

❖ ఆ పార్టీ ఎన్నికల్లో చేసేది చెప్పాలి – చెప్పింది చెయ్యాలి.

❖ ఎన్నికల్లో గెలుపు కోసం ఆ పార్టీ అడ్డ దారులు తొక్క కూడదు. ఎవరితోను రహస్య ఒప్పందాలు చేసుకోకూడదు – ప్రజాస్వామిక విలువలను, రాజకీయ విలువలను, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఆ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకూడదు.

❖ అగ్రకుల ధనాఢ్య వర్గాలు ఓట్లు కొనటం కోసం అలవాటు చేసి కొనసాగిస్తున్న డబ్బు, మద్యం, పలావు వంటి దిగజారుడు పద్ధతులను తాను కూడా కొనసాగించే అధమ స్థితికి దిగజారిన పార్టీ కాకూడదు.

❖ ఆ పార్టీ రకరకాల ప్రలోభాలతో ప్రజలను ఆకర్షించేదిగా కాకుండా – మంచితనం, పట్టుదల, ధైర్యం, త్యాగం వంటి ఉన్నతమైన సుగుణాలతో, ప్రజా పోరాటాలలో రాటుదేలి ప్రజాభిమానం పొందాలి. ప్రజలు అటువంటి పార్టీ గెలుపుని తమ గెలుపుగా భావించుకోవాలి.

❖ ఆ పార్టీ మతోన్మాద, మనువాద శక్తులతో రాజీపడి వారికి మద్దతు ఇవ్వటం గానీ, వారి మద్దతు పొందటం గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు.

❖ మతోన్మాద, మనువాద శక్తుల చెలిమితో పొందే విజయం కంటే వారితో పోరాడి పొందే అపజయం మన బహుజన సమాజానికి మేలైన విషయంగా భావించాలి.

❖ పార్టీ పరంగా రాజకీయ, అధికార పదవులు పొందే యావలో కొట్టుకుపోతూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని, వారి సామాజిక పోరాట చైతన్యాన్ని పక్కదారులు పట్టించటం గానీ, నీరు గార్చటం గానీ చేయని పార్టీ కావాలి.

❖ దోపిడీ పాలకవర్గ పార్టీలతోను, అలాంటి వ్యక్తులతోను ప్రజా సమస్యలపై ఎత్తుగడల వైఖరితో పని చేయాలి – దళిత, ఆదివాసీ, బహుజన, కమ్యూనిస్టు, అభ్యుదయ, ప్రగతిశీల, హేతువాద, విప్లవవాద సంస్థలతోను – అలాంటి వ్యక్తులతోను ప్రజల సమస్యలపై ఐక్యతా దృక్పథం కలిగి పనిచేసే పార్టీ కావాలి.

❖ నేను కోరుకునే రాజకీయ పార్టీకి తన ఆర్థిక, రాజకీయ, సాంఘీక, సాంస్కృతిక, ధార్మిక, సిద్ధాంతాలకు భౌతిక వాద, మానవీయ తత్వాలు పునాదులుగా ఉండాలి.

❖ ఆ పార్టీ ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమస్యలకు ఎంత ప్రాధాన్యతను ఇస్తుందో – అలాగే సాంస్కృతిక, వైజ్ఞానిక, హేతువాద, మానవీయ విషయాలకు అంత ప్రాధాన్యతను ఇవ్వాలి – రాజకీయ అధికారం పొందాక అన్ని రంగాల్లో అప్పుడు మార్పులు తీసుకు వద్దామనే వాయిదా వైఖరి లేని పార్టీ కావాలి.

❖ "మాటలు చూస్తే కోటలు దాటుతాయి – కాలు చూస్తే గడప దాటదు" అన్నట్టుగా ఉంటూ కేవలం పండిత చర్చలు మాత్రమే చేస్తూ, క్రియా శీలకమైన ప్రజా పోరాటాలకు దూరంగా ఉండే పండితుల పార్టీ నాకు వద్దు.

❖ మాటలు తప్ప చేతలు కానరాని విప్లవ వాగాడంబర పార్టీ నాకు వద్దు.

❖ ప్రజలకు, ప్రజా చైతన్యానికి దూరంగా జరిగిపోయే ఏ అతి వాద పార్టీ నాకు వద్దు.

❖ ఉనికి కోసం విజ్ఞప్తులు, నిరసన కార్యక్రమాలు, మహనీయుల జయంతులు, వర్ధంతులు చేస్తూ, ఇక అవే గొప్ప సామాజిక విప్లవ కార్యక్రమాలుగా సరిపెట్టుకునే పార్టీ నాకు వద్దు.

❖ SC వర్గీకరణ ఉద్యమంలో చొరవగా ముందుకు వచ్చి తమ అభిప్రాయాలను వ్యక్తం చేయలేని పార్టీ నాకు వద్దు.

❖ ఈ దేశంలో గొప్ప శ్రామిక విప్లవ సమూహాలైన మాల, మాదిగలు రిజర్వేషన్ల సమస్యపై తీవ్ర వైషమ్యాలు పెంచుకుంటుంటే చిత్తశుద్ధితో ఆ వైషమ్యాలను తొలగించే ప్రయత్నం చేయకుండా చోద్యం చూస్తూ ఉండిపోయిన పార్టీలు నాకు వద్దు.

❖ SC వర్గీకరణ విషయంలో విధానపరంగా పైకి ఒకటి చెప్పి, ఆచరణలో తమ అవసరాల రీత్యా మరోలా వ్యవహరించిన పార్టీలు నాకు వద్దు.

❖ రాజకీయంగా ఒక ఉన్నతమైన గౌరవం పొందటం కోసం వ్యక్తులుగా పెట్టుకున్న వ్యక్తిగత పార్టీలు నాకు వద్దు.

❖ వర్గీకరణ విషయంలో తమ అభిప్రాయాలను చెప్పకుండా దాట వేస్తూ కాలం గడుపుతున్న పార్టీలు నాకు వద్దు.

❖ కుల హత్యలను ఖండించలేని, కులాంతర వివాహాలు జరిపించి వాటికి అండగా ఉండలేని, కులాంతరసాహిత్యాన్ని, సంస్కృతిని పెంపొందించలేని పార్టీలు నాకు వద్దు.

- ఆర్థిక ఉద్యమాల్లో ప్రాణ త్యాగానికైనా వెనుకాడక పోరాడటం – కుల నిర్మూలనా ఉద్యమాల్లో పత్తా లేకుండా పారిపోవటం చేసే పార్టీలు నాకు వద్దు.
- చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకున్న చందంగా తమ పార్టీ గత కాలంలో చేసిన పోరాటాలను, త్యాగాలను చెప్పుకుంటూ నేడు స్వభజన పార్టీలుగా మనుగడ సాగిస్తున్న పార్టీలు నాకు వద్దు.
- ఎప్పుడూ ఆత్మస్తుతి – పరనిందలకు పాల్పడే పార్టీలు నాకు వద్దు.
- మిత్ర వైరుధ్యాలు, శత్రు వైరుధ్యాల పట్ల సరైన అవగాహన లేకపోవటం – మిత్ర సంస్థలతో కలహాలు పెంచుకోవటం, శత్రు సంస్థలతో చెలిమిని కొనసాగించటం చేసే పార్టీలు నాకు వద్దు.
- గత కాలంలో అంబేద్కర్, కమ్యూనిస్టు ఉద్యమాలలో చోటు చేసుకున్న విభేదాలను ఈనాడు చూపించి, నేడు ఆ రెండు ఉద్యమాల మధ్య వైషమ్యాలను పెంచే పార్టీలు నాకు వద్దు.
- కత్తెర ఏక వస్త్రాన్ని అనేక ముక్కలుగా చేస్తుంది – సూది అనేక ముక్కలను కలిపి ఒకటిగా కుడుతుంది. నాకు ప్రగతిశీల శక్తుల మధ్య ద్వేష వైషమ్యాలను పెంపు చేసే కత్తెర వంటి పార్టీలు వద్దు – ద్వేష వైషమ్యాలను రూపుమాపి ప్రగతిశీల శక్తులను ఏకం చేయగల సూది వంటి పార్టీ కావాలి.
- ఓ వైపున అంబేద్కర్ వాద సంస్థలు, పార్టీలు బలపడుతూ అవి అన్నీ ఐక్యతా మార్గంలో పయనించాలి – మరో వైపున మార్క్స్ వాద సంస్థలు, పార్టీలు బలపడుతూ అవి అన్నీ ఐక్యతా మార్గంలో పయనించాలి – ఈ ఐక్యతా దృక్పథమే మార్క్స్ వాద, అంబేద్కర్ వాద ఉద్యమాల మధ్యన ఉన్న అగాధాన్ని తొలగించి మనువాదాన్ని మట్టి కరిపించగల మహా శక్తివంతమైన పార్టీ ఆవిర్భావానికి నాంది పలకాలి.
- నాకు తిరుమావలన్, చంద్ర శేఖర్ ఆజాద్, జిగ్నేష్ మేవాని, ఆనంద్ తేల్ Thumble, కన్నయ్య కుమార్, ఉమర్ ఖాలీద్ వంటి చరిత్రను తిరగరాస్తున్న నాయకులు సారథ్యం వహించే పార్టీలు కావాలి. ఈ యువకిశోరాలు భవిష్యత్తులో అంతా కలసి మహాశక్తివంతమైన ఏకపార్టీని స్థాపించగలరని ఆశించటం అత్యాశ కాదని నమ్ముతున్నాను. ❑

---

## నెరవేరని దళిత రాజకీయ ఆకాంక్షలు

**(42వ పేజీ తరువాయి)**

జరిపారని, సినిమా హాల్లో పక్కనే కూర్చుని సినిమా చూస్తే కాలు తగిలిందని రకరకాల సాకులతో దళితులపై దేశవ్యాప్తంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి.

ఇటీవల తెలుగు రాష్ట్రాలలో దళితులను వివాహం చేసుకున్నారని, ప్రేమించారని పరువు హత్యలు, వెలివేతలు పెచ్చుమీరాయి. దళితులకు ప్రభుత్వం ద్వారా లభించిన చిన్నపాటి భూములు పెత్తందారీ కులాలవారు లాక్కుని అదేమని అడిగితే వారిపై భౌతిక దాడులకు పాల్పడడం వంటి సంఘటనలు ఎక్కువయ్యాయి.

ఆత్మగౌరవంతో వారు తలయెత్తిన చోట ఏదో ఒక సాకుతో వారిపై దాడి చేయడం, రకరకాలుగా కట్టడి చేయడం చూస్తుంటే దళితులు అభివృద్ధితో , ఆత్మవిశ్వాసంతో ముందుకొస్తే పెత్తందారీ కులాలు తరాలుగా అనాయాసంగా అనుభవించిన ఆధిపత్యం ఇక చెల్లదనే భావనతో చేస్తున్నారనిపిస్తుంది.

అంబేద్కర్ కృషి వల్ల వచ్చిన రాజ్యాంగ పరమైన హక్కులు, రిజర్వేషన్లు దళితుల భౌతిక అవసరాలు కొరతను కొంత మేర తీర్చినా ఇంకా వారిలో అధిక శాతం మంది పేదరికపు కోరల్లోనే చిక్కి ఉన్నారు. సామాజిక ఉద్యమాలు అందించిన చైతన్యం ఇంకా పూర్తిస్థాయిలో రాజకీయ చైతన్యంగా మారలేదు.

అంబేద్కర్ అన్నట్టు సామాజిక, ఆర్థిక రంగాలలో ప్రజాస్వామ్యం రానంత వరకూ వారికి రాజ్యాంగం ద్వారా లభించిన రాజకీయ హక్కులను ఉపయోగించుకునే పరిస్థితి ఉండదు.

అందుకే దళితులు దేశ జనాభాలో 25 శాతానికి పైగా అంటే సుమారు 300 మిలియన్ల మంది అంటే ఇతర సామాజిక వర్గాలందరి కంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ వారు తమ రాజకీయాలను నిర్మించుకోకపోవడం వల్లే ఇంకా దేశంలో పరాయివారిగా నిరంతరం దాడులకు, వివక్షకు గురవుతున్నారు.❑

**– బిబిసి తెలుగు సౌజన్యంతో...**

# ఆంధ్రప్రదేశ్ 44వ చరిత్ర మహాసభలపై సమీక్ష

1976లో కావలిలోని జవహర్ భారతి కళాశాలలో స్థాపితమైన ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ నిరాఘాటంగా వార్షిక సమావేశాలు నిర్వహించుకుంటూ తన 44వ సమావేశాన్ని ఈ సంవత్సరం జనవరి 4,5 తేదీల్లో కర్నూలు కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) లో జరుపుకుంది.

జాతీయస్థాయిలో శాస్త్రీయమైన పద్ధతిలో, లౌకికదృక్పథంతో నిష్పాక్షికమైన చరిత్ర రచననూ అధ్యయనాన్ని పెంపొందించి, ఉపేక్షించబడిన అంశాల ప్రాంతాల, వర్గాల చరిత్రను వెలికితీసి, చరిత్రకారుల మధ్య సంభాషణను సాధ్యం చేసి, చరిత్ర ఫలితాలను అందరికీ చేరవేసే లక్ష్యంతో 1972లో స్థాపితమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ స్ఫూర్తిని ప్రాంతీయ స్థాయికి తీసుకువెళ్ళే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ ఏర్పడింది. ప్రాంతీయ స్థాయిలో చరిత్ర పరిశోధనను ప్రోత్సహించడం, ప్రాంతీయ చరిత్ర రచనలోని సమస్యల్ని చర్చించడం, శాస్త్రీయ లౌకిక చరిత్ర రచనకు పునాదులు వేయడం ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ లక్ష్యాలు. కాంగ్రెస్ తన తొలి సమావేశాన్ని నిర్వహించు కోవడంలో జవహర్ భారతి అప్పటి ప్రిన్సిపల్ డా॥ యం. పట్టాభిరామిరెడ్డి చొరవ, కంభంపాటి సత్యనారాయణ, ఒంగోరె వంటి ప్రముఖ చరిత్రకారుల మద్దతు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి వచ్చిన పరిశోధకులు, మేధావులు పాల్గొన్న తొలి సమావేశం అనంతర సమావేశాలకు ఒరవడిని సృష్టించింది.

అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ క్రమం తప్పకుండా వార్షిక సమావేశాలు నిర్వహించడమే కాకుండా వార్షిక కార్యకలాపాలను పరిశోధనా పత్రాలను ప్రొసీడింగ్స్ వాల్యూమ్‌గా ప్రచురించడం, మోనోగ్రాఫ్‌లు అచ్చు వేయడం, జిల్లాస్థాయి సమావేశాలు నిర్వహించడం చేస్తున్నది. ఈ క్రమంలో డా॥ రుద్రయ్య చౌదరి, రావిప్రోలు సుబ్రహ్మణ్యం వంటి చరిత్రకారుల అంకిత భావంతో సంస్థ బలపడింది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల వివిధ వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవడం, బయటి రాష్ట్రాల చరిత్రకారులతో సంబంధాలు ఏర్పరచుకుని బలపరచు కోవడం, ప్రాంతీయ జాతీయస్థాయి దృక్పథాలు గల పరిశోధకుల మధ్య చర్చ జరిగేలా చూడడం వంటివి కూడా సంస్థ లక్ష్యపరిధిలో ఉన్నాయి.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ స్ఫూర్తే కాకుండా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ మార్గదర్శనం కూడా సంస్థ నిర్మాణం లో నిర్వహణలో నిర్దేశాలలో ఉంది. సంస్థ ప్రతి సంవత్సరమూ జనవరి నెల మొదటి శని, ఆదివారాలలో వార్షిక సమావేశాల్ని నిర్వహిస్తుంది. జాతీయ, ప్రాంతీయ స్థాయిలో గుణాత్మక పరిశోధన చేసిన చరిత్రకారుల్ని అధ్యక్షులుగా ఆహ్వానిస్తుంది. రాష్ట్రవ్యాపితంగా ఉన్న చరిత్ర పరిశోధకులు అధ్యాపకులు తమ పరిశోధనా పత్రాల్ని ఆంధ్రదేశ చరిత్ర చేసిన ప్రాచీన, మధ్య, ఆధునిక, స్థానిక, చరిత్ర రచనా శాస్త్ర అనే ఐదు విభాగాలలో ఏకకాలంలో సాగే సమావేశాలలో పత్ర సమర్పణ చేస్తారు. ఐదు విభాగాలకు ఆయా అంశాలలో ప్రజ్ఞ కలిగిన చరిత్రకారులు అధ్యక్షత వహిస్తారు. పరిశోధన ప్రామాణికత మీద చర్చ జరుగుతుంది. విభాగ అధ్యక్షులు పరిశోధనా పత్రాల ప్రచురణార్హతను నిర్ణయిస్తారు. అర్హత పొందినవి ఐయస్‌యస్‌యన్ కలిగిన ప్రొసీడింగ్స్ వాల్యూమ్‌లో ప్రచురించబడతాయి.

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 43 సంవత్సరాలుగా వార్షిక సంచికల్ని ప్రచురిస్తూనే ఉంది. వార్షిక సమావేశాలకు అధ్యక్ష, విభాగ అధ్యక్షులను ఆరు నెలలు ముందుగానే ఆహ్వానించి, వారి ప్రసంగాలను తెప్పించి ముద్రించి సమావేశాల నాటికి ప్రతినిధులకు అందిస్తుంది. జాతీయ అంతర్జాతీయ స్థాయి నందుకున్న రొమిల్లా థాపర్, బిపన్‌చంద్ర, ఆర్‌యస్ శర్మ, ఇర్ఫాన్ హబీబ్, హర్బన్స్ ముఖియా, సుమిత్ సర్కార్ వంటి చరిత్రకారులు సమావేశాలకు అధ్యక్షత వహించి సంస్థ స్థాయిని పరిపుష్టం చేశారు. ప్రముఖ చరిత్రకారుడు మామిడిపూడి వెంకటరంగయ్య పేరిట ఏర్పడిన ఫౌండేషన్‌తో కలిసి సంస్థ ఆయన పేరిట వార్షిక సమావేశంలో నిర్వహించే స్మారకోపన్యాసం సంస్థ ప్రామాణికతకు గీటురాయి. పైన పేర్కొన్న ఉద్ధండులైన చరిత్రకారుల్లో అనేక మంది అధ్యక్షత వహించడమే కాక ఈ స్మారకోపన్యాసం కూడా చేశారు. ఆ ఉపన్యాసాలలో ముఖ్యమైన వాటిని ఒక సంకలనంగా తీసుకు రావాలనే ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే అది సంస్థ కృషికి మేలిమి ఉదాహరణగా నిలుస్తుంది.

'వాస్తవం పవిత్రమైనది. దాని వ్యాఖ్యానం వ్యక్తిగతమైనది' అనే చరిత్ర మౌలిక సూత్రాన్ని సంస్థ విశ్వసిస్తుంది. అందువల్లనే జాతీయస్థాయిలో చరిత్ర వ్యాఖ్యానంలో సాగిన జాతీయవాద మార్క్సిస్టు వాద, ఉపశ్రేణీ వ్యాఖ్యానాలన్నీ ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ చర్చల్లో ప్రతినిధుల పరిశోధనల్లో ప్రతిఫలించాయి. ఉత్తరాధునిక దృక్కోణంలో భాగంగా చరిత్ర ప్రాంతీయ పరిధిని పరిమితం చెయ్యడం ద్వారా లోతునూ, అధ్యయన విస్తృతిని

పెంచి అంచులకు నెట్టివేయబడిన వర్గాల చీకటికోణాల్ని వెలికితీసే లక్ష్యంతో సంస్థ జిల్లాస్థాయి సమావేశాల్ని కూడా నిర్వహించింది. కడప, నెల్లూరు, గుంటూరు జిల్లాలు ఈ వరుసలో ముందున్నాయి.

సంస్థ వ్యవస్థాపక సభ్యుడు, ప్రముఖ చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ప్రధాన సంపాదకత్వంలో లౌకిక శాస్త్రీయ దృక్పథంతో Comprehensive History and Culture of Andhra Pradesh ను సంస్థ 8 సంపుటాలుగా వెలువరించింది. 250 మంది చరిత్రకారుల భాగస్వామ్యంతో ప్రతి సంపుటికీ విడిగా సంపాదకమండలితో, ప్రభుత్వ తోడ్పాటు లేకుండా 65 లక్షల రూపాయల ఖర్చుతో వెలువరించిన బృహత్ గ్రంథం సంస్థ ఉనికిని అర్థవంతం చేసింది. దానికి అనుబంధంగా ప్రచురించిన Sources of History and Culture of Telugu Speaking People భవిష్యత్ పరిశోధనకు దిక్సూచిగా నిలుస్తుంది. ఈ తొమ్మిది సంపుటాల డిజిటలైజేషన్‌తో పాటు సంస్థకు ఒక వెబ్‌సైట్ ను రూపొందించే కార్యక్రమం జరుగుతూ వుండడం అవసరమే. దానికి తోడు సంస్థ అభిమతాల్లో గతంలో తెలుగువారి చరిత్రపై వెలువడి ఇప్పుడు అందుబాటులో లేని ఉత్తమ గ్రంథాలను పునర్ముద్రించడం కూడా ఉంది. అందులో భాగంగా ఆచార్య కె. సుందరం, ఆచార్య సి. సోమసుందరరావు, ఆచార్య రామాయణం నరసింహారావుల గ్రంథాలు ఒక్కొక్కటి పునర్ముద్రణ పొందాయి.

ఆచార్య కె.పద్దయ్య (పూనె) గౌరవాధ్యక్షులుగా 900 మందికి పైగా శాశ్వత సభ్యులున్న సంస్థకు చాలా కాలం గుంటూరు హిందూ కళాశాలలో ఆచార్య సోమశేఖరరావు ఆధ్వర్యంలో ఉన్న కార్యాలయం ప్రస్తుతం ఆచార్య మురళీమోహన్ నిర్వహణలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కొనసాగుతోంది.

ఈ నేపథ్యంలో కర్నూలులో జరిపిన 44వ వార్షిక సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖామంత్రి గౌ॥ ఆదిమూలం సురేష్ ప్రారంభించారు. ప్రారంభసభకు స్థానిక లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ సభ్యులు పలువురు హాజరయ్యారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, చరిత్ర పురావస్తు విభాగ విశ్రాంత ఆచార్యులు డి.భాస్కరమూర్తి అధ్యక్షత వహించారు. ప్రాచీన ఆంధ్రదేశ చరిత్ర, పురావస్తు విభాగానికి చెన్నైలోని శర్మ వారసత్వ కేంద్రం ఆచార్యులు శాంతి పప్పు, మధ్యయుగ ఆంధ్రదేశ చరిత్ర విభాగానికి హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆచార్యులు రేఖా పాండే, ఆధునిక విభాగానికి విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల చరిత్ర శాఖాధిపతి డా॥ మొవ్వ శ్రీనివాసరెడ్డి, స్థానిక చరిత్ర విభాగానికి కర్నూలు పట్టణానికి చెందిన అడ్వకేట్ శ్రీ కె.సి.కల్కూర, చరిత్ర రచనా శాస్త్ర విభాగానికి కలకత్తా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు అరుణ్ కె. బందోపాధ్యాయ అధ్యక్షులుగా 125 మందికి పైగా ప్రతినిధులు హాజరైన సభలో వ్యవహరించారు. ప్రాచీన యుగ విభాగంలో 19, మధ్యయుగ విభాగంలో 25, ఆధునిక యుగ విభాగంలో 41, స్థానిక విభాగంలో 18, చరిత్ర రచనా శాస్త్ర విభాగంలో 5, మొత్తంగా 108 పరిశోధనా పత్రాలు సమర్పించబడినాయి. చరిత్ర రచన శాస్త్ర విభాగానికి అధ్యక్షత వహించిన అరుణ్ కె. బందోపాధ్యాయ Mahatma Gandhi and the Question of Caste in Modern India అనే అంశం మీద మామిడిపూడి వెంకట రంగయ్య స్మారకోపన్యాసం చేశారు.

సభ్యులు, ప్రతినిధులు రచించిన చరిత్ర గ్రంథాలను విడుదల చేసే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సాగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో 8 గ్రంథాలు విడుదల అయ్యాయి. వాటిల్లో డా॥ మల్లిన గాంధీ, డా॥ కె.హెచ్.యస్. సుందర్‌ల సంపాదకత్వంలో కీ.శే. వకుళాభరణం లలిత, ఆచార్య రామకృష్ణల జ్ఞాపికగా వెలువడిన Denotified Tribes in India అనే పుస్తకమూ, డా॥ యస్. కృష్ణారెడ్డి సంపాదకత్వంలో ఆచార్య కిరణ్‌క్రాంత్ చౌదరి సన్మాన గ్రంథాలుగా వచ్చిన Recent Perspectives on Indian Art Architecture and Archaeology, Cultural Heritage of South India అనేవి ఎన్నిక చేయదగ్గవి. ఉత్తమ పరిశోధనా పత్రాలకు ఇచ్చే బహుమతులు 43వ సభలలో పత్ర సమర్పణ చేసిన డా॥ కెకె చౌదరి, పి.హేమ, డా॥ బి.రమేశ్ చంద్రబాబు, ఆర్‌వియస్ రాజు, డా॥ జి. శివరామకృష్ణయ్య, ఖుర్షీద్ అహ్మద్ భట్‌లకు లభించాయి.

రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన సభల చివరలో ప్రముఖ చరిత్రకారిణి అల్లాడి వైదేహి మరణానికి సంతాప తీర్మానం, 'భారతీయ వారసత్వం-సంస్కృతి' ని పట్టభద్ర స్థాయిలో అధ్యయన అంశంగా చేర్చడాన్ని హర్షించే తీర్మానం, హైదరాబాద్ స్టేట్ ఆర్కైవ్స్‌లోనూ, ఇతర చోట్ల ఉండిపోయిన ఆంధ్రప్రదేశ్ చారిత్రక సంపదను తరలించడానికి అంగీకరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపే తీర్మానం, కర్నూలు జిల్లా చారిత్రక ప్రదేశాల రక్షణ, అభివృద్ధిని కోరే తీర్మానమూ, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డా॥ పట్టాభి రామిరెడ్డి కృషికి తగిన గుర్తింపునిచ్చే తీర్మానం, చివరగా సభలకు ఆతిథ్యం ఇచ్చిన కళాశాల ప్రిన్సిపల్ డా॥ సి.వి.రాజేశ్వరికి, నిర్వహణ భారాన్ని సమర్థవంతంగా మోసిన కళాశాల చరిత్ర విభాగాధిపతి, స్థానిక కార్యదర్శి డా॥ ఇందిరా శాంతికి, అధ్యాపక అధ్యాపకేతర బృందానికీ ఎక్కడ చూస్తే అక్కడ తామై అన్ని రకాల సేవలందించిన కళాశాల విద్యార్థినులకూ కృతజ్ఞతలు తెలియచేసే తీర్మానం ఆమోదించబడ్డాయి.

2021లో జరిగే 45వ వార్షిక సమావేశం ప॥గో॥జిల్లా భీమవరంలోని డియన్ఆర్ కళాశాలలో జరుగుతుందని సంస్థ ప్రధాన కార్యదర్శి డా॥ ఆర్. ప్రసాదరెడ్డి చేసిన ప్రకటనతో సభలు ముగిశాయి. **- కొప్పర్తి** ❑